ఆదివారం
16-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 174
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

డ్యాన్స్ చేయకపోతే సస్పెన్షన్

పాట్నా: హోలీ వేడుకల్లో డ్యాన్స్ చేయనందుకు సస్పెండ్ చేస్తానని ఆర్‌జేడీ ఎమ్మెల్యే తేజ్ ప్రతాప్ యాదవ్ పోలీసును బెదిరించారు. దీంతో ఆ పోలీస్ అధికారి డ్యాన్స్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పాట్నాలోని తన నివాసంలో మార్చి 14న హోలీ వేడుకను తేజ్ ప్రతాప్ యాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భద్రత కోసం డ్యూటీలో ఉన్న పోలీస్ అధికారిని డ్యాన్స్ చేయమని ఆదేశించారు. 'నేను ఒక పాట ప్లే చేస్తా. నువ్వు డాన్స్ చేయాలి. లేకపోతే నువ్వు సస్పెండ్ అవుతావు' అని బెదిరించారు. ఇది హోలీ అని, తన వ్యాఖ్యలకు బాధపడవద్దని కూడా చెప్పారు. దీంతో కాస్త సంకోచించినప్పటికీ ఆ పోలీస్ అధికారి చివరకు డ్యాన్స్ చేశారు.

పాలమూరును పడావుపెట్టావు

- రోజమ్మ రొయ్యల పులుసు తిని విశ్వాసం చూపావు
- మంత్రివర్గం ఆమోదించిందే గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచాం
- సభకు రెండుసార్లు వచ్చి లక్షల్లో జీతం...
- కేసీఆర్ తీరుపై రేవంత్ ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: రోజమ్మ రొయ్యల పులుసు తిని విశ్వాసం చూపిన కేసీఆర్... రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరును పడావు పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. శాసనసభ మూడో రోజైన శనివారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలుపుతూ సీఎం మాట్లాడారు. 15 నెలల్లో కేసీఆర్, సభకు కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారని, ప్రభుత్వ జీతభత్యాలు సుమారు రూ.57.84 లక్షలు తీసుకుని ప్రజలను వారి కర్మకు వదిలేసిన నాయకుడు అంటూ మండిపడ్డారు. మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి వస్తుందని సభ నుంచి వెళ్లిపోయారని విమర్శించారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే మన వ్యవస్థలను నడుపుతున్నామని స్పష్టం చేశారు. 2022 బడ్జెట్ సమావేశాల్లో గత ప్రభుత్వం... గవర్నర్ ప్రసంగం లేకుండానే సమావేశాలు నిర్వహించారని, మహిళా గవర్నర్‌ను అవమానించేలా వ్యవహరించారని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవస్థలను, సంస్థలను గౌరవించుకుంటూ ముందుకు వెళుతున్నామని, సీనియర్లమని, పదేళ్లు మంత్రులుగా చేసినమని చెప్పుకునేవాళ్లు గవర్నర్ ప్రసంగాన్ని తప్పుబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గం ఆమోదం పొందిన అంశాలనే గవర్నర్ తమ ప్రసంగంలో వినిపించారనే విషయం గ్రహిస్తే మంచిదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వంలో అమలు చేస్తున్నామని, మేం అమలు చేసే వాటినే మంత్రివర్గం ఆమోదించి గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచామన్నారు. పదేళ్లు పాలించి మంత్రివర్గం ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారా అంటూ ప్రశ్నించారు. సభ్యులు ప్రస్తావించిన అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుంటామని, ఖచ్చితంగా వారి సూచనలు తీసుకునేందుకు అభ్యంతరం లేదన్నారు.

అన్నదాతలను ఆత్మగౌరవంతో బతికేలా చేశాం

తెలంగాణ ప్రజలు 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రైతులు ఆత్మగౌరవంతో బతికేలా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రైతులకు రూ.20,624 కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికలను అడ్డు పెట్టుకుని ఆనాటి ప్రభుత్వం రైతు బంధు ఎగ్గొడితే, మేం అధికారంలోకి వచ్చిన మొదటి మూడు నెలల్లో రూ. 7,625 కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని వివరించారు. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచామని, భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ప్రతి కుటుంబానికి రూ.12 వేలు అందిస్తున్నామని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోగా వరి వేస్తే ఉరే అని మాట్లాడారని గుర్తు చేశారు. మేం ధాన్యం కొనుగోలు చేసి రూ.1,206 కోట్లు సన్నవడ్లకు బోనస్ అందించామన్నారు. కాళేశ్వరం లేకుండానే రైతులు కోటి 56 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని వెల్లడించారు. రైతు కమిషన్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు.

చంద్రబాబు వద్ద మోకరిల్లింది మీరు కాదా...

పోరాటాలు చేశామని చెప్పుకునే వారు ఆనాడు చంద్రబాబుకు మోకరిల్లి 299 టీఎంసీలు చాలని సంతకం పెట్టి తెలంగాణకు శాశ్వత మరణ శాసనం

- మిగతా 2 లో

నోటికొచ్చింది మాట్లాడి...
పోస్టులు పెడితే ఊరుకోను

విశాలాంధ్ర - హైదరాబాద్: కొంతమంది సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెడితే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. గత కొన్ని రోజులుగా 'భూ భారతి' పేరుతో తనపై సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెట్టిన అంశంపై శనివారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. భూభారతిని తీసుకొచ్చి పేదల భూములను పేదలకు ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నందుకు తనపై కోపం పెంచుకుంటున్నారా అని ధ్వజమెత్తారు. అసలు తనపై అక్కసు వెళ్లగక్కాల్సిన అవసరం ఏమొచ్చిందని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించారు. ప్రజా జీవితంలో ఉన్నందున ఓపిక పడుతున్నానని, పెయిడ్ ఆర్టిస్టులతో తిట్టించి సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడతారని హెచ్చరించారు. ఎవరి పడితే వాళ్లు ఛానల్ పెట్టుకుని ఇష్టారాజ్యాంగ మాట్లాడితే వాళ్లు జర్నలిస్టులు అవుతారా అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో హద్దు మీరుతున్న వారిని ఎలా కట్టడి చేయాలో తెలుసన్నారు. జర్నలిస్టు రేవతి అరెస్టు విషయంలో బీఆర్‌ఎస్ వైఖరిపై సీఎం మండిపడ్డారు. కొందరు పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చి పార్టీ కార్యాలయంలోనే పెట్టి వీడియోలు రికార్డు చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్టు పెటితే వాటిపై పోలీసులు కేసు పెట్టి ఇద్దర్ని అరెస్టు చేశారు. దానికి బీఆర్‌ఎస్ నేతలకు దుఃఖం వస్తుంది కానీ వారు సోషల్ మీడియాలో వాళ్లు పెట్టిన భాష ఓసారి వినండి అన్నారు. జర్నలిస్టుల

- మిగతా 2 లో

ఇస్రో మరో పరీక్ష విజయవంతం

చెన్నై: ఎల్‌వీఎం3 ప్రయోగ వాహనం (ఎల్‌వీఎం-ఎం6) ఆరవ ఆపరేషనల్ మిషన్ కోసం క్రయోజెనిక్ ఇంజిన్‌కు నిర్వహించిన హాట్ టెస్ట్ విజయవంతమైంది. ఈ మేరకు భారత అంతరిక్ష కేంద్రం (ఇస్రో) శనివారం ప్రకటించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపింది. మూడు దశల్లో మీడియం లిఫ్ట్ లాంచ్ వెహికల్‌గా ఎల్‌వీఎం3ని ఇస్రో అభివృద్ధి చేసింది. ప్రయోగానికి ముందు ప్రతి

- మిగతా 2 లో

మాది ద్వేషం కాదు స్వాభిమానం

చెన్నై: హిందీ భాషకు సంబంధించి తమిళనాడు గురించి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రతిపక్షాలు, నెటిజన్లు, తమిళ నటులు, రాజకీయ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హిందీ భాషను ఇతరులపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు ప్రకాశ్ రాజ్ ఆక్షేపించారు. 'హిందీ భాషను మా మీద రుద్దకండి. ఇలా చెప్పడం ఇంకో

- మిగతా 2 లో

కాగ్ నియామక ప్రక్రియపై రేపు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నియామకానికి ప్రస్తుతమున్న ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమంటూ ఓ ఎన్‌జీఓ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సీజేఐతో కూడిన స్వతంత్ర ఎంపిక కమిటీతో పారదర్శక పద్ధతితో సంప్రదింపులు- రాష్ట్రపతి సిఫార్సు ద్వారా కాగ్ నియామకానికి మార్గదర్శకాలు ఉండాలని పేర్కొంది. కాగ్ నియామకానికి మార్గదర్శకాలు...సమాచార కమిషన్లు, కేంద్ర నిఘా కమిషన్లతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

లక్కీడిప్ తీసి.. ఇచ్చేద్దాం సార్! గొడవాదిలిపోద్ది !

కొత్తగూడెంలో విమానాశ్రయం

సీఎం చొరవ చూపాలి: కూనంనేని సాంబశివరావు

స్పీకర్ స్థానంలో కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: కొత్తగూడెంలో విమానాశ్రయం నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నట్లు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటులో సీఎం రేవంత్ రెడ్డి మరింత చొరవ చూపాలని కోరారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నట్లుగానే రెండు కోట్ల మందికిపైగా ఉన్న అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కూనంనేని శనివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లాకు మొదట్లో ప్రాధాన్యత ఇచ్చి ఇప్పుడు వెనక్కి తగ్గడంలో మర్మమేమిటో తనకు అర్థం కాలేదన్నారు. రామగుండం, కొత్తగూడెం జిల్లాలకు విమానాశ్రయం రాకుండా కుట్ర జరుగుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. 'ముఖ్యమంత్రి ప్రసంగం అద్భుతమని పొగడటం లేదు. ఎవరు కూడా ఎప్పుడూ 100 శాతం పనులు చేయలేరు. అదే జరిగితే రాష్ట్రం బంగారం అవుతుంది' అని కూనంనేని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛపై ఇష్టానుసారంగా మాట్లాడం సరికాదని, ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ సంస్కృతి తెలంగాణకు వచ్చిందని వ్యాఖ్యానించారు. జర్నలిస్టులు, రాజకీయ నాయకులు ఎవరికి ఏది తోస్తే అది మాట్లాడటం, అనుచిత పదజాలాన్ని వినియోగించడం తగదని హితవు పలికారు. జర్నలిజం సమాజానికి దిక్సూచిగా ఉండాలి, రాజకీయ నాయకులు సైతం అలాగే ఉండాలని కూనంనేని హితవు పలికారు. శుక్రవారం జరిగిన ఘటనతో శాసనసభ్యులు ఇకపై జాగ్రత్తగా ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంపై మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన చెందారని, ఎక్కడో సమాచార లోపం ఉండవచ్చని ఆయనకు నచ్చజెప్పానని కూనంనేని తెలిపారు. ప్రజా ప్రతినిధులను కలిసే విషయంలో సమన్వయం లోపం లేకుండా సీఎం చర్యలు తీసుకోవాలని సూచించారు. అసభ్య పదజాలలతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే చట్టాలు మార్చాలి లేదా ప్రత్యేక చట్టం తేవాలని రేవంత్‌రెడ్డికి కూనంనేని సూచించారు. ఇదిలావుంటే, కూనంనేని ప్రస్తావించిన అంశాలపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ వారంలో నాలుగు రోజులు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రస్తుత - మాజీ ప్రజాప్రతినిధులను సచివాలయంలో కలుస్తానన్నారు. తనను కలవాలంటే ఒకటి లేక రెండు రోజుల ముందు అపాయింట్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. ఉదయం, రాత్రి అన్న తేడా లేకుండా కొందరు తనను కలవాలనుకోవడం ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టు

- మిగతా 2 లో

మీరేంచేశారో చెప్పండి

- కాంగ్రెస్-బీఆర్ఎస్ మాటల యుద్ధం
- ఆరు గ్యారెంటీల అమలుపై వాగ్వాదం
- కాకపుట్టించిన భట్టి వర్సెస్ వేముల వ్యాఖ్యలు

విశాలాంధ్ర- హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మూడో రోజు శనివారం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తీరును బీఆర్ఎస్ ఎండగట్టే ప్రయత్నం చేసింది. వాటిని కాంగ్రెస్ తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు సాగాయి. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో బీఆర్ఎస్ అధికార పార్టీని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి గృహాలలో నెలకొన్న పరిస్థితి పై విమర్శలు గుప్పించింది. అయితే వీటిపై సీఎం సహా మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు తదితరులు ఘాటుగా స్పందించారు. అన్ని నియోజకవర్గాల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరు గ్యారెంటీ లు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. అసలు మీరు ఏం చేశారో చెప్పండి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉచిత కరెంట్ కు సంబంధించి బాల్కొండ నియోజకవర్గం, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల వివరాలను డిప్యూటీ సీఎం వెల్లడించారు. మేము చేసింది చెప్పుకోలేక పోతున్నాం, వారు అడిగారు కాబట్టి చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 51వేల మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 20వేల మందికే అయిందని లెక్కలు తెప్పించుకొని చూడాలన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. గవర్నర్ ప్రసంగంపై సీఎం సమాధానం ఇవ్వాలి కాని భట్టి ఇస్తున్నాడు, ఆయన క్రెడిట్ ఈయన కొట్టేస్తున్నాడా అంటూ బీఆర్ఎస్ సభ్యులు వ్యాఖ్యానించారు. అయినా వాళ్ల పంచాయితీ మాకెందుకు అంటూనే ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలలుగా మా మీద పడి ఏడుస్తున్నారు తప్ప ప్రజలు మీకు అవకాశం ఇస్తే మీరేం చేశారని ప్రశ్నించారు.

గుండెపై చేయి వేసుకొని నిజాలు మాట్లాడాలి: మంత్రి శ్రీధర్ బాబు

గుండెపై చేయి వేసుకుని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నిజాలు మాట్లాడాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ ఉత్సవాల కోసం రూ.రెండు కోట్లు కేటాయించిందని,

- మిగతా 2 లో

మూడు నెలల్లోనే రైతు రుణమాఫీ

బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారంపై భట్టి ఆగ్రహం

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో యూనివర్సిటీలను గాలికి వదిలేస్తే తాము 12 మంది వీసీలను నియమించామని, సమాజంలో వెనుకబడిన వర్గాలను సైతం తీసుకున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా వర్సిటీకి మొదటిసారి తమ ప్రభుత్వం ఒక దళితుడిని వీసీగా నియమించిందన్నారు. నగరం నడిబడ్డన ఉన్న మహిళ యూనివర్సిటీకి మీరు ఎప్పుడైనా వెళ్లారా అని నిలదీశారు. వర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి, వారసత్వ భవనాల మరమ్మతుకు రూ.15 కోట్లు విడుదల చేశామని

- మిగతా 2 లో

ఆర్ఎల్ఐపీకి అనుమతుల నిరాకరణ
ప్రభుత్వ విజయం

ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ నిర్మించతలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి (ఆర్ఎల్ఐపీ) కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించడం తమ ప్రభుత్వం సాధించిన విజయంగా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో మంత్రి మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర నిబంధనలను ఉల్లంఘించి ఆర్ఎల్ఐపీ నిర్మాణం ఏపీ ప్రభుత్వం చెపట్టిందంటూ కేంద్రం వద్ద తాను పలుమార్లు రాష్ట్రం తరపున వాదనలు వినిపించడంతో పాటు నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్టు నిర్మించాలి అన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యమని ఆయన తెలిపారు. పర్యావరణ చట్టాలను కుడా కాదని ఈ ప్రాజెక్టు ను మొదలు పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృష్ణా జలాల్లో తెలంగాణా వాటాను కాపాడేందుకు పూనుకుందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున తాను నీటిపారుదల అధికారులు ఎన్‌జీటీ, ఎంఓఎఫ్, సీసీలతో పాటు కేఆర్ఎంబీ, కేడబ్ల్యూడీటీ-2 వద్ద పటిష్టమైన వాదనలు వినిపించినందునే ఈ విజయం సాధ్య పడిందన్నారు. ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా ఆర్ఎల్ఐపీ నిర్మాణం చేపట్టడాన్ని కేంద్ర పర్యావరణ మంత్రితో వ్యక్తిగతంగా మాట్లాడి సమగ్రంగా వివరించినట్టు చెప్పారు. దీనితో ఈఏసీ గత నెల 27 న జరిగిన 25 వ సమావేశంలో ఎన్‌జీటీ ఉత్తర్వులను సమీక్షించి నిబంధనలు ఉల్లంఘించి రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అంకురార్పణ చుట్టినట్లు నిర్ధారించుకున్న మీదటనే ఈ నిర్ణయం వెలువరించారన్నారు. పర్యావరణ అనుమతులు పొందాలి అంటే పూర్వ స్థితితో పర్యావరణ అనుమతికి దరఖాస్తు పెట్టుకోవచ్చని స్పష్టం చేయడం తెలంగాణా రాష్ట్ర విజయంగా

- మిగతా 2 లో

పూర్వ వైభవమే లక్ష్యం

- బెంగాల్‌లో తృణమూల్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలుస్తాం
- వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు కృషి చేస్తాం
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రకాశ్ కారత్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో సీపీఎంకు పూర్వ వైభవం తీసుకు రావడమే లక్ష్యంగా కసరత్తు చేస్తున్నామని ఆ పార్టీ జాతీయ సమన్వయకర్త ప్రకాశ్ కారత్ అన్నారు. తృణమూల్, బీజేపీకి వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు కృషి చేస్తామని, ప్రత్యామ్నాయంగా నిలబడాలని సంకల్పించామని శనివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కారత్ తెలిపారు. 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష సంఘటన, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయో లేదో ఇప్పుడే చెప్పలేమని, ఆ దిశగా చర్చలు మొదలు కాలేదన్నారు. బెంగాల్‌లో పట్టు కోల్పోవడంతో పార్టీకి ఓట్లు భారీగా తగ్గాయని తెలిపారు. '1977 నుంచి 2011 వరకు 34 ఏళ్లు పశ్చిమ బెంగాల్‌ను సీపీఎం నేతృత్వ వామపక్ష సంఘటన పాలించింది. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బెంగాల్‌లో తిరిగి అధికారంలోకి రావాలన్న పట్టుదలతో కేడర్‌ను చైతన్యపరుస్తున్నాం. ఇటీవల జరిగిన ఆర్జీ కర్ అత్యాచారం, హత్య ఘటనకు వ్యతిరేకంగా ఆందోళనలతో యువతలో చైతన్యం తీసుకొచ్చాం' అని ఓ ప్రశ్నకు కారత్ బదులిచ్చారు. సీపీఎం ఒక్కటే కాదు... అన్ని వామపక్ష, ప్రగతిశీల శక్తులు కలిసి యువతను చైతన్యపర్చినట్లు చెప్పారు. ఓడిన చోటే గెలవాలని సంకల్పించామని, తమ ఓటర్లను కూడగడుతున్నామని, ఆ దిశగా కొంత పురోగతి సాధించామని కారత్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష సంఘటన కొనసాగుతుందా అన్న ప్రశ్నకు 'గతసారి కాంగ్రెస్‌తో అవగాహన

- మిగతా 2 లో

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయండి

2 లో



"కనిస్టీబు రాజ్యాంగం"

భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా మేటిదని, సర్వ సమగ్రమైందనీ; మన రాజ్యాంగ నిర్మాతలు అందరూ గొప్ప మేధావులని అంటూ ఉంటాం. ఈ మాటలో ఇసుమంత కూడా అసత్యం లేదు. భారత రాజ్యాంగ ముసాయిదాలోని ప్రతి పేజీ, ప్రతి పేరా, ప్రతి పంక్తి, ఒక్కో పదం మీద చాలా సూక్ష్మమైన చర్చ జరిగింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

40 దేశాలపై ట్రంప్ ప్రయాణ ఆంక్షలు!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పుడు రకరకాల ఆంక్షలతో ప్రపంచ దేశాలపై విరుచుపడుతున్నారు. తాజాగా 43 దేశాలపై కొత్తగా ప్రయాణపరమైన ఆంక్షలు విధించే ఆలోచనలో ఉన్నారు. అఫ్ఘానిస్థాన్, ఇరాన్, సిరియా వంటి దేశాల నుంచి వీసా దరఖాస్తులను నిలిపివేయాలని ట్రంప్ సర్కార్ యోచినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. లక్షిత దేశాల జాబితాను అమెరికా భద్రతా అధికారులు, దౌత్యాధికారులు ఇప్పటికే సిద్ధం చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. మొత్తం మూడు విభాగాలుగా ప్రయాణ ఆంక్షలు/నిషేధాలు అమలు చేసేలా కసరత్తు జరుగుతున్నట్లు పేర్కొంది. క్యూబా, అఫ్ఘాన్, ఇరాన్, లిబియా, సోమాలియా, సిరియా, వెనిజులా, యెమన్‌తో సహా మొత్తం 11 దేశాల నుంచి ప్రవేశాలను పూర్తిస్థాయిలో నిషేధించేలా కొత్త ప్రణాళికను అమెరికా రూపొందిస్తోంది.

అలాగే బెలారస్, ఇరిట్రియా, హైతీ, లావోస్, మైన్మార్, పాకిస్థాన్ వంటి దేశాల పౌరులకు ఇమిగ్రెంట్ లేదా టూరిస్ట్ విసాల ద్వారా ప్రవేశాలను నిరాకరించింది. అమెరికా అభ్యంతరం వ్యక్తం చేస్తున్న పద్ధతుల్లో మార్పులు, చేర్పులను 60 రోజుల్లో పూర్తి చేయని పక్షంలో అంగోలా, బెనిన్, కంబోడియా వంటి దేశాల పర్యటకులకూ అమెరికాలో అడుగు పెట్టడం దాదాపు అసాధ్యంగా మారుతుందని నివేదిక తెలిపింది.

నేనేదో సరదాగా అన్నాను...

అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధీష్టించిన 24 గంటల్లో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపేస్తానని వ్యంగ్యంగా అన్నానంటూ ఎన్నికల ముందు మాటలపై ట్రంప్ వివరణ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిసిన తర్వాత అధికార పగ్గాలు చేపట్టకపోతే రాజీ కుదురుస్తానని సరదాగా చెప్పానంటూ నాటి మాటలను ఆయన కొట్టిపారేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు అవుతున్నాగానీ ఇప్పటివరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడంపై వస్తున్న ప్రశ్నలకు ట్రంప్ ఇలా స్పందించారు. 'నేను ఏదో వ్యంగ్యంగా మాట్లాడాను. రాజీ కుదరాలన్నదే నా ఉద్దేశం. అది నేను తప్పక చేస్తాను' అని ఆయన సమర్థించుకున్నారు.

గుంతలు కనిపించరాదనే...

అమెరికాకు వచ్చి ప్రపంచ నేతలకు టెంట్లు, గ్రాఫిటీ, గుంతలు కనిపించకూడదని భావించి రాజధాని వాషింగ్టన్ డీసీని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ట్రంప్ వెల్లడించారు. 'వాషింగ్టన్ డీసీని నేర రహిత రాజధానిగా మార్చనున్నాం. గ్రాఫిటీలు చెరిపేస్తాం. గుడారాలను తొలగిస్తున్నాం.. ప్రపంచం మెచ్చే రీతిలో రాజధానిని తీర్చిదిద్దుతున్నాం' అని ట్రంప్ అన్నారు. భారత ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడు, బ్రిటన్ ప్రధాని వంటివారు అమెరికాకు వచ్చినప్పుడు వారికి టెంట్లు, గ్రాఫిటీ, విరిగిన బారికేడ్లు, రోడ్లపై గుంతలు కనిపించకుండా నగరాన్ని సుందరంగా మార్చామని చెప్పారు. ఎప్పుడు లేనంత పరిశుభ్రంగా, మెరుగ్గా, సురక్షితంగా వాషింగ్టన్ డీసీ ఉండబోదోందన్నారు. ఇందుకోసం ఎక్కువ సమయమేమీ పట్టదని ట్రంప్ తెలిపారు.

కాల్పుల విరమణ జరిగితేనే...

బందీల విడుదలపై హమాస్ స్పష్టీకరణ

కైరో: గాజా స్ట్రిప్‌లో ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ అమలు చేసిన తర్వాతే మిగతా బందీలను విడుదల చేస్తామని హమాస్ శనివారం తేల్చిచెప్పింది. రాజీ దిశగా ఇది అసాధారణ ఒప్పందమని పేర్కొంది. కాల్పుల విరమణపై రెండవ దశ చర్చలలో దీర్ఘకాలంగా జాప్యం జరుగుతున్నదని హమాస్ సీనియర్ అధికారి అన్నారు. చర్చలు బందీలను విడుదల చేసే రోజు మొదలై... ఆపై 50 రోజుల్లోగా పూర్తి కావాలన్నారు. అదే విధంగా మానవతా సాయాన్ని అడ్డుకోవడాన్ని కూడా ఇజ్రాయిల్ ఆపాలని సూచించారు. ఈజిప్టుతో గాజా సరిహద్దు వెంబడి వ్యూహాత్మక కారిడార్ నుంచి ఇజ్రాయిల్ దళాలు వెనక్కి వెళ్లాలన్నారు. బందీలను విడుదల చేయడానికి బదులుగా మరింత మంది పలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని కూడా హమాస్ డిమాండ్ చేస్తున్నది. అయితే హమాస్ మానసికంగా ఒత్తిడి తెచ్చే యుద్ధ తంత్రాన్ని అనుసరిస్తోందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు విమర్శించారు. కాల్పుల విరమణను మరికొన్ని వారాల పాటు పొడిగించడం ద్వారా శాశ్వత రాజీకి అవకాశం ఉంటుందని అమెరికా చెబుతోంది. అదే సమయంలో హమాస్ తీరును ఖండించింది. వెసులుబాట్లు కల్పిస్తున్నట్లు చెబుతూనే పట్టుదలగా వ్యవహరిస్తోందని, ఆచరణ సాధ్యం కాని డిమాండ్లు చేస్తోందని హమాస్‌పై అమెరికా మండిపడింది. ఇదిలావుంటే, ఈజిప్టు రాజధాని కైరోలో హమాస్ సీనియర్ నేత ఖలీల్ అల్ హయ్యాతో ఈజిప్టు మధ్యవర్తులు చర్చలు జరిపారు. ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వం ద్వారానే కాల్పుల విరమణ ఒప్పందం సాధ్యమైన విషయం విదితమే.

చైనా, అమెరికా అంతరిక్ష ప్రయోగాలు విజయవంతం

జిక్వాన్/లాస్ ఏంజిల్స్: చైనా, అమెరికా తాజాగా చేపట్టిన అంతరిక్ష ప్రయోగాలు విజయవంతమయ్యాయి. చైనా శనివారం లాంగ్ మార్చ్ 2డీ కెరియర్ రాకెట్ ద్వారా రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. బీజింగ్ కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి 12.11 గంటలకు రాకెట్ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. వాయువ్య చైనాలోని జిక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి లాంగ్ మార్చ్ 2డీ రాకెట్ ద్వారా జియాజింగ్ -2 02 ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్దేశిత కక్షకు చేర్చినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. టియాన్-23 ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించినట్లు వెల్లడించారు. లాంగ్ మార్చ్ సిరీస్‌లో ఇది 564వ ప్రయోగమని చైనా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అటు అమెరికా కూడా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు నూతన క్రూడ్ మిషన్‌ను పంపింది. దీంతో గతేడాది జూన్ నుంచి అంతరిక్షంలో చిక్కుకుపోయిన నాసా వ్యోమగాము లు సునితా విలియమ్స్, బుచ్ విల్మోరేను తిరిగి తీసుకొచ్చేందుకు కీలక ముందడుగు పడింది. ఫ్లోరిడాలో నాసాకు చెందిన కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా వ్యోమనౌకను పంపినట్లు నాసా వెల్లడించింది. ప్రయోగించిన రెండున్నర నిమిషాల తర్వాత ఫాల్కన్ 9 తొలి దశ సపరేషన్ విజయవంతంగా జరిగిందని తెలిపింది. ఈ వ్యోమనౌక శనివారం ఐఎస్ఎస్‌ను చేరుకున్నదని, అక్కడ డాక్ అయిందని వెల్లడించింది.

మళ్లీ అంధకారంలో క్యూబా

హవానా: క్యూబా దేశం మరోమారు అంధకారంలో చిక్కుకున్నది. అనేక ప్రావిన్స్‌లలో లక్షల ఇళ్లు చీకటిమయమయ్యాయి. కేవలం జనరేటర్లు ఉన్న హోటళ్ల కిటీల నుంచి వచ్చే వెలుతురు తప్ప హవానా వీధులను చిమ్మచీకటి కమ్మేసింది. ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగింది. గ్వాంటమానో, ఆర్టిమిసా, శాంటియాగో డి క్యూబా, శాంతా క్లారా ప్రావిన్స్‌ల్లోనూ విద్యుత్ సేవలు నిలిచిపోయాయి. హవానా శివార్లలోని డియజ్‌మెరో సబ్ స్టేషన్‌లో సమస్యతో రాత్రి 8.15 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని క్యూబా ఇంధనం, గనుల శాఖ తెలిపింది. జాతీయ విద్యుత్ వ్యవస్థ పని చేయకపోవడంతో పశ్చిమ క్యూబాకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.అయితే క్యూబాలో ఇలా జరగడం ఇది మొదటిసారి కాదు. గతేడాది చివరిలో మూడు సార్లు ఇవే పరిస్థితులు ఎదురయ్యాయి. ఇంధన కొరత, కాలం చెల్లుతున్న మౌలిక వసతులతో క్యూబాను విద్యుత్ సమస్య వెంటాడుతోంది. ద్వీపదేశంలోని చాలా చోట్ల వంట చేయడం, నీరు తోడటం కోసం విద్యుత్‌నే వాడతారు. కాగా, 2021, 2022, 2024లో బ్లాకౌట్ల క్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా నిరసనలు పెద్దఎత్తున జరిగాయి.

పోస్టులు పెడితే ఊరుకోను

(మొదటిపేజీ తరువాయి)

ముసుగులో మమ్మల్నీ మా ఇంట్లోని మహిళలపై ఇష్టారీతిలో తిట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అమ్మనో, మీ చెల్లినో, మీ భార్యనో ఈ రకంగా మాట్లాడితే మీరు వింటారా అని ప్రశ్నించారు. ఏ సంస్కృతి లో ఉన్నారు, ముఖ్యమంత్రిగా చెబుతున్నా రాజకీయ జీవితంలో ఉన్న మమ్మల్ని విమర్శించండి, మా పని తీరుపై ప్రశ్నించండి అన్నారు. ఆ రకమైన భాషను ఆడపిల్లలే రికార్డు చేయించి తమ ప్లాట్ ఫామ్ లపై పోస్టులు చేస్తే ఇది మంచి పద్ధతా అని నిలదీశారు. ఇలాంటి వారు కోర్టులకు వెళ్లి బెయిల్ తెచ్చుకుంటామనుకుంటున్నారేమో అవసరం అయితే చట్టాన్ని సవరిస్తామన్నారు. వీటిని క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

కొత్తగూడెంలో విమానాశ్రయం

(మొదటిపేజీ తరువాయి)

నాయకులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని రేవంత్‌రెడ్డి అన్నారు. కమ్యూనిస్టులు పైరావీల కోసం రారని, ప్రజా సమస్యల కోసమే వస్తారని, అందుకే వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. గుమ్మడి నరసయ్య వచ్చి వెళ్లినట్లు తెలిసి ఆయనకు ఫోన్ చేపించి మరుసటి రోజు రావాలని ఆహ్వానించగా... ఖమ్మం వెళ్లిపోయాను, హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కలుస్తానన్నారని సభకు రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు.

మీరేంచేశారో చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

అప్పట్లో మీ పార్టీ ఈ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేసిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మీరేం చేశారు, 2014 నుంచి 2023 వరకు ఒక్కసారి కూడా కాకతీయ ఉత్సవాలను నిర్వహించలేదని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అనుభవం కలిగిన సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి అసత్యాలు మాట్లాడకుండా రాష్ట్రాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. మీ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థుల కంటే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులను అన్ని అంశాల్లో మెరుగ్గా తీర్చి దిద్దుతామన్నారు. బకాయిల గురించి ఇప్పుడు మీరు మాట్లాడుతున్నారని, అసలు ఆ బకాయిలు పేరుకపోయిందే మీ హయాంలో అని మర్చిపోయారా పల్లా రాజేశ్వర్ రెడ్డి... మీ హయాంలో పేరుకపోయిన బకాయిలను దశల వారీగా చెల్లిస్తున్నామని చెప్పారు.

మాది ద్వేషం కాదు స్వాభిమానం

(మొదటిపేజీ తరువాయి)

భాషను ద్వేషించడం కాదు. స్వాభిమానంతో మా మాతృభాషను, తల్లిని కాపాడుకోవడం. దయచేసి ఎవరైనా పవన్ కల్యాణ్‌కు ఈ విషయాన్ని వివరించండి' అని ప్రకాశ్ రాజ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం కింద త్రిభాష విధానాన్ని అమలు చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న క్రమంలో పవన్ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తమవుతోంది. లాభాల కోసం తమిళ సినిమాలను హిందీలో డబ్బింగ్ చేసేందుకు అనుమతిస్తారంటూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడాన్ని తమిళ నాయకులు తీవ్రంగా ఖండించారు. తమ రాష్ట్ర సంస్కృతిని వ్యాపారంతో ముడిపెడతారా అని అసహనం వ్యక్తంచేశారు. హిందీకి దొడ్డిదారిన ప్రవేశం కల్పించేదిగా ఎన్ఈపీ ఉందన్నారు.

ఇస్రో మరో పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

మిషన్‌లోనూ క్రయోజెనిక్ ఇంజిన్‌కు హాట్ టెస్టింగ్ నిర్వహిస్తారు. తాజా పరీక్షలో భాగంగా శూన్యత రహిత పరిస్థితుల్లో వినూత్న నాజిల్ రక్షణ వ్యవస్థను తొలిసారి వినియోగించి 100 సెకన్ల పాటు ఇంజిన్‌ను విజయవంతంగా పరీక్షించినట్లు ఇస్రో వెల్లడించింది.

ప్రభుత్వ విజయం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన అభివర్ణించారు. ఆర్ఎల్ఐపీ నిర్మాణాన్ని తాము అడ్డుకోకుండా ఉండి ఉంటే తెలంగాణలోని కృష్ణా నది పరివాహక ప్రాంతంలో సాగు, తాగునీటికి దుర్భర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కృష్ణా జలాశయాలలో మన హక్కు కోల్పోకుండా చూడడంతో పాటు ఆనధికారికంగా నీటి భద్రతకు ముప్పు వాటిల్లకుండా విధాన పరమైన పోరాటం చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

పాలమూరును పడావుపెట్టావు

(మొదటిపేజీ తరువాయి)

రాసింది వాళ్లు కాదా అంటూ బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. వైఎస్ ఆశీర్వాదంతో కేంద్ర మంత్రి అయిన కేసీఆర్ పోతిరెడ్డిపాడు పొక్కను పెద్దది చేస్తుంటే చూస్తూ ఊరుకున్నది నిజం కాదా అంటూ నిలదీశారు. తెలంగాణ జిల్లాలను వలస జిల్లాలుగా మార్చి రైతులను పొట్టన పెట్టుకుంది బీఆర్ఎస్సే అన్నారు. ఆనాడు వీళ్ల సహకరించకపోతే పోతిరెడ్డి పాడు పొక్క పెద్దదయ్యేదా అంటూ విమర్శలు గుప్పించారు.

కమీషన్లకు కేసీఆర్ కక్కుర్తిపడి...

కాంట్రాక్టర్లు ఇచ్చిన కమీషన్ల కోసం కేసీఆర్ కక్కుర్తి పడి జూరాలను రెండు టీఎంసీ ల నుంచి ఒక టీఎంసీకి తగ్గించి నీళ్లను శ్రీశైలంకి పంపించడం వల్ల ప్రాజెక్టును పూర్తి చేసినా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్ఎల్‌బీసీ నాలుగేళ్లల్లో పూర్తి చేయాల్సింది పదేళ్లయినా పూర్తి చేయకుండా నల్లగొండకు అన్యాయం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి, ఎనిమిది మంది చావుకు కారణం బీఆర్ఎస్ అన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో పదేళ్లలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదని నిలదీశారు. కేసీఆర్ ఏ రోజు వస్తే ఆరోజు సభలో కృష్ణా జలాలపై చర్చ పెడదామన్నారు. లెక్కలతో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రోజుకు 10 టీఎంసీలు తరలించుకుపోయే ప్రాజెక్టులు పక్క రాష్ట్రం నిర్మిస్తుంటే కేసీఆర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని విమర్శించారు. ఒక సామాన్య రైతు గ్రీన్ ట్రిబ్యునల్ కు వెళితే విధి లేని పరిస్థితుల్లో ఆనాటి ప్రభుత్వం ఇంప్లీడ్ అయిందన్నారు.

కేసీఆర్ వందేళ్లు బతకాలి... ప్రతిపక్షంలోనే ఉండాలి

కేసీఆర్ 100 సంవత్సరాలు బతకాలని తాను కోరుకుంటానని స్పష్టం చేశారు. ఆయన ప్రతిపక్షంలో అక్కడ అలాగే ఉండాలి. మేం అధికారపక్షంలో ఇక్కడ ఇలాగే ఉంటామన్నారు. రైతు సమస్యలపై కేసీఆర్ తో చర్చకు సిద్ధమే అని, తెలంగాణ మహిళలు నన్ను ఇంటిబిడ్డ గా చూసుకున్నారని అందుకే ఆడ బిడ్డలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఐదువేల స్కూల్స్ ను బీఆర్ఎస్ మూసివేసిందని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత స్కూల్ యూనిఫాంలు కుట్టే బాధ్యత, వెయ్యి ఆర్టీసీ బస్సులను, 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే బాధ్యత మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. బతుకమ్మ చీరల పేరుతో దోపిడీ చేశారని వాటిని రద్దు చేశామని స్పష్టం చేశారు. మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నామని, ఇప్పటికే కోటి 30 లక్షల చీరలు నేతన్నలకు ఆర్డర్ ఇచ్చామన్నారు. అన్ని వర్సిటీల వీసీ నియామకాల లిస్టు తీద్దాం, మేం సామాజిక న్యాయం చేసింది నిజమో కాదో చూద్దామన్నారు. గవర్నర్, స్పీకర్ లను గౌరవించరు, ఏకవచనంతో సంభోదిస్తున్నారు, పైగా సమర్థించుకుంటూ ధర్నాలు చేస్తున్నారు ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ సభలో ఉండి సూచనలు ఇస్తే అభ్యంతరం లేదన్నారు.

నా మాటలు ప్రతిపక్షాలు వక్రీకరిస్తున్నాయి

పదేపదే ప్రతిపక్షాలు తన మాటలను వక్రీకరిస్తున్నాయని శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. డిసెంబరు 3, 2023 కు ముందు ఆ పార్టీకి ఉన్న స్టేచర్ ను, ఎన్నికల ఫలితాల తరువాత ప్రజలు స్ట్రెచర్ మీదకు పంపారని చెప్పానని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా ఉండగానే కేటీఆర్ సీఎం అవుతారని వాళ్ల శాసన సభ్యులే చెప్పారని గుర్తు చేశారు. మేం అలా కోరుకోవడంలేదని, కేసీఆర్ 100 ఏళ్లు బతకాలని కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. 30 ఏళ్ల వరకు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సభకు రావాలని కోరుకుంటున్నాని అన్నారు.

పూర్వ వైభవమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఈసారి ఏం జరుగుతుందో చెప్పలేం. ఇంకా ఆ దిశగా చర్చలు ప్రారంభించలేదు. అయితే తృణమూల్, బీజేపీపై అసెంబ్లీ ఎన్నికల్లో పైచేయి సాధించడం కోసం ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాం. వామపక్ష-ప్రజాస్వామ్య శక్తులు ఏకమై ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని ఆశిస్తున్నాం' అని కారత్ తెలిపారు. కేరళలోనూ 2026లో ఎన్నికలు జరగనుండటంపై ప్రశ్నించగా 'ఎల్డీఎఫ్‌ను రెండు సార్లు అధికారంలోకి తెచ్చాం... అఖండ మెజారిటీ సాధించాం. దీర్ఘకాల అభివృద్ధి లక్ష్యాలతో ముందుకెళుతున్నాం' అని ఆయన సమాధానం ఇచ్చారు. కేరళకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాల చరిత్ర ఉన్నదన్నారు. పినరయి విజయన్ ప్రభుత్వం తొమ్మిదో సంవత్సరంలోకి అడుగు పెట్టబోతుందని, నవ కేరళ దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. కేరళను అభివృద్ధి పథంలో నడపటానికి ఈ ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని ప్రజలు అర్థం చేసుకుంటారని, తమను నమ్మి మళ్లీ ఓటేస్తారని ఆశిస్తున్నామని ప్రకాశ్ కారత్ అన్నారు.

దక్షిణాదితో కేంద్రం మొరటు వైఖరి...

త్రిభాషా విధానాన్ని ప్రస్తావిస్తూ దక్షిణ రాష్ట్రాల విషయంలో కేంద్రం మొరటుగా వ్యవహరిస్తోందని సీపీఎం నేత వ్యాఖ్యానించారు. ఏదో ఒక భాషను ఆపాదించడానికి బదులు అన్ని భాషలను సమానంగా చూస్తే... అందులో ఏదో ఒకటి 'లింగ్వా ఫ్రాంకా'గా ఆవిర్భవిస్తుందని చెప్పారు. జాతీయ విద్యా విధానం ప్రధాన ప్రశ్నగా ఉందన్నారు. విద్య... ఉమ్మడి జాబితాలో ఉండటం వల్ల విధానపరమైన నిర్ణయాలను తీసుకునేందుకు రాష్ట్రాలకు సమాన హక్కు ఉందని కారత్ అన్నారు. ఎన్ఈపీ అమలులో కేరళ ప్రభుత్వానికి కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. హిందీ భాష ఒక్కటే కాదు ఎన్ఈపీ ద్వారా విద్యలో అనేక ఇతర నమూనాలను చేర్చడంపై తమిళనాడు అభ్యంతరం చెబుతోందన్నారు. రాజ్యాంగం 22 భాషలను గుర్తించిందని, వీటన్నింటిని జాతీయ భాషగా పరిగణిస్తారన్నారు. బెంగాలీ, తెలుగు, తమిళం, పంజాబీ వంటి భాషలకు ఆయా రాష్ట్రాలలో ఆదరణ ఉన్నదని... సంబంధిత రాష్ట్రాలు అనేక యూరప్ దేశాల కంటే పెద్దవని కారత్ చెప్పారు. ఈ క్రమంలో వైవిధ్యతను గుర్తించడమే కాకుండా భాష దానంతట అదే వృద్ధి చెందేందుకు దోహం కావాలని సూచించారు. 'ఇతరులపై ఏ భాషను ఆపాదించలేరు. ఇది అధికారిక భాష, అందురూ దీనినే చదవాలి, రాయాలి, వాడాలి అని ఆదేశాలివ్వడం తగదు. వేర్వేరు భాషలు మాట్లాడేవారు కూడా కొన్ని భాషలు ఆదరిస్తారు. ఇందుకు ఆంగ్ల భాష మంచి ఉదాహరణ. ప్రజాదరణ లభిస్తే హిందీ కూడా ఆ స్థాయి ప్రాచుర్యాన్ని పొందగలదు కానీ అందుకు ఇది సమయం కాదు. భాషలన్నింటినీ గౌరవించాలి, సమానంగా చూడాలి. ఏదో ఒక భాష ప్రజాదరణ పొంది లింగ్వా ఫ్రాంకాగా మారుతుంది' అని ప్రకాశ్ కారత్ అన్నారు.

కాగ్ నియామక ప్రక్రియపై రేపు సుప్రీం విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సహా ఇతర సంఘాల నియామకానికి పోలి ఉండాలని తెలిపింది. న్యాయవాది ప్రశాంత్ కిశోర్ ద్వారా దాఖలైన ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం విచారణకు స్వీకరించింది. చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా కాగ్ నియామక ప్రక్రియ ఉందని ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) పేర్కొంది. కాగ్ పారదర్శకతను ప్రోత్సహించాలని... నిర్భయంగా, ప్రలోభాలకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని తెలిపింది. కాగా, నియామక ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఆకాంక్షించింది. ప్రభుత్వ జమఖాతాలు, వ్యయాలపై కాగ్ నిఘా ఉంచుతుందని... కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, పంచాయతీ రాజ్ వ్యవస్థల ఆర్థిక జవాబుదారీతనం, పారదర్శకతకు హామీ ఇవ్వడంతో కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించింది.

మూడు నెలల్లోనే రైతు రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. రూ. 540 కోట్లతో భవనాలు కట్టడానికి ఆదేశాలు ఇచ్చామని, అది ముఖ్యమంత్రి, ప్రభుత్వ ఖచ్చితమైన నిర్ణయమని పేర్కొన్నారు. శాసనసభలో బీఆర్ఎస్ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నలకు భట్టి విక్రమార్క సవివరంగా సమాధానం ఇచ్చారు. పల్లా ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ నియోజకవర్గంలో 2018లో బీఆర్ఎస్ హయాంలో ఐదు సంవత్సరాల్లో రూ.124 కోట్లు రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే రూ.263 కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. గజ్వేల్ లో గత పాలకులు రూ. 104.3 కోట్ల రుణమాఫీ చేస్తే తమ ప్రభుత్వం రూ. 237.33 కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. సిద్దిపేటలో వాళ్లు రూ.96.62 కోట్లు చేస్తే తాము రూ.177.91 కోట్లు చేశామని వివరించారు. సిరిసిల్ల లో రూ.101.76 కోట్ల రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ రూ.175.84 కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. శాసనసభ ప్రాంగణంలోనూ రైతు రుణమాఫీ, రైతు భరోసాకు సమాచారం ప్రదర్శిస్తామని చెప్పారు. సన్నాలకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ప్రతి స్కీంకు సంబంధించిన వివరాలు లెక్కలతో సహా ఇస్తామని పేర్కొన్నారు. మీలాగా పనులు చేయకుండా ప్రచారం చేసుకోలేదని తెలిపారు. ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్... 20 ఎకరాల్లో డిజిటల్ బోర్డులు, క్రికెట్, ఫుట్బాల్ మైదానాలు, బోధన సిబ్బంది అక్కడే ఉండేలా నిర్మాణాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కూడా 58 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేయలేదన్నారు. ఒక్కో స్కూలు రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు విద్యారంగంపై తమ ప్రభుత్వ విధానమన్నారు. పరిశ్రమలకు అవసరమైన నిపుణులను అందించేందుకు 65 ఐటీఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 11 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. మరో ఆరువేల ఖాళీల భర్తీకి కృషి చేస్తున్నామని, 22 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. మీరు నిర్వీర్యం చేసిన విద్యాశాఖలో 36 వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశామన్నారు.

కేసీఆర్ చావు కోరడం తప్పు: హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ చావును రేవంత్ రెడ్డి కోరుకోవడం తప్పని, తెలంగాణ కోసం ప్రాణాలు ఫణంగా పెట్టారని, అందుకే సీఎం ప్రసంగాన్ని బహిష్కరించామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడారని, కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల 299 టీఎంసీల నీటి పంపకాలు చేశారని, 299 టీఎంసీల నీటి వినియోగం కంటే ఎక్కువ ప్రాజెక్టులు లేవన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు కట్టలేదు కాబట్టి 299 టీఎంసీల నీరు తాత్కాలికంగా కేటాయించి ప్రాజెక్టులు కట్టని పాపం కాంగ్రెస్ దే అంటూ మండిపడ్డారు. శాసనసభ ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ దిల్లీలో రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ వెళ్లి ఎందుకు ఒప్పుకొని వచ్చారని నిలదీశారు. పోత రెడ్డిపాడు కోసం పీజేఆర్ కొట్లాడాడు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పదవుల కోసం పెదవులు మూసుకున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒక్క రోజు కూడా దీని వ్యతిరేకించలేదని కానీ మేము 40 రోజులు అసెంబ్లీని స్థంభింపచేశామని చెప్పారు. తెలంగాణ కోసం మేము ఆ రోజు ఆరు మంత్రి పదవులు వదులుకున్నామని గుర్తు చేశారు. ఉత్తమ్ ... చంద్రబాబు దగ్గరకు వెళ్లి భోజనం చేసి వచ్చారు, కృష్ణా నీటిలో తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఆ తర్వాత శ్రీశైలం ఖాళీ చేసేలా ఉత్తమ్ ద్రోహం చేశారని, సెక్షన్ 3ని సాధించింది కేసీఆర్, 573 టీఎంసీల నీళ్లు సెక్షన్ 3 ద్వారా తెచ్చింది మేమని చెప్పారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై స్టే తెచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని, నల్గొండలో పంటలు ఎండిపోవడానికి కాంగ్రెస్ కారణమని దుయ్యబట్టారు. కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు కట్టడం వల్ల ఖమ్మంకి నీళ్లు ఇవ్వగలిగాలిగామన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్‌ని ముంపునకు గురి చేసి ఆంధ్రాలో మూడో పంటకు నీళ్లు ఇచ్చారని ఆరోపించారు. పులిచింతల నిర్వాసితులకు వందల కోట్ల రూపాయలు ఇచ్చి కాపాడుకున్నామన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయండి

స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శనివారం సభ ప్రారంభమయ్యే ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, సుధీర్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాధవరం కృష్ణారావు, సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద... స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన ఛాంబర్‌కు వెళ్లి కలిశారు. తమ సభ్యుడు జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌పై జగదీశ్ రెడ్డి ఏక వచనంతో ఎక్కడా మాట్లాడలేదని, ఆయనపై సస్పెన్షన్ వేటు అక్రమం, అన్యాయమని సవివరంగా విన్నవించారు. సభా సంప్రదాయలను ఎక్కడా ఉల్లంఘించలేదని తెలిపారు. వెంటనే జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంతా స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు.

బాబును మించిన అవకాశవాది పవన్: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ అవకాశవాద రాజకీయాలలో సీఎం చంద్రబాబును మించిపోయారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పిఠాపురం సభలో ఏం మాట్లాడారో ఆయనకే తెలియలేదని... జనసేన పార్టీకి దిశ దశ లేదని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబుకు ఊడిగం చేయడానికి... టీడీపీకి బీ టీమ్‌గా జనసేనను పవన్ స్థాపించారన్నారు. ఆయన ప్రజల కోసం పోరాడే వ్యక్తి కాదన్నారు. 100 శాతం స్ట్రైక్ రేట్ అంటారు కానీ, ఆ సీట్లు సొంతంగా పోటీ చేస్తే రాలేదన్న సంగతి పవన్ మర్చిపోతున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు పంపినోళ్లు, వైసీపీ తిరస్కరించినోళ్లు కాకుండా జనసేన తయారు చేసిన నాయకులు ఎంత మంది ఉన్నారో చెప్పగలరా అంటూ పవన్‌కు సవాల్ విసిరారు. పిఠాపురంలో సభ పెట్టి పవన్ అన్ని అబద్ధాలు చెప్పారని, ఎన్నికలప్పుడు ఇచ్చిన 143 హామీల ఊసే లేదని అన్నారు. దక్షిణాది మీద ఉత్తరాది పెత్తనం, అహంకారం అని మొన్నటిదాకా అరిచి గోలపెట్టిన పవన్, ఇప్పుడు కాషాయం ధరించి యూటర్న్ తీసుకున్నారని అంబటి రాంబాబు విమర్శించారు.

ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల, కలెక్టర్

విశాలాంధ్ర - ఖమ్మం : రంజాన్ ఉపవాసం దీక్షల సందర్భంగా ఖమ్మంలో రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన ఖమ్మం జిల్లా కలెక్టర్ ఖాన్‌కు ఖర్జూరా తినిపించి ఇఫ్తారు ప్రారంభించారు. స్థానిక కాల్వ ఒడ్డులోని దారుల్ ఉలూమ్ మదర్సా నందు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరావు. ఆనంతరం మంత్రి, కలెక్టర్‌లు ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు ఆచరించారు. ఇట్టి విందులో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కరుణ భావాన్ని కలిగి ఉండాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఎవరైతే భూమ్మీద తోటి మానవుల హక్కుల పట్ల బాధ్యతగా వ్యవహరించిన, తోటివారిపట్ల కరుణ చూపుతారో వారే ధర్మంలో ఉన్నట్లని దివ్య ఖురాన్‌లో దేవుడి సందేశం స్పష్టంగా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. తోటి మనుషుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ సోదర భావాన్ని కలిగి ఉండాలని ఆయన కోరారు. రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించిన నేపథ్యంలో ముస్లింలకు ఈ నెల చాలా పవిత్రమైనదన్నారు. కొత్తగూడెం లోని చాతకొండ హమాలి కాలనీలో ఉన్న సాలె హీన్ మస్జిద్ లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సాబీర్ పాషా తోపాటు ఉర్దు ఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి లు ముఖ్యఅతిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మసీదు నిర్వాహకులకు, ముస్లిం సోదరులకు రంజాన్ నెల శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ సందేశం ప్రపంచ మానవళికి మార్గదర్శకంగా, ఆచరణాత్మకంగా, స్పష్టమైన రుజువులతో అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షులు ఎండీ అక్బర్, పెద్దలు అబిద్ హుస్సేన్, షైక్ జహీద్, ఎండీ అన్వార్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ద్వారా అందిస్తున్న సాంకేతిక బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని రెబ్బెన మండలం తక్కల్లపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా 10వ తరగతి విద్యార్థులకు బోధన అందించే కంప్యూటర్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలివిడతగా చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 4 పాఠశాలలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం, ఏక్ స్టెప్ ఫౌండేషన్‌ల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలో మరికొన్ని పాఠశాలలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని భాష, గణిత సామర్థ్యాల సాధన (ఎస్.ఎల్.ఎస్.) పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతో దోహదపడుతుందని, కృత్రిమ మేధస్సును విద్యారంగంలో అమలు చేయడం విప్లవాత్మకమైన ఆలోచన అని తెలిపారు.

రైతు రుణమాఫీ వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్/ తొర్రూర్: రైతు రుణమాఫీ రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర పూర్వపు అధ్యక్షులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం తొర్రూర్ గెస్ట్ హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, తొర్రూరు మండల మహాసభ బొమ్మెర మల్లయ్య అధ్యక్షతన సమావేశంలో నెల్లూరు నాగేశ్వరరావుతో కలిసి తమెర విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, వ్యవసాయాన్ని నష్ట పెట్టే విధానాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల ముందు, సమైక్య రైతు పోరాట సమితికి పంటల గిట్టుబాటు ధరకు చట్టం చేస్తామని, అదేవిధంగా కార్పొరేట్ వ్యవసాయాన్ని దేశంలో ప్రవేశపెట్టమని, తదితర డిమాండ్లను అమలు చేస్తామని హామీ ఇచ్చి, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఆ హామీలను తుంగలోకి తొక్కిందని అన్నారు. రైతు రుణమాఫీ, చిన్న, సన్నకారు రైతులకు కూడా మాఫీ కాక, బ్యాంకులలో తీసుకున్న అప్పులకు మిత్తి పెరుగుతూ రైతాంగం దీన వ్యవస్థలో ఉందని, ఈ ప్రభుత్వంలో సన్నా, చిన్నకారు రైతులకు కూడా పైసలు వేయకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఈనెల 18న బయ్యారంలో జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభలలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని, నిజామాబాదులో జరిగే రాష్ట్ర మహాసభ ద్వారా, రైతాంగపు సమస్యల మీద ఉత్తేజంతో, రైతులను చైతన్యవంతం చేసి, వారి సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం పాటుపడుతుందని హామీ ఇచ్చారు. మండల నూతన అధ్యక్షులుగా అజ్మీర వీరన్న, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి ఏకాంతం, కోశాధికారిగా పేరబోయిన కిరణ్‌లను, మరొక నలుగురిని మండల సమితి సభ్యులుగా ఎన్నుకోవడం ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు గూడెల్లి ఎల్లయ్య, బూరుగు యాదగిరి, బానోతు నరసింహ, సంకినేని బిక్షం, గుగులోతు మంగీలాల్ తదితర రైతులు పాల్గొన్నారు.

64 మంది మావోయిస్టులు లొంగుబాటు

ఒక్కొక్కరికి 25వేలు రివార్డు అందజేత : ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : భారిస్థాయిలో మావోయిస్టు పార్టీకి చెందిన 64 మంది సభ్యులు పోలీసుల ముందు లొంగి పోయారు. ఇటీవల కాలంలో 44 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. మళ్ళీ ఇంత భారీ స్థాయిలో లొంగిపోవడంతో జిల్లా పోలీసుల పాటితమైన ప్రణాళిక, పనితీరుకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు వస్తున్నాయి. ఈ లొంగుబాటు ప్రక్రియ నేపథ్యంలో శనివారం స్వయాన మల్టి జోన్- 1 ఐజిపి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించి లొంగిన మావోయిస్టులను ప్రదర్శించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, షిటీమ్ ఎస్సై రమాదేవితోపాటు ఆయన మీడియతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూత, కొత్తగూడెం జిల్లా పోలీసులు వల్ల పెద్ద ఎత్తున మావోయిస్టులు జనజీవన ప్రవంతిలో కలుస్తున్నారని చెప్పారు. తొలుత ఎస్పీ, షీ టీమ్ ఎస్ఐ రమాదేవి ఆధ్వర్యంలో ఐజి పి కి పోలీసు పెరేడ్ నిర్వహించి గౌరవ వందనం చేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ చేయుత పథకం ద్వారా మావోయిస్టులు 64 మంది లొంగిపోయారని చెప్పారు. అందులో 48 మంది పురుషులు 16 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. లొంగిపోయిన ప్రతి ఒక్కరికి రూ. 25 వేలు తక్షణ నజరానాగా అందరికీ రూ. 16 లక్షలు చెల్లించామన్నారు. వీరికి త్వరలోనే జనజీవన ప్రవంతిలో తిరిగే విధంగా స్వేచ్ఛను కల్పిస్తామని చెప్పారు. బ్రతకడానికి కావలసిన వసతులు కూడా సమకూర్చుతామని అన్నారు. సిఆర్పిఎఫ్ అధికారులు ఆదివాసి ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం చేస్తున్న వివిధ రకాల సంక్షేమాలు కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. లొంగిపోయిన వారిలో విప్లవ సంఘం ఆర్పిసి కమిటీ మెంబర్స్, ప్రజా విప్లవ సంఘం, మజ్దూర్ సంగం, గ్రామ రక్షణ దళం చెందినవారు ఉన్నారని వివరాలు వెల్లడించారు. గత రెండు నెలలుగా 122 మంది మావోయిస్టు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పరంగా అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలు అందజేయడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎప్పుడు కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, సిఆర్పిఎఫ్ కమాండర్ 141 బెటాలియన్ రితేష్ ఠాకూర్, 81 బెటాలియన్ సిఆర్పిఎఫ్ కమాండర్ రాజేష్ రోగుల తోపాటు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చర్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - చర్ల : భద్రాచలం నియోజకవర్గం చర్ల మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇరప శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేసారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఫారెస్ట్ అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోదెం వీరయ్య హాజరై మాట్లాడారు. చర్ల మండలం మార్కెట్ చైర్మన్ పదవి ఒక సాధారణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు దక్కడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనానికి నిదర్శనమన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ ఎప్పటికివిస్మరించదన్నారు. చైర్మన్ పదవి స్వీకరించిన అనంతరం ఇరప శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని రైతులకోసం సద్వినియోగం చేస్తానన్నారు. రైతులతో మమేకమై వారి సమస్యలు తీర్చడానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ పదవి రావడానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బలమైన ఆహారంతో రోగనిరోధక శక్తి పెంపు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : మనం తీసుకునే ఆహారంలో చెడు అలవాట్లు అయిన మద్యం సేవించడం పొగ తాగడం వలన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని డిఎంహెచ్ఓ కోటచలం అన్నారు. శనివారం నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భారతీయ రంగ ఆర్గ నేషన్ సంస్థ సహకారంతో ప్రధానమంత్రి టీబి ముక్త భారత్ అభియాన్, నిక్షయ మిత్ర ద్వారా 37 మంది టీబి పేషెంట్లకు, ఒక్కొక్కరికి 6 నెలలకు సరిపడా ఫుడ్ బాస్కెట్‌ను, డీఎంహెచ్ఓ అందజేశారు. అనంతరం జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ నజీయ మాట్లాడుతూ, రోగనిరోధ శక్తి పెంచుకోవాలంటే బలమైన ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో జయమనోరి, టీబి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నజియా, మండల వైద్యాధికారి పున్నా నాగిని, బ్రోస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట శ్రీధర్, వాలంటీర్ ఆనంద్ కుమార్, మట్ట శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ శ్రీనివాస్, సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, ధనమ్మ హెల్త్ అసిస్టెంట్ నరసయ్య, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - వనపర్తి : వినియోగదారులు తమ హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మార్చి 15, ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్లోని పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో వినియోగదారులకు హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారులు ఎక్కడైనా ఏవైనా వస్తువులు కొనేటప్పుడు వాటి నాణ్యత ప్రమాణాలు, ఎక్స్పైరీ డేట్ వంటివి జాగ్రత్తగా చెక్ చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో ఆన్లైన్ వేదికగా చాలా మోసాలు జరుగుతున్నాయని, ఒకవేళ వినియోగదారులు ఏదైనా కొనుగోలు చేసి మోసపోయినట్లయితే ఆన్లైన్ ద్వారానే వినియోగదారుల ఫోరంను సంప్రదించవచ్చని చెప్పారు. డిజిటల్ విధానం ద్వారా వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చని, అదేవిధంగా వర్చువల్ హియరింగ్ ద్వారా సకాలంలో సత్వర న్యాయం పొందవచ్చు అని చెప్పారు. ఈ సేవల విషయంలో అందరూ అవగాహన కలిగి వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, డీటీలు, ఇతర అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

సాగునీటి వృధాపై పకడ్బందీ చర్యలు

విశాలాంధ్ర - ముదిగొండ : సాగునీరు వృధా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్, ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో పర్యటించి, చెరువు ను, కాల్వను, పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులతో ఏఏ పంటలు, నీరు అందుతున్నది, కోతలకు సమయం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయి కమిటీ అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. సాగునీరు వృధా కాకుండా చూడాలని, ఒక్క ఎకరా పంట ఎండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ ఛాంబర్‌లో వ్యవసాయ, సాగునీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి సరఫరాకు సంబంధించి ప్రణాళిక ప్రకారం ప్రత్యేక శ్రద్ధ వహించి, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొన్ని చోట్ల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని కెనాల్స్, బోర్ వెల్స్, ఇతర సాగునీటి వనరులను సంరక్షించాలని, సాగునీరు సరఫరాలో రైతులకు మధ్య కొన్ని చోట్ల ఘర్షణలు జరుగుతున్నాయని, అలాంటి సంఘటనలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగునీరుకు ఎలాంటి ఇబ్బందులు లేవని రానున్న రోజుల్లో కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక బృందాలు నిత్యం అందుబాటులో ఉంటూ వాటర్ సోర్సెస్లను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఇరిగేషన్ ఎస్ఈ స్వర్గం నరసింహారావు, ఇరిగేషన్ వ్యవసాయ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

రెండు ముక్కలైన బోర్డు

విశాలాంధ్ర - గూడూరు : కొన్ని లక్షల రూపాయలు వెచ్చించి పల్లెల కోసం పట్టణాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రజలు, యువతీ, యువకుల ఆహ్లాదం కోసం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి, ప్రజల కుటుంబ సమేతంగా కొంత సమయాన్ని కేటాయించి, ఆనందంగా గడపడానికి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం బోర్డు రెండు ముక్కలైపోయింది. బోర్డునే పట్టించుకోని అధికారులు పల్లె ప్రకృతి వనాన్ని ఏం పట్టించుకుంటారని ప్రజలు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మహబూబాద్ జిల్లా గూడూరు మండలం చంద్రుగూడెంలోని లైన్ తండాకు వెళ్లే దారిలో ఈ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. గత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పాలనలో పల్లె ప్రకృతి వానాలను ఏర్పాటు చేయాలని కృత నిశ్చయంతో పూనుకున్నారు. కానీ మండలంలో ఉన్న అధికారులు గూడూరు మండల గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎవరూ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వర్షాకాలంలోనే పట్టించుకోని అధికారులు ఇప్పుడున్న రోజులలో తీవ్రమైన వడగాలులు, మండిపోతున్న ఎండలకు పల్లె ప్రకృతి వనలు దెబ్బతింటున్నాయి. ప్రకృతి వనంలో అందమైన చెట్లు, పూల మొక్కలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. చంద్రుగూడెం మీదుగా లైన్ తండకు వెళ్లే రహదారుల ప్రయాణికులు కూడా మండిపడుతున్నారు. ఇకనైనా మండలాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పల్లె ప్రకృతి వానాలను పట్టించుకోని ఎండిపోతున్న చెట్లకు నీరు పోసి జీవం పోస్తారా లేదా అని వేచి చూడాలి.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బ్యూరో నిర్మల్ జిల్లా : ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో మున్సిపాలిటీల పరిధిలో 17906, గ్రామీణ ప్రాంతాలలో 6680 దరఖాస్తులను రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అర్హమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే పలువురు దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలలో ఎల్ఆర్ ఎస్ రిజిస్ట్రేషన్ రుసుంలో 25 శాతం రాయితీ కల్పించడం జరిగిందని ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31వ తేదీతో లేఅవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. గడువు ముగిసిన తర్వాత మళ్ళీ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండదని, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

గిరిజనులకు ఎలక్ట్రికల్ కుక్కర్‌పై అవగాహన కల్పించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఎలక్ట్రికల్ కుక్కర్ ఎలా వాడాలో గిరిజన కుటుంబాలకు స్వయనా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అవగాహన కల్పించారు. ఏజెన్సీ దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామంలో గిరిజనులకు శనివారం అవగాహన కల్పించారు. కుక్కర్ ఉపయోగించడంపై కలెక్టర్ స్వయంగా కుక్కర్ పై వంట చేసి చూపారు. దీనిపై ఏ విధంగా సులువుగా వంట చేసుకోవచ్చో గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరిజన మహిళలతో ఆయన ఓపికగా ముచ్చటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న అన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పూసుకుంట గిరిజన మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన ఇసుక సీజ్ : తహసిల్దార్

విశాలాంధ్ర - పినపాక : పెట్రోల్ బంక్ పరిధిలో అక్రమంగా స్టాక్ ఉంచిన ఇసుకను గుర్తించి శనివారం పినపాక తహసీల్దార్ అద్దంకి నరేష్ సీజ్ చేసారు. మండలంలోని ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డులో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు పనుల కొసం ఎటువంటి అనుమతి లేకుండా యజమానులు 35 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా నిలువ ఉంచారని తహసీల్దార్ చెప్పారు. ఇసుకను గమనించిన ఓ యువకుడు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశాడు. దింతో వెంటనే స్పందించిన తహసిల్దార్ నరేష్ బంక్ ప్రాంతానికి వెళ్లి అక్రమ నిల్వలను పరిలించి విచారించారు. ఎలాంటి అనుమతులు లేవని గ్రహించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అక్రమ ఇసుక తోలకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఆర్ఐ గణపతి, సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, సర్వేయర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆదివాసీ నాయకులు

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండలం బొమ్మరాజు పల్లి గ్రామంలో విధివక్రించి చిన్నారి లాస్యశ్రీ తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మిగిలింది. ఐదు సంవత్సరాల క్రితం తల్లిని కోల్పోగా గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో తండ్రి మరణించాడు. తండ్రి దశదిన కర్మలు జరిపించేందుకు సోషల్ మీడియా ద్వారా దాతల సహాయం కోరింది. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసి సంఘం నాయకులు గొగ్గల రామకృష్ణ దొర, కొమరం శ్రీను, కుర్సం సారయ్యలు స్పంచించారు. శనివారం 25 కేజీల బియ్యం, 5 కేజీల నూనెను సహాయం చేశారు. పలువురు దాతలు ముందుకొచ్చి లాస్యశ్రీని ఆదుకోవాలని వారు కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - కారేపల్లి : కొద్ది రోజులలో జరగనున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని జ్యోతిర్మయి ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుగులోతు జ్యోతిర్మయి అన్నారు. శనివారం మండల పరిధిలోని పేరుపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకు రావాలని పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులు చదవాలనుకొనే పేద విద్యార్థులకు ఫౌండేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కృషి పట్టుదలతో చదవాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఉపాధ్యాయులు అజ్మీరా వీరు నాయక్, రాములు, దేశ్య, రాంబాయి ఫౌండేషన్ సభ్యులు నవీన, రమ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ప్రతిష్టాత్మకంగా నిర్మించి ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ కుమార్‌ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఒక్కోటి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతన 3500 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని సంకల్పించడమే కాకుండా, మంజూరు చేసింది. ఇందులో భాగంగా వివిధ రకాల డిజైన్లతో కూడిన ఇందిరమ్మ ఇండ్ల నమూనాలను ఇదివరకే ప్రజల్లో ప్రత్యేకించి లబ్ధిదారుల అవగాహన కోసం విడుదల చేయడం జరిగింది. నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర మంత్రులు ఇటీవలే ప్రారంభించిన విషయం తెలిసిందే. అంతేకాక అన్ని మున్సిపల్ పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాలలో సైతం నమూనా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఇదివరకే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, దీంతోపాటు, నమూనా ఇందిరమ్మ ఇండ్ల మోడళ్లను పంపించి జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో ప్రజల అవగాహన కోసం ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు పంపిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని శనివారం తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఇందిరమ్మ ఇండ్లపై లబ్ధిదారులకు, గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు, పట్టణ ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఉందని అన్నారు.

సంపాదకీయం

సలాం భారత్

హోలీ, రంజాన్ నెల శుక్రవారం ఒకే రోజు వస్తున్నాయి కనక హోలీ వేడుకల్లో భాగంగా రంగులాడడం ఇష్టపడని ముస్లింలు ఆ రోజు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని అన్నారు. సంభల్ పోలీసు అధికారి హోలీకన్నా ముందే ముస్లింలకు ఉచిత సలహా పడేశారు. దీన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ సమర్థించారు. పైగా ఈ మాట చెప్పిన పోలీసు అధికారి పెహల్వాన్ అని కూడా అన్నారు. హోలీ తరతరాలుగా జరుపుకుంటున్న పండగ. ప్రతి పండగ సందర్భంగా హిందూ, ముస్లింల మధ్య కలహాలు జరుగుతాయని ప్రచారం చేయడం హిందుత్వం పడగవిప్పిన తరవాత మితిమీరి పోయింది. చాలా మతకలహాలు ఏ పండగా లేకపోయినా జరిగాయి. ఈ మధ్యకాలంలో సంఘ్ పరివార్ పదాతి దళాలైన ఆర్.ఎస్.ఎస్., భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ ప్రతి పండగ సమయంలోనూ అల్లర్లు జరుగుతాయన్న నిరాధారమైన భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈసారి హోలీ సందర్భంగా ఈ ప్రచారం మరింత ఉధృతంగా చేశారు. మసీదుల మీద టార్పాలిన్ కప్పేసు కోవాలని హిందుత్వ వాదులు సూచించారు. "హోలీ పండగ సందర్భంగా, శుక్రవారం నమాజు దృష్ట్యా పరిపాలనా విభాగం అప్రమత్తంగా ఉంది కానీ కొంతమందికి అభ్యంతరాలు ఉన్నాయని ఉత్తరప్రదేశ్‌లో మంత్రి స్థాయి నాయకుడు ఒకరు సెలవిచ్చారు. మసీదుల మీద టార్పాలిన్ కప్పుకోవాలని, అలాంటి వారు (అంటే ముస్లిం మహిళలు) బురఖా వేసుకోవచ్చునని, ఇంకా కావాలంటే టార్పాలిన్ కప్పుకోవచ్చునని ఆ నాయకుడు అన్నారు. ఈ మాటల్లో ముస్లింలకు అనుకూలమైనది ఒక్కటైనా ఉందా. సలహాల రూపంలో ముస్లింలను హెచ్చరిస్తున్నారు. అసలు హోలీకి, శుక్రవారం నమాజుకు మధ్య పోటీ అవసరం ఏమొచ్చింది? టార్పాలిన్ కప్పిన కట్టడం మసీదు అనీ, టార్పాలిన్ ముసుగు వేసుకున్న మహిళ ముస్లిం అని సులభంగా గుర్తు పట్టడానికి తప్ప ఈ సూచన ఎందుకైనా పనికొస్తుందా! అంతగా ముస్లింలను భయపెట్టడం ఎందుకో! రంగులాడడం ఇష్టం లేని వారికి రంగులు పూయకూడదని ఒక్క సలహా అయినా ఇచ్చిన దాఖలా లేదు. హోలీ సందర్భగా బలవంతంగా ముస్లింల మీద రంగులు పోయడం హక్కు అన్న రీతిలో మాట్లాడుతున్నారు. హితవు పేరున ముస్లింలకు చేస్తున్న హెచ్చరికలు, దీనికి అనుగుణంగా గోదీ మీడియాలో జరుగుతున్న ప్రచారం కొత్త ధోరణిలా కనిపిస్తోంది. హోలీ పండగ జరుపుకోవడానికి ముస్లింలు ఆటంకాలు కల్పిస్తున్నారన్న అభిప్రాయం కల్గిస్తున్నారు. విద్వేషాన్ని రెచ్చగొట్టే వారు, వారి ఒడిలో కూర్చుని విద్వేష ప్రచారానికి ప్రచారం ఇచ్చే గోదీ మీడియా కలిసి హోలీ లాంటి సరదా పండగను భయానకంగా తయారు చేశారు. హోలీ సందర్భంగా బీహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులు జారీ చేసిన సూచనలు చూస్తే హోలీని ఎంత భయంకరంగా తయారు చేస్తున్నారో అర్థం అయింది. ఆ విజ్ఞప్తులు ఇలా ఉన్నాయి: అల్లర్లు రెచ్చగొట్ట కూడదు-సంయమనం పాటించాలి, శాంతి కాపాడాలి, డి.జె. వాయించకూడదు, అశ్లీల పాటలు పాడకూడదు, మత సామరస్యం పరిరక్షించాలి, మద్యం సేవించరాదు, వేగంగా వాహనాలు నడపకూడదు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదు, మహిళల గౌరవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి, బలవంతంగా రంగులు పూయకూడదు. ఇవన్నీ జరుగుతాయని యు.పి.పోలీసులు ఎలా ఊహించారో! అంతగా ఎందుకు భయపడ్డారో! హోలీని గుండాగిరీకి, అసభ్యంగా ప్రవర్తించడానికి చిహ్నంగా మార్చింది ఎవరు? ఆ మాటకొస్తే దసరా, దీపావళి, శ్రీరామనవమి సందర్భంగా శోభా యాత్రలను రక్త సిక్తం చేస్తున్నదెవరు? హోలీ పేరున దురుసుగా, జబర్దస్తీగా, అశ్లీలంగా ప్రవర్తించడానికి ముస్లింలే కారణమా? ఇలాంటి ప్రవర్తన అంతా ముస్లింల మీదే జరుగుతోంది కదా? ఇలాంటి నడవడిక హిందువుల పండగల సందర్భంగా ముస్లింలు ప్రదర్శించిన సందర్భాలు ఎన్ని ఉంటాయి? మసీదు దగ్గరకు వచ్చే సరికి విల్లు ఎక్కుపెట్టి వీరత్వం ప్రదర్శించింది హిందూ మహిళ కాదా? అంటే హిందువుల పండగలప్పుడు ముస్లింలు రోడ్డు మీద కనిపించకూడదన్న మాట. కనిపిస్తే ఇలాంటి కష్టాలన్నీ భరించక తప్పదన్న మాట.

హోలీ ప్రశాంతంగా జరిగేట్టు చూడడానికి చాలా రోజుల ముందు నుంచే ఈ రెండు రాష్ట్రాల పోలీసులు చాలా కష్ట పడ్డారు. బీహార్‌లో పోలీసుల సెలవులను పదో తేదీ నుంచి 18వ తేదీదాకా రద్దు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల సెలవులు మార్చి 20దాకా రద్దు చేశారు. బీహార్ పోలీసులు "హై తయ్యార్ హం" (మేం సిద్ధంగా ఉన్నాం) అన్న హాష్టాగ్ తయారు చేసి జనం మీదకు వదిలారు. పోలీసులు ఆ మాట చెప్పాల్సిన అవసరం ఏమిటి? బీహార్‌లో అన్ని జిల్లాల్లో పోలీసులు కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. కలహాలు నివారించాలంటూ కవాతు చేశారు. యూపీలో కూడా ఇలాంటివే జరిగాయి. లాఠీ చార్జీ చేయడంతో పాటు బాష్ప వాయువు ప్రయోగించడానికి అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఒక్క గోపాల్ గంజ్ జిల్లాలోనే 245 మంది మేజిస్ట్రేట్లను నియమించారు. ఇవన్నీ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని హెచ్చరించ డానికే ఉపకరిస్తాయి. అలాంటి పరిస్థితి ఏమీ లేదు. కానీ ఈ హడావుడి అంతా చూస్తే ముస్లింలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడ్డారు. హిందువులు స్వేచ్ఛగా హోలీ పండగ జరుపుకోవడానికి సాహసించడానికి ఒకటికి రెండు సార్లు ఆలోచించే ఉంటారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లో అదనపు బలగాలను నియమించవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది. హోలీ రోజు గుండాలు స్వైర విహారం చేస్తారన్న భయోత్పాతం సృష్టించారు. ఈ గుండాలు ఎక్కడి నుంచి దిగుమతయ్యారో! బీహార్ రాజధాని పట్నాలో 200 మంది మేజిస్ట్రేట్లను నియమించారట. ఏడు చోట్ల కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. 14 నుంచి 16 దాకా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, విమానాశ్రయాల్లో కూడా అదనపు భద్రతా ఏర్పాట్లు చేశారట. ఈ ఆర్భాటాన్ని గమనించిన ముస్లింలు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కుంభ మేళా సందర్భంగా అవసరమైన అనేక ముస్లిం కుటుంబాలు ఆశ్రయం ఇచ్చిన, సదుపాయాలు కల్పించిన ఉదంతాలను బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు, అధికారవర్గాలు ఇంత తొందరగా ఎలా మరిచి పోయాయి? హోలీకి ముందు నితీశ్ కుమార్ స్థానంలో సంఘ్ పరివార్ వ్యక్తి ఎవరూ కూర్చోలేదుగా! శుక్రవారం ఏడాదికి 52 సార్లు వస్తుంది, హోలీ ఒక్క సారే వస్తుంది అనడంవల్ల ఉద్రిక్తత పెరగడం తప్ప ప్రయోజనం ఏమైనా ఉందా! ప్రధానమైన అన్ని పండగల సమయంలో ముస్లింలను భయపెడ్తున్నారు. హిందువుల పండగల సందర్భంగా చెవులు చిల్లులు పడే స్థాయిలో డి.జె.లు వాయించే దుస్సంప్రదాయం ఆచరణలోకి వచ్చేసింది. పనిగట్టుకుని బిహార్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు, అధికార వర్గాలు హోలీని భయంకరంగా చిత్రించినప్పటికీ జనం రెచ్చిపోలేదు. భారత్ కో సలాం!

అమరావతిపై ఆగని దుశ్శాసన పర్వం

పోతుల బాలకోటయ్య

కాదేదీ హననానికి అనర్హం అన్నట్లుగా ఉంది వైసీపీ నాయకుల బరితెగింపు తీరు. మహిళలను, నాలుగు గోడల నడుమ జీవించే వ్యక్తిగత జీవితాలను హననం చేయటం వారికి రాజకీయ నిరంకుశత్వంగా మారింది. వీటితోపాటు ప్రాంతాలను, రాజధానులను దూషించటం, ద్వేషించటం తెలుగు రాజకీయాల్లో దుస్సాంప్రదాయం అయ్యింది. పరిధులు దాటి వికృతంగా మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాయకుల వ్యక్తిగత జీవితాలను బజారుల్లోనూ, బహిరంగ సభల్లోనూ పెట్టి పైశాచిక ఆనందాన్ని పొందారు. ఈ హననం ప్రజా రాజధాని అమరావతిని భూతంలా ఆవహించి వీడటం లేదు. దీని నివారణకు పాలకుల దగ్గర మంత్రదండం కూడా లేదు. అమరావతిని దూషిస్తే, ద్వేషిస్తే రాజకీయ జీవితానికి ఢోకా ఉండదనో, అధినేత మెప్పు లభిస్తోందనో రాజధానిపై రాళ్ల వర్షం కురిపిస్తున్నారు. అమరావతిపై మళ్లీ దుశ్శాసనుల పర్వం మొదలైంది. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మరోమారు శాసనమండలి సాక్షిగా అమరావతిని శ్మశానం అన్నారు. వైసీపీ మరో ఎమెల్సీ పండుల రవీంద్రబాబు అమరావతిని దయ్యాల నగరం (ఘోస్ట్ సిటీ) అంటూ బరితెగించారు.

అరుంధతి సినిమాలో నాలుగు గోడల మధ్య బంధించిన పశుపతి సమాధిలో నుంచి 'ఒసేయ్ ... అరుంధతి' అని రంకెలేసినట్లు, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అధికార పీఠం కోల్పోయినా, ప్రతిపక్ష హోదా దక్కకపోయినా అమరావతిపై దూషణలకు మాత్రం తెరదించటం లేదు. కురుసభలో దుశ్శాసనుడు ద్రౌపది వలువలు విప్పిన చందంగా అమరావతిపై అమానవీయంగా దాడి చేస్తే, అవమానకరమైన మాటలతో నిందలేస్తే ఏదో రాజకీయ లబ్ది జరుగుతుందన్న భావ దారిద్ర్యంలో నాయకులు తూగటం, ఊగటం మహా సిగ్గు చేటు. శ్మశానంతో పోల్చడం ద్వారా బొత్స అమరావతి ప్రాంత నివాసితులను, ఉద్యమకారులను మళ్లీ బాధించారు. గతంలోనూ ఇలా నోరు పారేసుకుని మాట్లాడటాన్ని రైతులు సహించలేక పోయారు. ఇలాంటి వ్యాఖ్యలను అన్ని రాజకీయ పక్షాలు, మేధావులు పూర్తిగా ఖండించారు. ఐదేళ్లూ తాను అన్న మాటను తప్పుగా ఏనాడూ అంగీకరించ లేదు. వెనక్కి తీసుకోలేదు. దీంతో కౌరవులంతా నాడు వరుస కట్టి అమరావతిని దూషించారు. అప్పటి స్పీకరు తమ్మినేని సీతారాం అమరావతిని ఎడారి అన్నారు. మరొకరు కమ్మలది అన్నారు. ఇంకొకరు రాజధాని భూములు నిర్మాణాలకు పనికిరావు అన్నారు. భూములు ఇచ్చిన రైతులు చంద్రబాబు బినామీలు అన్నారు. ఉద్యమకారులను పెయిడ్ ఆర్టిస్టులు అన్నారు. వ్యాపారులన్నారు. స్వార్థపరులన్నారు. ఆఖరికి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో సోషల్ బ్యాలెన్స్ లేదని, సామాజిక అసమతుల్యత ఉందని పెద్ద బండరాయి పడేశారు. అన్ని నిందలను, అబద్ధాలను రాజధాని ఉద్యమకారులు మోశారు. వీరి దుష్ప్రచారాలపై రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. అలా నోటికొచ్చినట్లు మాట్లాడిన వారు పదవులు కోల్పోయారు. ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిపోయారు. అధికారానికి దూరమయ్యారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు మళ్లీ అమరావతిపై బొత్స విషంకక్కారు. నాడు నేను అన్నాను అంటూ మళ్ళీ చర్చకు తెరలేపారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ వారిస్తున్నా, ఎలాంటి జంకూ, బెంకూ లేకుండా ఎస్. ఆనాడు నేను అమరావతిని శ్మశానం అన్న మాట వాస్తవమే అని బదులిచ్చారు. ఇప్పటికీ అంటున్నాను అని నొక్కి చెప్పారు. దీనిపై వెలగపూడి గ్రామానికి చెందిన రైతు కంచర్ల జగన్మోహన్‌రావు తుళ్లూరు పోలీస్ స్టేషన్లో బొత్సపై ఫిర్యాదు చేశారు. మరో ఎమ్మెల్సీ రవీంద్రబాబు ఏకంగా అమరావతిని ఘోస్ట్ సిటీ అనేశారు. ఇది ప్రాంతీయ కలహాలకు ఆజ్యం పోస్తోంది. ఇది రాజధాని ప్రజల మనోభావాలకు అగౌరవం కలిగించే హేయమైన మాట. ఒక ప్రజా జీవన ప్రాంతాన్ని, అందులోనూ రాజధాని నగరాన్ని ఇలా తిట్టి పోస్తుంటే, దానికి నివారణ చర్యలు ఉండవా? నాయకుల మాటలను రాజకీయంగా వాడుకోవడం తప్ప, చట్టపరమైన చర్యలు తీసుకోరా? అన్నది రైతులందరి ప్రశ్న.

నాటి తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టారు. తెలంగాణను ఒక్క మాట అంటే తరిమి తరిమి కొట్టారు. ఆంధ్రులను తెలంగాణా ద్రోహులుగా ముద్ర వేసి తన్ని తరిమేశారు. దాడులు చేశారు. ట్యాంక్ బండపై ఉన్న ఆంధ్రుల విగ్రహాలను నేలమట్టం చేశారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏకంగా ఆంధ్రులను నీచాతినీచంగా తిట్టిపోశారు. ఆంధ్రులను తెలంగాణ ద్రోహులుగా ప్రకటించారు. మరి అమరావతిని ద్వేషిస్తున్న వారిని ఏమనాలి? ఏం చేయాలి? ఏ ద్రోహులని ప్రకటించాలి? ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోవాలి? వారిని అలా వదిలేస్తుందా? ప్రభుత్వం ముందు, డీజీపీ ముందు ఉన్న ప్రశ్నలు ఇవి. అంటే నాయకులను కానీ, వారి బిడ్డలను కానీ దూషిస్తే, పరాభవిస్తేనే కేసులు పెట్టి జైళ్లకు పంపుతారా? అమరావతికి నోరు లేదు కాబట్టి, అమరావతి మాట్లాడలేదు కాబట్టి రాజధానిపై నిందలు వేసినా వదిలేస్తున్నారా? అమరావతి మనోభావాలను, ఆ ప్రాంత ప్రజల జీవన విధానంపై ఇప్పటికీ దుశ్శాసన పర్వం కొనసాగుతుంటే, చర్యలు ఉండవా? మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికీ దూషణల్లోనూ, హెచ్చరిక ల్లోనూ ఎక్కడా తగ్గటం లేదు. సప్తసముద్రాల ఆవల ఉన్నా, లాక్కొచ్చి జైళ్ళల్లో వేస్తానని అనేక మార్లు అధికార పార్టీని హెచ్చరించారు. పోలీస్ అధికారులను బట్టలు విప్పి రోడ్డుపై నిలబెడతానన్నారు. ఈ మాటలను ప్రభుత్వం చెవికెక్కించుకోవటం లేదు. పోలీసులు సుమోటోగా తీసుకోవటం లేదు. ఆయన కొంతమంది పోలీసు అధికారుల పేర్లు చెప్పి మరీ బెదిరిస్తున్నా, డీజీపీ మౌనదీక్ష వీడటం లేదు. జగన్ 2 అంటున్నా, మీడియా డిబేట్లల్లో ఖండన మండనలకే పరిమితం అయ్యారు. జగన్ అంటే ప్రభుత్వానికి భయం అందామా? నిర్లక్ష్యం అందామా? జగన్మోహన్‌రెడ్డి భావ ప్రకటనా స్వేచ్ఛ అందామా? భావ దారిద్ర్యంగా వదిలేద్దామా? ఇవి కూడా ప్రశ్నలే. బెదిరింపులను, కించపరిచే మాటలపై చర్యలు తీసుకోకపోతే, అతి మితవాద రాజకీయంగా భావించాలి. ప్రభుత్వ పాలనలో అతివాదం ఎంతటి ప్రమాదకరమో, అతి మితవాదం కూడా అంతటి ప్రమాదకరం అని గుర్తిస్తే, పాలనను ప్రజలు మెచ్చుతారు.

– అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

స్టార్ లింక్ వస్తే దేశ రక్షణ?

ఎం కోటేశ్వరరావు

ప్రపంచ నేతలను మన చుట్టూ తిప్పుకోగల విశ్వగురువుగా నరేంద్రమోదీని కొంత మంది గతంలో వర్ణించారు, అది ఒక కోణంలో నిజమే, బహుళజాతి గుత్త సంస్థలన్నీ మన మార్కెట్‌లో ప్రవేశించేందుకు మోదీ చుట్టూ తిరుగుతున్నాయి. రెండోవైపు చూస్తే ప్రపంచ పెట్టుబడిదారుల నేతలను ప్రసన్నం చేసుకొనేందుకు సంతుష్టీకరించేందుకు మోదీ వారి చుట్టూ తిరుగుతున్నారు. తెరవెనుక జరిగే దీని గురించి కోటి మంది గొంతెత్తినా నమ్మని వారి కళ్లు తెరిపించేందుకు ఒక్క దృష్టాంతం చాలు. ఇప్పుడు అదే జరిగింది, అయినా మేం నమ్మం అనేవారిని ఎవరేం చేయలేరు. అంబానీ చెప్పినట్లు నరేంద్రమోదీ వినటం పదేళ్లుగా జరుగుతున్న సాధారణ విషయం. అదే మోదీ డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు నడుచుకోవటమే అసలైన వార్త. అదేమిటంటారా? ఎలన్‌మస్క్ స్పేస్‌ఎక్స్ కంపెనీ స్టార్‌లింక్ ఉపగ్రహ అంతర్జాల సేవలకు ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కానీ ఆ కంపెనీ సేవలను తమ ఖాతాదార్లకు అందించటానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు జియో అధినేత ముకేష్ అంబానీ, ఎయిర్‌టెల్ అధినేత సునీల్ మిట్టల్ వెల్లడించారు. వారికలా ముందే తెలిసిపోతాయి మరి. దీన్ని బట్టి నేర్చుకోవాల్సిందేమిటంటే ఆలూలేదూ చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్న సామెతను తిరిగి రాసుకోవాలి. స్టార్‌లింక్‌ను మన దేశంలో ప్రవేశపెట్టేందుకు 2021 నుంచి ఎలన్‌మస్క్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇప్పటికింకా అనుమతి ఇవ్వలేదు. ఒకవేళ ఇస్తే గిస్తే అదే పేరుతో ఒప్పందం చేసుకోవటం విశేషం. దీన్ని బట్టి కేంద్ర ప్రభుత్వ ఆమోద ముద్ర లాంఛనమే అన్నది తేలిపోయింది. మన దేశ దిగ్గజాలను ఒప్పించేందుకు మెప్పించేందుకు ఇంతకాలం స్టార్‌లింక్‌కు అనుమతి ఇవ్వలేదని, ఒక అవగాహనకు వచ్చిన తరువాత పచ్చజెండా ఊపేందుకు నిర్ణయించినట్లు స్పష్టమైంది.

కొంత మంది దృష్టిలో స్వదేశీ కార్పొరేట్ శక్తులు దేశభక్తులు, ఎప్పటి వరకు అంటే కారణాలు ఏమైనప్పటికీ వారు విదేశీ కార్పొరేట్లతో పోరాడినంతవరకు, తరువాత? స్వాతంత్ర్యానికి ముందు మహాత్మాగాంధీకి నాటి ప్రముఖ పారిశ్రామిక, వాణిజ్యవేత్త బిర్లా కుటుంబం ఎంతో మద్దతు ఇచ్చింది. అంతకు ముందు దాదాభాయ్ నౌరోజీ బరోడా రాజు దగ్గర దివాన్(మంత్రి)గా పనిచేశారు, బ్రిటన్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు, మూడుసార్లు కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు, రెండవ సోషలిస్టు ఇంటర్నేషనల్లో సభ్యుడిగా కూడా స్వల్పకాలం పని చేశారు. మనదేశ సంపదను బ్రిటన్ ఎలా పీల్చివేస్తున్నదో తెలియచెప్పారు. వారే కాదు, అనేక మంది స్వదేశీ వాణిజ్య, పారిశ్రామికవేత్తలు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటీష్ వారిని వ్యతిరేకించారు. ఎవడి గోలవాడిది, ఎవరి కారణం వారిది. నూతన వ్యవస్థ రూపుదిద్దుకుంటున్నపుడు దానికి పాతవ్యవస్థ ఆటంకంగా ఉంటే బద్దలు కొట్టి మరీ అవతరిస్తుంది. కోడి గుడ్డులో పిల్ల ఏర్పడగానే అది బయటకు వచ్చేందుకు అంతకు ముందు రక్షణగా ఉన్న పెంకును బద్దలు కొట్టుకొని బయటకు వస్తుంది తప్ప అయ్యో ఒకనాడు నాకు రక్షణగా ఉందే అని జాలిపడదు. పెట్టుబడిదారీ వ్యవస్థ పురోగమనానికి ఆటంకంగా ఉన్న ఫ్యూడల్ వ్యవస్థను బద్దలు కొట్టటమే ఫ్రెంచి విప్లవ సారం. అది భూసంస్కరణలకు తెరలేపింది. మన దేశంలో స్వదేశీ పెట్టుబడిదారులు ఎదిగేందుకు వలస పాలన, విదేశీ కంపెనీలు ఆటంకంగా ఉన్నాయి. అందుకే బిర్లావంటి పారిశ్రామికవేత్తలు, దాదాభాయ్ నౌరోజీ వంటి వాణిజ్యవేత్తలు కూడా వలస పాలనను వ్యతిరేకించారు. ఇది దోపిడీ వర్గ మిత్రవైరుధ్యం, ప్రతి వలస దేశంలోనూ కనిపిస్తుంది. స్వాతంత్ర్యం తరువాత బిర్లా వంటి వారు ఏం చేశారన్నది చూస్తే మరింతగా అర్థం అవుతుంది.

బడా పరిశ్రమల ఏర్పాటుకు తమ వద్ద తగినంత పెట్టుబడిలేని కారణంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పేరుతో ప్రభుత్వరంగాన్ని ఆమోదించారు. తగిన బలం పుంజుకున్న తరువాత నూతన ఆర్థిక విధానాల పేరుతో ఒక్క రక్షణ సంబంధిత రంగాలలో తప్ప మిగతా వాటిలో ప్రభుత్వ పెట్టుబడులు పెట్టకుండా చేయటంలో విజయం సాధించారు. విదేశీ కంపెనీలకు ద్వారాలు తెరవటంతో వాటితో పోటీ పడలేక చేతులు కలిపి సంయుక్త సంస్థల ఏర్పాటుతో లాభాలను పంచుకొనేందుకు చూశారు. ఇవి ముఖ్యంగా ఆటోమొబైల్, బీమా తదితర రంగాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. స్వరాజ్-మజ్దా, మారుతీ-సుజుకీ, ఇండో-సుజుకీ, హీరో-హోండా, టాటా-డైల్మర్,మహీంద్ర-రేనాల్ట్, భారతీ-ఆక్సా ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు. సర్దుకుపోదారం రండి అనటానికి ఇవి ఉదాహరణలు. పోటీబడి దెబ్బలాడుకున్న ఉదంతాలు కూడా ఉన్నాయి. దేశంలో రిటైల్ రంగంలో తమకు పోటీ లేకుండా చూసుకోవాలని చూసిన రిలయన్స్‌ను దెబ్బతీసేందుకు ఫ్యూచర్ గ్రూపు దుకాణాలను కొనుగోలు చేయాలని అమెజాన్ చూసింది. దాన్ని పడనీయకుండా రిలయన్స్ రంగంలోకి దిగింది. చివరికి ఫలితం ఏమంటే 2022 నుంచి ఫ్యూచర్ గ్రూపు మూతపడింది. ముకేష్ అంబానీ నేడు ఎలన్ మస్క్‌తో రాజీకి వచ్చినట్లే అమెజాన్‌తో కూడా చేతులు కలిపి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. నాడు రిలయన్స్‌కు ప్రధాని మోదీ అండగా ఉన్నారు గనుకనే అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ మూడు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసినా మోదీ దర్శన భాగ్యం కలగక వెనక్కు తిరిగి వెళ్లిపోయినట్లు అప్పుడు వార్తలు వచ్చాయి. ఇప్పుడు రిలయన్స్, ఎయిర్‌టెల్ కంటే బలమైన స్టార్‌లింక్‌కు సాక్షాత్తూ డోనాల్డ్‌ట్రంపే మద్దతు ఇస్తున్నందున దాన్ని అడ్డుకోవటానికి మోదీకి 56 అంగుళాల ఛాతీ సరిపోయినట్లు కనిపించటం లేదు. సముద్రపు భారీ అలలకు వెన్ను వంచి తప్పించుకోవటం తప్ప ఎదురు నిలిచినవారెవరూ బతికి బట్టకట్టలేరు, జియో, ఎయిర్‌టెల్ అదే చేశాయి. అడ్డుకొనేందుకు చూసి పోటీ పడలేక తెల్లజెండా ఎత్తి చేతులు కలిపాయి. ఫిబ్రవరి రెండవ వారంలో అమెరికా పర్యటనలో నరేంద్రమోదీతో ఎలన్‌మస్క్ భేటీలోనే ఆ కంపెనీలకు ఉప్పంది ఉంటుంది. ఈ మూడూ కలసి వినియోగదారులకు లబ్దిచేకూరుస్తాయా, ఒక్కటిగా చేరి పీక్కు తింటాయా చూడాల్సి ఉంది.

> **కొంత మంది దృష్టిలో స్వదేశీ కార్పొరేట్ శక్తులు దేశభక్తులు, ఎప్పటి వరకు అంటే కారణాలు ఏమైనప్పటికీ వారు విదేశీ కార్పొరేట్లతో పోరాడినంతవరకు, తరువాత? స్వాతంత్ర్యానికి ముందు మహాత్మాగాంధీకి నాటి ప్రముఖ పారిశ్రామిక, వాణిజ్యవేత్త బిర్లా కుటుంబం ఎంతో మద్దతు ఇచ్చింది. అంతకు ముందు దాదాభాయ్ నౌరోజీ బరోడా రాజు దగ్గర దివాన్ (మంత్రి)గా పనిచేశారు.**

ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ వ్యాపారాల్లో ఉపగ్రహ ఆధారిత స్టార్‌లింక్ అంతర్జాలం అతి పెద్దది, 125 దేశాల్లో సేవలను అందిస్తున్నది.అనేక సంస్థలను మింగేసింది. మనదేశంలో జియో, ఎయిర్‌టెల్ కూడా అలాంటివే. స్టార్‌లింక్‌ను మనదేశంలో ప్రవేశపెట్టాలని ఎలన్‌మస్క్ గత నాలుగు సంవత్సరాలుగా ఎంతగా ప్రయత్నిస్తున్నాడో ఈ రెండు కంపెనీల యజమానులు తమ పలుకుబడిని ఉపయోగించి అంతే గట్టిగా ఇప్పటివరకు అడ్డుకున్నాయి. చివరకు ట్రంప్ వత్తిడిని మోదీ అడ్డుకోలేరని గ్రహించి తామే లొంగి ఎంత దక్కితే అంతే ప్రాప్తం అన్నట్లుగా రాజీపడ్డాయి. మన దేశ కార్పొరేట్ల తీరుతెన్నులకు ఇది మరొక నిదర్శనం. 2023 డిసెంబరులో చేసిన టెలికాం చట్ట ప్రకారం భూ సంబంధ స్పెక్ట్రమ్ వేలం ద్వారా, ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను అధికారయంత్రాంగం ద్వారా ఒక ఫీజు నిర్ణయించి కేటాయించేట్లు నిర్ణయించారు. ఎలన్ మస్క్ మన మార్కెట్ మీద ఎప్పటి నుంచో కన్నేసి ఉన్నకారణంగా అందుకు అనుగుణంగా మోదీ సర్కార్ పావులు కదిపిందని వేరే చెప్పనవసరం లేదు. మస్క్ కంపెనీ స్టార్‌లింక్ దరఖాస్తు కేంద్రం ముందు ఉంది. న్యాయమైన పోటీ విధానాన్ని ఎందుకు అనుసరించరని దిగ్గజ కంపెనీలైన అంబానీ రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కేంద్రాన్ని అడిగాయి. ప్రభుత్వ విధానం మార్కెట్‌లో అసమాన పోటీకి దారి తీస్తుందని స్పష్టం చేశాయి. రక్షణ, సముద్రయానం, ప్రకృతి విపత్తుల అవసరాల వంటి వ్యవస్థలకు ప్రభుత్వాలు కేటాయింపులు జరపవచ్చని, వాణిజ్య అవసరాలకు మాత్రమే వేలం వేయాల్సిందేనని అవి పేర్కొన్నాయి. చివరకు రాజీ పడ్డాయి.

"కనిస్టేబు రాజ్యాంగం"

ఆర్వీ రామారావ్

భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా మేటిదని, సర్వ సమగ్రమైందనీ; మన రాజ్యాంగ నిర్మాతలు అందరూ గొప్ప మేధావులని అంటూ ఉంటాం. ఈ మాటలో ఇసుమంత కూడా అసత్యం లేదు. భారత రాజ్యాంగ ముసాయిదాలోని ప్రతి పేజీ, ప్రతి పేరా, ప్రతి పంక్తి, ఒక్కో పదం మీద చాలా సూక్ష్మమైన చర్చ జరిగింది. ఒక్కో అంశాన్ని కోడి గుడ్డు మీద ఈకలు పీకినంత పని చేస్తేగానీ రాజ్యాంగంలోని ఏ అంశమూ రాజ్యాంగ నిర్ణాయక సభ ఆమోదం పొందలేదు. అందుకే మన రాజ్యాంగం స్వాతంత్ర్యోద్యమ ఆదర్శాలను ప్రతిబింబిస్తుం దంటాం. రాజ్యాంగ నిర్ణాయక సభలో అప్పుడు దేశంలో ఉన్న వివిధ వర్గాలన్నింటికీ ప్రాతినిధ్యం లభించింది. ప్రధానమైన రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజ్యాంగ నిర్మాణంలో పాత్రధారులయ్యారు. బెంగాల్ కు చెందిన సోమనాథ్ లాహిరి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరఫున రాజ్యాంగ నిర్ణాయక సభలో ప్రతినిధిగా ఉన్నారు.

1947 ఏప్రిల్ 29న ప్రాథమిక హక్కుల గురించి చర్చ జరిగింది. ఆ చర్చలో పాల్గొన్న సీపీఐ నాయకుడు సోమనాథ్ లాహిరి "ఈ ప్రాథమిక హక్కులన్నీ పోలీసు కాన్స్టెబుల్ దృక్కోణంతో రాసినట్టు ఉన్నాయి" అని తీవ్రమైన వ్యాఖ్య చేశారు. రాజ్యాంగంలోని జాతికి స్వేచ్ఛ కల్పించే ప్రతి అంశాన్ని పోలీసు కానిస్టేబుల్‌కు అనుకూలంగా ఉంది అని సోమనాథ్ లాహిరి అన్నారు. మనది ఎంత గొప్ప రాజ్యాంగమో చెప్తూనే ఈ గొప్పతనం దాన్ని అమలు చేసే వారి మీద ఆధారపడి ఉంటుంది అని రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు డా. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్ణాయక సభలో చేసిన ఆఖరి ప్రసంగంలో హెచ్చరించారు. అంబేద్కర్ హెచ్చరికకు, సోమనాథ్ లాహిరి విసిరిన వ్యంగ్య బాణాలకు వర్తమాన కాలంలో పోలిక కనిపిస్తోంది. కన్యాశుల్కంలో గిరీశం మూడు గంటలు ఉపన్యసించిన తరవాత అదంతా విని ఝుట్కా వాడు "స్వాతంత్ర్యం వస్తే మా హెడ్ కనిస్టీబు బదిలీ అయిపోతాడా?" అని అడిగిన సందర్భం సోమనాథ్ వ్యాఖ్యను చూస్తే గుర్తు రాక మానదు.

సోమనాథ్ లాహిరి



రాజ్యాంగ నిర్ణాయక సభలో జరిగిన చర్చల్లో ఆయన చురుకుగా పాల్గొనే వారు. రాజ్యాంగ నిర్ణాయక సభలో మునుపటి సంస్థానాధీశులకు స్థానం కల్పించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. రాజ్యాంగంలోని ఒక్కో అధ్యాయాన్ని, ఒక్కో ప్రకరణాన్ని, ఒక్కో అధికరణాన్ని ఎలా విరూపం చేస్తున్నారో గత పదకొండేళ్ల నుంచి ఈ దేశ ప్రజలు చూస్తూనే ఉన్నారు. మన రాజ్యాంగంపై సోమనాథ్ లాహిరి చేసినంత ఘాటైన విమర్శ మరెవరూ చేసి ఉండరు. 1909 సెప్టెంబర్ 1న మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సోమనాథ్ లాహిరి చిన్న నాటనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యారు. బెంగాల్‌లో కార్మికోద్యమ నిర్మాణంలో బంకిం ముఖర్జీతో కలిసి ఎన్నదగిన కృషి చేశారు. ఆయన కలకత్తా ట్రాంవే కార్మిక సంఘ నాయకులుగా ఉండే వారు. కలకత్తా కమ్యూనిస్టు సమితి విభాగం ఏర్పాటులో సోమనాథ్ లాహిరీది కీలక పాత్ర. బ్రిటిష్ పాలనలో కార్మిక జీవన పరిస్థితులు మెరుగు పరచడానికి ఆయన విశేషమైన కృషి చేశారు.

1957 నుంచి 1977 మధ్య పదేళ్ల పాటు ఆయన బెంగాల్ శాసన సభ్యుడిగా ఉన్నారు. 1967లో సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేశారు. 1969లో పంచాయతీ శాఖ మంత్రిగా ఉన్నారు. సోమనాథ్ లాహిరి మంచి కథా రచయిత. పత్రికా రచయిత కూడా. కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన "స్వాధీనతే" పత్రికకు సంపాదకుడిగా ఉండేవారు.

కుంభమేళాలో రూ.30 కోట్ల ఆర్జన

రూ.12.8 కోట్లు చెల్లించాలని ఐటీ నోటీసులు

ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల జరిగిన మహాకుంభ మేళాలో బోటులు నడిపే ఓ కుటుంబం రూ.30 కోట్లు సంపాదించినట్లు ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో వెల్లడించారు. బోట్‌మ్యాన్ పింటూ మహ్రా కుటుంబం త్రివేణి సంగమం వద్ద కుంభమేళా సమయంలో 45 రోజుల పాటు సుమారు 130 బోట్లు నడిపారు. అరైల్ గ్రామానికి చెందిన ఆ కుటుంబం 45 రోజుల్లోనే రూ.30 కోట్లు ఆర్జించింది. అయితే ఆ కుటుంబానికి ఆదాయపన్ను శాఖ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఆదాయపన్ను చట్టం 1961 ప్రకారం రూ.12.8 కోట్లు పన్ను చెల్లించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. బోట్‌మ్యాన్ పింటూ మహ్రా కుటుంబం ఆదాయపన్ను శాఖ ఇచ్చిన నోటీసుతో దిగ్భ్రాంతికి గురైంది. ఆ నోటీసులపై ఫైనాన్షియల్ ప్లానర్, సెబీ రీసెర్చ్ అనలిస్ట్ ఏకే మంధన్ స్పందించారు. బోట్‌మ్యాన్ పింటూ డబ్బు సంపాదించినా... ఆయనకు సుఖం లేకుండా పోయిందన్నారు. కుంభమేళాలో రద్దీ వల్ల ఒక్కొక్క రైడ్‌పై వెయ్యి రూపాయలు వసూల్ చేసి... ఆ డబ్బు సంపాదించారని, కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ కుటుంబానికి షాక్ ఇచ్చినట్లు తన పోస్టులో పేర్కొన్నారు. ఆదాయ పన్ను శాఖ 1961 ఐటీచట్టంలోని సెక్షన్ 4, 68 కింద నోటీసు ఇచ్చిందని, రూ.12.8 కోట్లు పన్ను రూపంలో చెల్లించాలని పేర్కొన్నదన్నారు. ట్యాక్స్ శ్లాబ్‌లు తెలియని వ్యక్తి... తాజాగా భారీ పన్ను చెల్లించాల్సి వస్తోందన్నారు. డబ్బు సంపాదించినా... అదో పీడకలగా మారిందన్నారు. ఒకప్పుడు నెలలో రూ.15 వేలు సంపాదించేందుకు కష్టపడేవాళ్లని, ఇప్పుడు ఒకే ఏడాదిలో రూ.12.8 కోట్ల పన్ను కట్టాల్సి వస్తుందన్నారు.

దేశంలో పెరిగిన 'రేబిస్' మరణాలు

కుక్క కాటుతో నెలకు నలుగురి మృతి

న్యూఢిల్లీ: భారతదేశంలో 'రేబిస్ వ్యాధి' మరణాలు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే 36 శాతం మరణాలు భారత్‌లోనే ఉంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నివేదిక చెప్పింది. అధికారిక గణాంకాలు పరిశీలిస్తే... దేశంలో నివేదించబడిన రేబిస్ కేసులు, మరణాలలో దాదాపుగా 30-60 శాతం 15 ఏళ్ల కన్నా తక్కువ వయసు ఉన్న పిల్లలే ఎక్కుగా ఉంటున్నారని తేలింది. చాలా వరకు వీటిని పిల్లలు నివేదించకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నట్లు చెప్పింది. 2024 క్యాలెండర్ ఇయర్‌లో 5.19 లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. వీటిలో బాధితులు 15 కన్నా తక్కువ వయసు ఉన్నవారు ఎక్కువ. దేశంలో రేబిస్ వ్యాధికి కారణం... జనావాసాల్లో టీకాలు వేయని వీధి కుక్కలు గణనీయంగా ఉండటమేనని ప్రభుత్వం చెబుతోంది. భారతదేశంలో 2030 నాటికి రేబిస్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సూచనను అనుసరించి 24 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు రేబిస్‌ని గుర్తించదగిన వ్యాధిగా వర్గీకరించారు. దేశంలో కుక్క కాటు కేసుల సంఖ్య పెరుగుతున్నందున 2024లో రేబిస్ వ్యాధి కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. 2022లో దేశవ్యాప్తంగా 21.80 లక్షల కుక్కకాటు కేసులు నమోదైతే... రేబిస్ కారణంగా 21 మంది మరణించారు. ఇదే 2024 విషయానికి వస్తే 21.95 లక్షల కేసులు నమోదైతే... రేబిస్ వల్ల మరణించిన వారి సంఖ్య 54కి పెరిగింది. 2023లో కుక్క కాటు కేసులు 30.43 లక్షలు కాగా... రేబిస్ వల్ల 50 మంది మరణించారు. రేబిస్ కారణంగా నెలకు సగటున 4 మరణాలు సంభవిస్తున్నాయి. వీటిలో మహారాష్ట్ర నుంచి ఒకటి ఉంటుందని డేటా చూపిస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2022లో 21 మరణాలు సంభవిస్తే 2024 నాటికి 54కి చేరాయి. రేబిస్ మరణాలు 2.5 రెట్లు పెరిగాయని నివేదిక చెబుతోంది.

సుమధుర భాష తమిళం: అశ్వినీ వైష్ణవ్

చెన్నై: తమిళం మధురమైన భాషని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. తమిళనాడులోని శ్రీపెరుంబుదూరులో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రూ.1,112 కోట్లతో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 'తమిళం చాలా మధురమైన భాష. మనమంతా తమిళ సంస్కృతిని గౌరవిస్తున్నాం. దేశానికి, ఈ ప్రపంచానికి అందిన ఆస్తుల్లో అదొకటి. ఆ విషయంలో మనమంతా గర్వపడాలి. అలాగే అన్ని భారతీయ భాషలను ఆస్వాదిద్దాం. మన ప్రధాని అదే స్ఫూర్తితో పనిచేస్తున్నారు. ప్రతిభాషకు ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉండేలా చూసుకోవాలి. అదే సమయంలో మన మధ్య స్నేహాలు, సంబంధాలు దెబ్బతినకుండా ఉండేలా చూసుకోవాలి. మన దేశాన్ని ఐక్యంగా, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చుకోవడం, ప్రపంచం మన శక్తిని గుర్తించేలా చూసుకోవడం వంటి లక్ష్యాలను కలిగి ఉండాలి' అని మంత్రి అన్నారు. జాతీయ విద్యా విధానంలోని (ఎన్ఈపీ-2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా... హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

తాంత్రికుడి మాటలు విని...

భోపాల్: తల్లిదండ్రుల అమాయకత్వం... ఒక భూతవైద్యుడి పైశాచికత్వం ఓ పసిబిడ్డ ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో చోటుచేసుకున్న ఘటన గురించి పోలీసులు వెల్లడించారు. కొలారస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కుటుంబం... తమ ఆరు నెలల బిడ్డకు అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం రఘువీర్ ధాకడ్ అనే తాంత్రికుడి వద్దకు తీసుకెళ్లింది. ఆ చిన్నారిపై చెడు నీడ ఉందని భయపెట్టిన రఘువీర్ భూతవైద్యం మొదలుపెట్టాడు. చికిత్సలో భాగంగా మంటలపై తలకిందులుగా వేలాడదీశాడు. నయమవుతుందనే నమ్మకంతో బిడ్డ ఏడుపును ఆ తల్లిదండ్రులు భరించారు. కానీ ఎంతకీ ఏడుపు ఆపకపోవడంతో దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆ చిన్నారికి చికిత్స జరుగుతోంది. ఆ పసిబిడ్డ కళ్లు దెబ్బతిన్నాయని శివపురి జిల్లా ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు.

రాకేశ్ తికైత్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

రైతు నేత కారును ఢీకొన్న వన్యప్రాణి

ముజఫర్‌పూర్ (యూపీ) : రైతు నాయకుడు, భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) జాతీయ ప్రతినిధి రాకేశ్ తికైత్ ముజఫర్‌నగర్ జిల్లాలో తన వాహనం ముందు భాగాన్ని ఒక నీలగై (అతిపెత్త అడవి జింక జాతి) ఢీకొట్టడంతో తృటిలో తప్పించుకున్నారని అధికారులు శనివారం తెలిపారు. తికైత్ కథనం ప్రకారం... ఆయన వాహనం మీర్‌పూర్ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్నప్పుడు ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా రోడ్డుపై ఒక నీలగై కనిపించి ఆయన కారును ఢీకొట్టింది. అయితే తికైత్ ఈ ప్రమాదం నుంచి గాయపడకుండా తప్పించుకున్నారు. సమాచారం అందిన వెంటనే ఉత్తర ప్రదేశ్ మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్, ముజఫర్‌నగర్ లోక్‌సభ ఎంపీ హరేంద్ర సింగ్ మాలిక్ రైతు నాయకుడిని పరామర్శించడానికి ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా తికైత్ తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నీలగై తప్పుడు మార్గంలో రాడ్‌పై నుంచి దూకి తన వాహనాన్ని ఢీకొట్టిందని చెప్పారు. 'మేము సీటు బెల్టులు ధరించాం. ఇది మాకు అదనపు భద్రతను ఇచ్చింది. అందరూ సీటు బెల్టు ధరించాలి. వాహనం చిన్నగా ఉండి, సీటు బెల్టులు ధరించకపోతే, నష్టం ఎక్కువగా ఉండేది. అయితే నా గన్‌మెన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అడవి జంతువులు వేగంగా కదులుతాయి' అని తికైత్ తెలిపారు. అధిక వేగంతో డ్రైవ్ చేయవద్దని ప్రజలను కోరారు.

ప్రియురాలి ఘాతుకం

లక్నో: సహజీవనం సమయంలో ఇచ్చిన నగదు, నగలు తిరిగి ఇవ్వాలని ప్రియురాలిని ప్రియుడు ఒత్తిడి చేయడంతో... తన స్నేహితులతో కలిసి అతడిని కొట్టి బలవంతంగా విషం తాగించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... హమీర్‌పూర్‌కు చెందిన శైలేంద్ర గుప్తా మహోబాలో ఓ ప్రైవేట్ కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం కాలిపహరి గ్రామానికి చెందిన ఒక మహిళతో అతడికి పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి ఒక అద్దె ఇంట్లో కొంతకాలం సహజీవనం చేశారు. ఆ సమయంలో విలువైన నగలు, రూ.నాలుగు లక్షల నగదు తన ప్రియురాలికి ఇచ్చాడు. కాగా, కొన్నేళ్ల తర్వాత ఆ మహిళకు మరో వ్యక్తి పరిచయమయ్యాడు. దీంతో శైలేంద్రకు ఆమె దూరంగా ఉండటంతో వారిద్దరూ విడిపోయారు. ఈ నేపథ్యంలో తాను ఇచ్చిన నగలు, నగదు తిరిగి ఇవ్వాలని శైలేంద్ర ఆమెను డిమాండ్ చేశాడు. ఆ మహిళ నివసించే ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా తన సహచరులతో కలిసి ఆమె అతడిని కొట్టింది. బలవంతంగా విష పదార్థాన్ని తాగించింది.

రైతుల ఆత్మహత్యలు ఆందోళనకరం

- అన్నదాతలకు కేంద్రం సాయం చేయాలి
- ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్

బారామతి: మహారాష్ట్రలోని మరఠ్వాడ, విదర్భ రైతు ఆత్మహత్యల గురించి ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సహాయం చేయడానికి కేంద్రం ఒక విధానాన్ని రూపొందించాలని కోరారు. 2024లో మహారాష్ట్రలో 2,635 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని రాష్ట్ర సహాయ, పునరావాస శాఖ విడుదల చేసిన గణాంకాల నేపథ్యంలో పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు. బారామతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'మరఠ్వాడ, విదర్భ నుంచి వచ్చిన సమాచారం ఆందోళనకరంగా ఉంది. మేము వివిధ ప్రాంతాల నుంచి కచ్చితమైన వివరాలు సేకరిస్తాం. రైతులకు సహాయం చేయడానికి కేంద్రం ఒక విధానాన్ని రూపొందించాలి' అని తెలిపారు. ఇదిలాఉండగా, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నాయకుడు జయంత్ పాటిల్...అజిత్ పవార్ నేతృత్వంలోని పార్టీలోకి మారుతున్నారనే ఊహాగానాలపై, శరద్ పవార్ స్పందిస్తూ పాటిల్ ఇప్పటికే మీడియాకు తన ప్రకటన ఇచ్చారని అన్నారు. శుక్రవారం బారామతిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడిని కలిశారు. ఆయన కలత చెందలేదని, ఆయన ప్రకటనను వక్రీకరించారని శరద్ పవార్ తెలిపారు. వ్యవసాయం ఒక విప్లవాన్ని చూస్తోందని, చెరకు సాగులో కృత్రిమ మేధ (ఏఐ) త్వరలో ఉపయోగించబడుతుందని పవార్ అన్నారు. 'చెరకు నాణ్యతను పెంచడానికి ఏఐ సాంకేతికతను ఉపయోగించవచ్చు. అనేక చక్కెర కర్మాగారాలు ఏఐ వ్యవసాయ ప్రక్రియలో పాల్గొంటాయి. చక్కెర కర్మాగారాలకు సంబంధించిన కొంతమంది అధికారులతో ఈ రోజు తరువాత సమావేశం జరగనుంది. త్వరలో ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంటాం. వ్యవసాయంలో ఏఐ వాడకం త్వరలో ప్రారంభమవుతుంది' అని చెప్పారు. సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కారణంగా వార్తల్లో నిలిచిన బీడ్ ఒకప్పుడు ప్రశాంతమైన జిల్లా అని పవార్ అన్నారు. 'బీడ్‌లో పరిస్థితి ఎప్పుడూ ఇలా ఉండేది కాదు. ఇది ఒకప్పుడు ప్రశాంతమైన జిల్లా. నా పార్టీ నుంచి ఆరుగురు వ్యక్తులు బీడ్ నుంచి ఎన్నికయ్యారు. అయితే వారిలో కొందరు తమ అధికారాన్ని దుర్వినియోగం చేశారు. దాని పరిణామాలను మనం చూస్తున్నాం' అని ఆయన అన్నారు. ఇక్కడి తల్కటోరా స్టేడియంలో మరాఠా సామ్రాజ్య యోధులు పేష్వా బాజీరావు-1, మహద్జీ షిండే, మల్హారావు హోల్కర్ మూడు గుర్రపు స్వారీ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని శరద్ పవార్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు. 18వ శతాబ్దంలో మొఘలులకు వ్యతిరేకంగా మరాఠా సామ్రాజ్యం ప్రారంభించిన సైనిక ప్రచారాలలో తల్కటోరా స్టేడియం చుట్టుపక్కల ప్రాంతం అపారమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. తల్కటోరా స్టేడియంలో బాజీరావు, షిండే, హోల్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని పూణేకు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ ప్రణాళిక చేసిందని, అయితే సాహిత్యకారులు, చరిత్రకారులు ముగ్గురు యోధుల గుర్రపు స్వారీ విగ్రహాలకు అనుకూలంగా ఉన్నారని పవార్ చెప్పారు.

'అయితే చాలా మంది సాహిత్య ప్రముఖులు మరియు శ్రేయోభిలాషులు పూర్తి సైజు గుర్రపు స్వారీ విగ్రహాలు వారి శౌర్యం, సహకారానికి మరింత సముచితమైన నివాళిగా ఉంటాయని అభిప్రాయపడ్డారు' అని ఆయన మోదీకి రాసిన లేఖలో తెలిపారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని ఢిల్లీ ప్రభుత్వం, న్యూఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎన్‌డీఎంసీ) ని ఆదేశించడంలో ప్రధాన మంత్రి జోక్యం చేసుకోవాలని తాను కోరుతున్నానని శరద్ పవార్ అన్నారు. ప్రధాని ప్రారంభించిన 98వ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి కూడా తల్కటోరా స్టేడియం వేదికగా నిలిచింది. 'సర్హాద్ పూణే, అఖిల భారతీయ మరాఠీ సాహిత్య మహామండల్ నిర్వహించిన ఈ సాహిత్య ఉత్సవం మీ గౌరవనీయ నాయకత్వంలో చారిత్రాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుంది' అని తెలిపారు.

మెరుగ్గానే ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఆర్థిక స్థితి: ఆర్‌బీఐ

ముంబై: ప్రముఖ ప్రైవేటు రంగ బ్యాంక్ ఇండస్ ఇండ్ ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. బ్యాంక్‌పై వస్తున్న ఊహాజనిత కథనాలకు డిపాజిటర్లు స్పందించవద్దని సూచించింది. బ్యాంక్‌కు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించడంతో స్టాక్‌మార్కెట్లలో బ్యాకింగ్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో డిపాజిటర్లు ఆందోళనకు గురికాకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రకటన విడుదల చేసింది. ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో దాదాపు రూ.2,100 కోట్ల మేర అకౌంటింగ్ తేడాలు వెలుగుచూశాయి. కరెన్సీ డెరివేటివ్స్‌కు సంబంధించిన అవకతవకలను గత ఏడాది సెప్టెంబరు-అక్టోబరులో గుర్తించినా... ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఇప్పుడు బహిర్గతం చేసింది. ఫలితంగా ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు భారీగా పతనమై చిన్న మదుపర్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు భారీ నష్టం వాటిల్లింది. ఖాతాల్లో లోపాల కారణంగా మార్చి త్రైమాసికంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ రూ.1600 కోట్ల నష్టాన్ని చవిచూడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత త్రైమాసికంలోనే పరిష్కార చర్యలు పూర్తిచేయాలని ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డుకు ఆర్‌బీఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కుట్ర: మాన్

అమృత్‌సర్: అమృత్‌సర్ ఖాండ్వాలాలోని ఠాకూర్ద్వారా ఆలయంలో పేలుడుపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పంజాబ్‌లో శాంతిని దెబ్బతీసేందుకు నిరంతరం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. మాదకద్రవ్యాలు, గ్యాంగ్‌స్టర్లు, దోపిడీ ఇలాంటివన్నీ ఇందులో భాగమే. పంజాబ్ ఒక కల్లోలిత రాష్ట్రంగా మారిందని చూపించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. హోలీ పండుగ సమయంలో ఇతర రాష్ట్రాల్లో పోలీసులు లాఠీచార్జీ చేయాల్సి వచ్చింది. కానీ పంజాబ్‌లో అలాంటివి జరగలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి బాగుంది' అని ఆయన అన్నారు. కాగా, గురువారం రాత్రి ఠాకూర్ద్వారా ఆలయంలో పేలుడు సంభవించింది. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆలయంలోకి పేలుడు పదార్థాన్ని విసిరేయడంతో ఈ పేలుడు సంభవించినట్లు ప్రత్యక్షసాక్షి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ పేలుడు ఘటనలో పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఐఎస్ఐ) హస్తం ఉందని అమృత్‌సర్ కమిషనర్ జీపీఎస్ బుల్లార్ అనుమానం వ్యక్తంచేశారు. కాగా, ఈ పేలుడు ఘటనపై పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ స్పందించారు.

హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నాం

పవన్ తప్పుగా అర్థం చేసుకున్నారు: డీఎంకే నేతలు

చెన్నై: త్రిభాషా సూత్రం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం మధ్య తీవ్రవివాదం కొనసాగుతున్న వేళ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై డీఎంకే తీవ్రంగా స్పందించింది. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నప్పుడు... తమిళ సినిమాల్ని హిందీలో డబ్బింగ్ ఎందుకు చేస్తున్నారని పవన్ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ సయీద్ హాఫీజుల్లా స్పందిస్తూ పవన్ విమర్శలను తోసిపుచ్చారు. భాషా విధానంపై తమిళనాడు వైఖరిని ఆయన తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. 'వ్యక్తిగతంగా హిందీ, ఇతర భాషలు నేర్చుకోవడాన్ని మేం ఎన్నడూ అడ్డుకోలేదు. ఆసక్తి ఉన్నవారు నేర్చుకోవడం కోసం ఇప్పటికే మా రాష్ట్రంలో హిందీ ప్రచార సభలు నిర్వహిస్తున్నాం. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎన్ఈపీ, పీఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో మా రాష్ట్ర ప్రజలపై బలవంతంగా హిందీ భాష రుద్దుతోంది. దీన్ని మేం వ్యతిరేకిస్తున్నాం' అని డీఎంకే ప్రతినిధి వెల్లడించారు. ఈ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత టీకేఎస్ ఎలన్‌గోవన్ మాట్లాడుతూ '1938 నుంచే తమిళులపై హిందీ భాష బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ద్విభాషా విధానాన్నే అమలుచేస్తామని ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదించుకున్నాం. విద్యానిపుణుల సలహాలు, సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నాం. అంతేగానీ... సినీనటులు, రాజకీయ నాయకుల అభిప్రాయాలతో ఏకీభవించాల్సిన అవసరం లేదు. 1968లో ఆ బిల్లు ఆమోదం పొందినప్పుడు పవన్ కల్యాణ్ ఇంకా పుట్టి ఉండరు. తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ఉండొచ్చు' అని విమర్శించారు. మరోవైపు బీజేపీ నేతలు పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్ మాట్లాడుతూ త్రిభాషా వాదన సరికాదని, భారతదేశానికి బహుభాషలు కావాలన్నారు. 'దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. అలాంటప్పుడు తమిళ సినిమాల్ని హిందీలో డబ్బింగ్ చేయొద్దు. మీకు డబ్బులేమో ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల నుంచి కావాలా? హిందీ మాత్రం వద్దా? ఇదేం న్యాయం? లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య తగ్గిపోతుందంటూ ప్రకటనలు చేస్తున్నవారు... నిజంగా అవి తగ్గుతాయో లేదో చర్చకు పెట్టాలి. అంతే తప్ప రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి? వివేకం, ఆలోచన ఉండొద్దా?' అంటూ పవన్ ప్రశ్నించారు.

బీజేపీ నేత కాల్చివేత

చండీగఢ్: ఓ భూ వివాదం కారణంగా బీజేపీ నాయకుడు సురేంద్ర జవహర్‌ను ప్రత్యర్థి పట్టపగలే తుపాకీతో కాల్చి హత్య చేశాడు. ఈ దారుణ ఘటన ఓ షాపింగ్ మాల్‌లో చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన సీసీటీవీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

హర్యానా సోనిపట్ జిల్లాలో జరిగిన ఈ హత్యకేసు సంచలనంగా మారింది. నిందితుడు, బీజేపీ నేత సురేంద్ర జవహర్ మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతున్నట్లు తెలిసింది. సురేంద్ర జవహర్ తన పొరుగువారి అత్త భూమిని కొనుగోలు చేయడంతో వివాదం మొదలైనట్లు సమాచారం. దీంతో చాలా రోజులుగా వారిద్దరి మధ్య మాటామాటా పెరిగి, తీవ్ర వాగ్వాదాలు జరిగాయి. అవి ఇప్పుడు హత్యకు దారితీశాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఈ దారుణ ఘటనలో నిందితుడితో ముందుగా బీజేపీ నేత వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత కొంతసేపటి తరువాత జవహర్ తన దుకాణంలో కూర్చుని ఉండగా... నిందితుడు తుపాకీతో లోనికి ప్రవేశించి కాల్పులు జరిపాడు. అతని తలపై వరుసగా మూడు బుల్లెట్లు దింపాడు. దీంతో జవహర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పరువు కాపాడుకునేందుకే...

సీఈసీ భేటీపై టీఎంసీ

న్యూఢిల్లీ: ఓటరు గుర్తింపు కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడంపై ఈనెల 18న ప్రధాన ఎన్నికల కమిషనర్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం పరువు కాపాడుకునే చర్య అని తృణమూల్ కాంగ్రెస్ శనివారం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాలకు సంబంధించి అక్రమాలపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తుండటం దృష్ట్యా మంగళవారం ఈ కీలక భేటీ జరగబోతోంది. దీనిపై టీఎంసీ నేత సాగరికా ఘోష్ స్పందిస్తూ ఈపీఐసీ నకిలీ నంబర్లపై గతంలో ఎన్నికల సంఘం ఇచ్చిన ప్రకటనలు, తాజాగా సమావేశం నిర్వహించడం ద్వారా పరువు కాపాడుకోవాలని ఈసీఐ భావిస్తోందన్నారు. రాష్ట్రంలో తదుపరి ఎన్నికల వరకు టీఎంసీ డేగ కన్నుతో నిఘా పెడుతుందని తెలిపారు. ఈనెల 11న టీఎంసీకి చెందిన 10 మంది ప్రతినిధులు ఎన్నికల కమిషన్ బెంచ్‌ను కలిశారు. నకిలీ ఈపీఐసీ నంబర్లపై వినతి పత్రాన్ని అందజేశారు. కాగా, వేర్వేరు రాష్ట్రాలలో డూప్లికేట్ ఓటర్ ఐడీ నంబర్ల అంశాన్ని ఫిబ్రవరి 27న బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రస్తావించారు. వికేంద్రీకరణ, మ్యానువల్ మెకానిజం వల్ల వేర్వేరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొందరు ఓటర్లకు ఒకే రకమైన ఈపీఐసీ నంబర్లు జారీ అయినట్లు ఈనెల 2న ఎన్నికల సంఘం పేర్కొంది.

మాజీ ఎంపీకి తప్పని కుల బహిష్కరణ

భువనేశ్వర్: ఒడిశాకు చెందిన మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ సామాజిక వెలివేతకు గురయ్యారు. కులాంతర వివాహం చేసుకున్నందుకు ప్రదీప్ మాఝీని ఆ సామాజిక తరగతివారు వెలివేశారు. భాత్రా గిరిజన వర్గానికి చెందిన ఆయన... ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నారు. బ్రాహ్మణ కులానికి చెందిన సుశ్రీ సంగీత సాహూను పెళ్లాడారు. కులాంతర వివాహం చేసుకున్న ప్రదీప్ మాఝీపై... భాత్రా తెగకు చెందిన ప్రజలు ఆగ్రహంతో రగిలిపోయారు. వెంటనే ఆయన్ను తమ కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆ మాజీ ఎంపీ ఇంట్లో జరిగే వేడుకలకు హాజరుకాబోమని భాత్రా సంఘం తీర్మానించింది. ఇటీవల మాజీ ఎంపీకి చెందిన సోదరి సంజూ మాఝీ కూడా పెళ్లి చేసుకున్న దని, ఆమెను ఓ బ్రాహ్మణ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారని, దీన్ని ఖండిస్తున్నట్లు అఖిల భారతీయ ఆదివాసీ భత్రా సొసైటీ ఓ ప్రకటనలో పేర్కొన్నది. బ్రాహ్మణ కులస్థులను పెళ్లి చేసుకున్న మాఝీ కుటుంబాన్ని 12 ఏళ్ల పాటు కులం నుంచి వెలివేస్తున్నట్లు ఆ సంఘం వెల్లడించింది. తమ తీర్మానంలో భాగంగా భాత్రా గిరిజన తెగకు చెందిన ఎవరూ ప్రదీప్ మాఝీ ఇంట్లో జరిగే శుభకార్యాలకు వెళ్లకూడదని పేర్కొన్నారు. భాత్రా సంఘం తీసుకున్న నిర్ణయం పట్ల మాజీ ఎంపీ కానీ, ఆయన కుటుంబసభ్యులు కానీ స్పందించలేదు. 2009లో నబరంగ్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ప్రదీప్ మాఝీ ఎంపీగా గెలిచారు. గత ఏడాది ఆయన బిజూ జనతాదళ్ పార్టీలో చేరారు.

కుల గణన చేయాల్సిందే

కాన్షీరాం జయంత్యుత్సవంలో మాయావతి

లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. ఆ పార్టీ అధినేత్రి మాయావతి సహా అనేక మంది నాయకులు తమ దివంగత నేతకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్‌పీ అధ్యక్షురాలు మాయావతి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుల గణనకు పిలుపునిస్తూ, ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తర ప్రదేశ్‌లో విస్తారమైన జనాభా 'ఉక్కు మహిళ' నాయకత్వంలో మాటల కంటే చర్యకు ఎలా విలువ ఇస్తుందో చూశారని తెలిపారు. 'రాష్ట్రంలో, దేశంలో బహుజన సమాజ జనాభా 80 శాతానికి పైగా ఉంది. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వారి సంక్షేమానికి హామీ ఇవ్వడానికి, బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ రాజ్యాంగంలో జనాభా గణన నిబంధనను రూపొందించారు. అది పెండింగ్‌లో ఉండటం మంచి పాలన కాదు. జనగణన పని నేరుగా దేశ నిర్మాణంతో ముడిపడి ఉంది. ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో అప్రమత్తంగా ఉన్నట్లే ఈ బాధ్యత పట్ల అప్రమత్తంగా ఉండాలి. జనాభా గణన నిర్వహించకపోవడంపై పార్లమెంటరీ కమిటీ కూడా ఆందోళన వ్యక్తం చేసింది' అని పేర్కొన్నారు. దేశం, సమాజ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయడానికి, కుల గణన ప్రాముఖ్యతను తోసిపుచ్చలేమని బీఎస్‌పీ అధినేత్రి అన్నారు. 'ఈ విషయంలో తన చిత్తశుద్ధిని చూపించడానికి ప్రభుత్వం త్వరలో అవసరమైన చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. దేశంలో మతం, ప్రాంతం, కులం, వర్గం, భాషల 'వివాదాల' పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, 'ఈ వివాదాలకు మూల కారణం సంకుచిత, కులతత్వ, మతపరమైన, ద్వేషపూరిత రాజకీయాలు. అధిక ద్రవ్యోల్బణం, పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వెనుకబాటుతనం వంటి జాతీయ సమస్యలు పూర్తిగా మరిచిపోయాయి' అని మాయావతి పేర్కొన్నారు. ఉపాధి కొరత గురించి ఆమె మాట్లాడుతూ 'ఖాళీ చేతులు, ప్రజల ఖాళీ మనస్సులు దేశ ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి' అని అన్నారు. 'అందుకే, కాన్షీ రామ్ జీ 'హర్ హాత్ కో కామ్' (ప్రతి చేయి కోసం పని) విధానాన్ని సమర్థించారు. నా ప్రభుత్వం దీనిపై పని చేసింది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు కూడా గణనీయమైన రీతిలో సహాయం చేసింది. ఇతర పార్టీల ప్రభుత్వాలు గాలిలో మాట్లాడుకుంటూ రాష్ట్ర, దేశ ప్రజల జీవితాలను దుర్భర స్థితిలోకి నెట్టాయి. ప్రజలు ఇప్పుడు విసిగిపోయారు' అని తెలిపారు. కాన్షీరాంకు నివాళులు అర్పిస్తూ, మాయావతి మాట్లాడుతూ 'ఈ రోజు బీఎస్‌పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జీ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా పార్టీ ఆయనకు నివాళులర్పించింది. సామాజిక మార్పు, ఆర్థిక విముక్తి కోసం ఆయన ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సంకల్పించింది' అని తెలిపారు. 'అపారమైన పేదరికం, నిరుద్యోగం, దోపిడీ, అణచివేత, వెనుకబాటుతనం, కులతత్వం, మత హింస, ఉద్రిక్తతలతో కూడిన 'బహుజన సమాజ్'ను విముక్తి చేయడానికి, మీ విలువైన ఓటు శక్తిని అర్థం చేసుకోవడం, అధికారానికి ప్రధాన కీని పొందడం అవసరం. ఇది నేటి సందేశం' అని అన్నారు. తనను తాను 'ఉక్కు మహిళ' గా పేర్కొంటూ బీఎస్‌పీ అధినేత్రి... 'ఉక్కు మహిళ' నాయకత్వంలో బీఎస్‌పీ మాటల కంటే చర్యలను ఎలా ఎక్కువగా విశ్వసిస్తుందో ఉత్తర ప్రదేశ్‌లోని విస్తారమైన జనాభా చూసింది. అధికారంలో ఉన్నప్పుడు బహుజనుల సర్వతోముఖాభివృద్ధిని ఇది నిర్ధారిస్తుంది. అయితే ఇతర పార్టీలు చేసిన చాలా వాదనలు నిరాధారమైనవి, మోసపూరితమైనవిగా నిరూపితమయ్యాయి' అని తెలిపారు. మార్చి 15, 1934న పంజాబ్‌లోని రూప్‌నగర్‌లో జన్మించిన కాన్షీరాం వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజల అభ్యున్నతి, రాజకీయ సమీకరణ కోసం పనిచేశారు. ఆయన 1971లో ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీస్ కమ్యూనిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బీఏఎంసీఈఎఫ్) ను, 1981లో దళిత్ షోషిత్ సమాజ్ సంఘర్ష్ సమితిని స్థాపించి, 1984లో బీఎస్‌పీని స్థాపించారు. కాన్షీరాం 1991లో ఉత్తర ప్రదేశ్‌లో ఎటావా నుంచి, 1996లో పంజాబ్‌లోని హోషియాపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998 నుంచి 2004 వరకు రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. బీఎస్‌పీ ప్రముఖుడు 2006 అక్టోబరు 9న ఢిల్లీలో 71 సంవత్సరాల వయసులో మరణించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సోషల్ మీడియాతో చాలా ఇబ్బంది

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : సోషల్ మీడియా ద్వారా నాకు చాలా ఇబ్బంది ఏర్పడిందని కానీ సోషల్ మీడియా ఎఫెక్ట్‌ను సీఎం సభలో మాట్లాడడం మా అందరికీ చాలా రిలీఫ్ ఇచ్చిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నా ఫోటోలు మార్ఫింగ్ చేసి మానసిక ఆవేదనకు గురి చేసారని, సోషల్ మీడియా పోస్టులు కొన్ని సార్లు నన్ను డీమోరల్ చేసాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం శాసనసభ ఆవరణలో మంత్రి సీతక్క విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ మహిళలు రాజకీయాల్లో ఎదగడమే కష్టమని, అలాంటిది మేము ఈ స్థాయికి వస్తే మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. సోషల్ మీడియాను సోషల్ సర్వీస్‌కు వాడుకున్న నేను అంతే ఇబ్బందులకు గురయ్యానన్నారు. సోషల్ మీడియాను బిఆర్ఎస్ అబద్దాలకు వాడుతుందని, సోషల్ మీడియా కుటుంబాలను బజారుకీడుస్తుందని మండిపడ్డారు. బాడీ షేమింగ్, ఫోటోలు మార్ఫింగ్ అనవివి అన్నట్లుగా చెప్తున్నారని విమర్శించారు. గత సంవత్సరం నుంచి ఇది ఎక్కువ అవుతుందని, అన్న చెల్లెల్లు చేతిలో చెయ్యి వేసుకున్నా వాటిని మరోరకంగా చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను మంచికి వాడాలి తప్ప చెడుకు కాదన్నారు. కరోన సమయంలో ఎంతో సర్వీస్ చేసా, దాన్ని కూడా సోషల్ మీడియాలో నన్ను విమర్శించారన్నారు. అబద్దాల పైనే బిఆర్ఎస్ నడుస్తుందని, అబద్దానికి అర్థం బిఆర్ఎస్ అంటూ చెపుకొచ్చారు. కానీ ఏ రోజు కైనా నిజమే గెలుస్తుందన్నారు..సోషల్ మీడియా కట్టడి అవసరమని, సోషల్ మీడియా ద్వారా మా పై బురద చల్లుతున్నారని, కడుక్కోవడం మా వంతు అవుతుందన్నారు.

ఆశా వర్కర్లపై వేధింపులు అరికట్టాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆశా వర్కర్లకు రావాల్సిన సర్వే బకాయిలను వెంటనే చెల్లించాలని, వారిపై వేధింపులు అరికట్టాలని, పని భారం తగ్గించాలని కోరుతూ శనివారం డీఎంహెచ్ఓ సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుండి 30 వరకు ఆశా వర్కర్లను సర్వే చెయ్యాలని అధికారులు తెలిపారని, ఇప్పటికి జిల్లాలో 4 విడతల ఎల్‌సిడిసి సర్వే డబ్బులు బాకీ ఉన్నాయని, అవి చెల్లించకుండా మరల ఎల్‌సిడిసి సర్వే చేయమని అధికారులు ఒత్తిడి చేస్తుండడం సరికాదన్నారు. లాస్ట్ డిసెంబర్‌లో చేసిన సర్వే వేతనం చేసినవారికి ఖాతాలో జమకాలేదన్నారు. కాబట్టి బకాయిలు చెల్లించిన తరువాత మాత్రమే ఆశలు ఎల్‌సిడిసి సర్వే చేస్తారని ఆయన తెలిపారు. జాతీయ కార్యక్రమాలని ప్రభుత్వం గౌరవ ప్రదమైన కార్యక్రమంగా చెప్పుకుంటుంని, అలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కూడా బడ్జెట్ కేటాయించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా మన జిల్లాలో ఆశా వర్కర్లపైన ఆన్లైన్ పని ఒత్తిడి ఉందని, దీని వలన ఆశ వర్కర్లు మనస్తాపానికి గురయ్యి, అనారోగానికి గురౌతున్నారన్నారు. జిల్లాలో కొత్తగా ఆశ వర్కర్లకు పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, బీడీకే, పీడీకే డ్యూటీలు కొత్తగా చేయిస్తున్నారని, ఇక ఆన్లైన్ అయితే అబాకార్ప్, సి బ్యాక్, ఎన్‌సిడి స్క్రీనింగ్, ఈ సంజీవిని, ఐహెచ్ఐపి తదితరాలు చేయిస్తున్నారని, ఇది ఆశావర్కర్ల పని కాకపోయినా చెప్పిందల్లా చేయాలని, లేకపోతే డ్యూటీలో నుంచి తీసేస్తామని కొన్ని వేల మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని మీరు తప్పుకుంటే వేరేవాళ్ళు రావడానికి సిద్ధంగా ఉన్నారని, ఆశాలు 24 గంటలు పని చేయాలని అధికారులు బెదిరించడం ఎంత వరకు సరైందన్నారు. ఆశ వర్కర్లకు ఇచ్చే వేతనాలకు చేయించుకునే పనికి సంబంధం లేకుండా అయిపోయిందని, ఈ సమస్యలను పరిష్కారం చేయలేని ఎడల మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్లు పని బంద్ చేసి పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు.

కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చునని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ అహ్మద్, మల్కాజిగిరి ఎస్ఐ కొండల్ లు అన్నారు. శనివారం మల్కాజిగిరి మౌలాలి ఆర్టీసీ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను సెవెన్ రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు సీనియర్ అడ్వకేట్ నజీరుద్దీన్ హైమద్, మల్కాజిగిరి ఎస్.ఐ కొండల్, ఫౌండేషన్ చైర్మన్ తిప్పారపు కీర్తి కుమార్, సీనియర్ జర్నలిస్ట్ మనోహర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చునని, రానున్న బోర్డ్ ఎగ్జామ్స్‌కి కష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని చేస్తున్న పౌండేషన్ వారిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ శ్రీనగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని న్యూ శ్రీనగర్ కాలనీలో యునైటెడ్ యూత్ రివైవల్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ వై.ప్రేంకుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేం కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఈ క్యాంపుల ద్వారా తమలో అనారోగ్యాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బక్క ఏలియా బాబు, కిషోర్, ప్రదీప్, ఎఫ్.బాబు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ స్టేషన్‌ను జాతికి అంకితం చేస్తాం

బేగంపేట అమృత్ స్టేషన్ మొదటి దశ పునరాభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత ప్రభుత్వ బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి శనివారం బేగంపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి, అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కొనసాగుతున్న మొదటి దశ పునరాభివృద్ధి పనులను సమీక్షించారు. ఆయనతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు ఉన్నారు. బేగంపేట అమృత్ స్టేషన్ పునరాభివృద్ధి మొదటి దశ పనులను జి.కిషన్‌రెడ్డి పరిశీలించారు. ఇందులో కొత్త స్టేషన్ భవనం, ముఖద్వారం, ప్లాట్‌ఫామ్ ఉపరితల ఎత్తు పెంపు, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు, బుకింగ్ కౌంటర్లు, సైనేజీలు, వెయిటింగ్ హాల్ మొదలైనవి ఉన్నాయి. తరువాత కేంద్ర మంత్రి స్టేషన్‌లో మీడియాను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్రంలో రైలు అభివృద్ధి భారీ స్థాయిలో రూపాంతరం చెందుతుందని పేర్కొన్నారు. బేగంపేట స్టేషన్ పునరాభివృద్ధి పనులు 90 శాతం పూర్తయ్యాయని, స్టేషన్‌ను త్వరలో జాతికి అంకితం చేస్తామని ఆయన తెలియజేశారు. దశలవారీగా రూ.38 కోట్ల వ్యయంతో విమానాశ్రయ ప్రమాణాలకు సమానంగా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నూతన బేగంపేట అమృత్ స్టేషన్‌ను పూర్తిగా మహిళా సిబ్బందితో నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఇంకా, కేంద్ర మంత్రి 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణ రాష్ట్రానికి రైల్వే బడ్జెట్‌లో రూ.5,337 కోట్లు కేటాయించినట్లు తెలియజేశారు. విద్యుదీకరణ, కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ మొదలైన వాటితో సహా రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.39,300 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100 శాతం విద్యుదీకరణ జరిగిందని ఆయన తెలియజేశారు. కేంద్ర మంత్రి త్వరలో సికింద్రాబాద్‌లో కావచ్ పరిశోధన సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. దేశీయంగా అభివృద్ధి చేసిన కవచ్ టెక్నాలజీని దేశ వ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేస్తున్నామని, పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముందుగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్వాగత ప్రసంగం చేస్తూ, బేగంపేట అమృత్ స్టేషన్ ప్రాజెక్ట్ పనుల పురోగతి ముఖ్యాంశాలను మీడియాకు వివరించారు. బేగంపేట రైల్వే స్టేషన్‌ను పర్యావరణ హిత హరిత రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్టేషన్‌లో పచ్చదనం కోసం నీటి రీసైక్లింగ్ ప్లాంట్ అమర్చబడుతుందని తెలియజేశారు.

నైపుణ్య శిక్షణ కేంద్రం అభివృద్ధికి

పారిశ్రామిక వేత్తలతో సమన్వయం : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నైపుణ్య శిక్షణ కేంద్రం అభివృద్ధికి దేశంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలను కలుపుకొని పోతామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని మెట్టు గడ్డ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఎమ్మెల్యేతో కలిసి, ప్రముఖ గ్లోబల్ కెపాబిలిటి సెంటర్ కంట్రోల్స్ సంస్థ డైరెక్టర్ రాజీవ్ త్రివేది బృందం శనివారం పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో శిక్షణా తరగతుల ఏర్పాటు, షెడ్ నిర్మాణం, శౌచాలయాల నిర్మాణం తదితర అంశాలపై రాజీవ్ త్రివేదితో ఆయన చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్ నగర్‌ను స్కిల్ డెవలప్మెంట్ హబ్‌గా అభివృద్ధి చేసి మహబూబ్‌నగర్ యువతకి నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

జంతువధశాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

మహబూబ్ నగర్ పట్టణం సమీపంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న జంతు వధశాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని కోయిల్ కొండ %ఠ% రోడ్ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న జంతు వధశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంతు వధశాలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డికి సూచించారు. జంతు వధశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎల్ఆర్ఎస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి...

ఎల్ ఆర్ ఎస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో సూపర్ వైజర్స్ మరియు ఆర్పీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్ ఆర్ ఎస్ కట్టుకునే వారికి ప్రభుత్వం చివరి అవకాశం కల్పిస్తూ ఈనెల 31 వరకు అవకాశం కల్పిస్తూ, 25శాతం రాయితీ కూడా కల్పించిందని ఆయన చెప్పారు. ఎల్ఆర్ఎస్ విషయంలో ప్రజలను చైతన్య పరుస్తూ వారికి సహకరించిన వారికి ఇన్సెంటివ్స్ ఇస్తామని, అలాగే మీరు చేసిన సేవలకు గాను గుర్తింపు ఇస్తూ ప్రశంసాపత్రాలను అందజేస్తామని ఆయన చెప్పారు. అంతకుముందు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఆడిటోరియాన్ని ఆయన పరిశీలించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, నాయకులు మాజీ కౌన్సిలర్ ప్రశాంత్, లీడర్ రఘు, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఆఫకాంతో కైజెన్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యం

విశాలాంధ్ర - హైదరాబాద్ : లీన్, కైజెన్ పద్ధతులలో ప్రత్యేకత కలిగిన ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ అయిన కైజెన్ ఇన్స్టిట్యూట్ ఇండియా, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడానికి నిరంతర మెరుగుదల సంస్కృతిని పొందుపరచడానికి ఆఫకాం హెూల్డింగ్స్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ సహకారం ఆఫకాం కార్యకలాపాలలో కైజెన్ సూత్రాలను ఏకీకృతం చేయడం, క్రమబద్ధీకరించబడిన ప్రక్రియలు, మెరుగైన ఉత్పాదకత మరియు దీర్ఘకాలిక వ్యాపార స్థితిస్థాపకతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. వ్యర్థాలను తొలగించడం, వర్క్‌ఫ్లోలను ఆప్టిమైజ్ చేయడం, ఎక్సలెన్స్-ఆధారిత మనస్తత్వాన్ని పెంపొందించడం ద్వారా స్థిరమైన వృద్ధిని సాధించడంలో సంస్థలకు సహాయపడటానికి కైజెన్ ఇన్స్టిట్యూట్ ఇండియా ప్రసిద్ధి చెందింది. పరిశ్రమలలో బలమైన ఉనికితో, సహ వ్యవస్థాపకుడు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జయంత్ మూర్తి నాయకత్వంలో ఉన్న ఈ సంస్థ భారతదేశం అంతటా వ్యాపార పరివర్తనలో కీలక పాత్ర పోషించింది.

యువత బెట్టింగులకు దూరంగా ఉండాలి

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : యువత బెట్టింగ్ లకు దూరంగా ఉండాలని, క్రికెట్‌ను వ్యాపార మయం చేస్తున్న ఐపీఎల్‌ను రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్రికెట్ గ్రౌండ్‌లో 3వ రోజు ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3వ రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై మాట్లాడుతూ క్రికెట్‌ను వ్యాపారమయం చేస్తున్న ఐపీఎల్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేవలం డబ్బులు ఉన్న బడా వ్యక్తులకు మాత్రమే అవకాశాలు వచ్చేలా ఉన్న వ్యవస్థను రూపుమాపాలని వారు అన్నారు. ఏఐవైఎఫ్ సంఘం ద్వారా క్రీడాకారుల సమస్యలపై పోరాటాలు సత్ఫలితాలిస్తాయని అన్నారు. బీసీసీఐ అంటే ప్రధాన మంత్రి, ప్రభుత్వం కాదని కేవలం క్రీడాకారులను తయారు చేసి, క్రీడల నిర్వహణ చేయడమే ప్రథమ కర్తవ్యం అన్నారు. కానీ, బీసీసీఐ క్రీడల అభివృద్ధి కన్నా ధన దోపిడీకే అధిక ప్రాధాన్యత ఇస్తుంద న్నారు. యువత బెట్టింగ్లు, ఆన్లైన్ గేమ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. యువత ఆన్లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలు తీసుకుంటూ కుటుంబాలకు శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. బెట్టింగులకు పాల్పడవద్దని, ఆన్లైన్ గేమ్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, సీపీఐ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు లెనిన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్, కళ్యాణ్, అనిల్, హేమంత్, బాలు, విజయ్, మహేష్‌తో పాటు 10 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

నేతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్నికల సందర్భంగా చేనేత రంగ అభివృద్ధికి కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు పరచేందుకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రవేశపెట్టే సుమారు 3 లక్షల కోట్లకుపైగా రాష్ట్ర బడ్జెట్‌లో జౌళీ శాఖతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా చేనేతకు 1000 కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టల్స్ మొదలైన ప్రభుత్వ రంగ సంస్థలకు కావలసిన వస్త్రాలను పొదుపు సంఘాల మహిళలకు రెండు చీరల చొప్పున పంపిణీ చేస్తామన్న చీరల ఉత్పత్తిని చేనేతకు కేటాయించి వెంటనే ఉత్పత్తిని ప్రారంభించేందుకు, ప్రతి కార్మికునికి నెలకు కనీసం రూ.18 వేల వేతనం వచ్చే విధంగా చర్యలు పట్టాలని, నేతన్న పొదుపు పథకం (త్రిఫ్టు) నుండి చేనేత కార్మికుల సంఖ్యను కుదించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విడనాడి నిజమైన చేనేత కార్మికులందరికీ ఆ పథకాన్ని ఇతర సంక్షేమ పథకాలను వర్తింపచేయాలన్నారు. నేతన్నల రుణమాఫీ ప్రకటన ప్రచారానికే పరిమితం కాకుండా తక్షణమే చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఆత్మహత్యల పాలైన కుటుంబాలకు 20లక్షల రూపాయలు ఎక్స్‌ఫ్రిషియో చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని, సహకార సంఘాలకు, టెస్కోకు వెంటనే ఎన్నికలు జరపాలని, చేనేతలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు జరపాలని లేనిచో నేతన్నల ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

యూట్యూబ్‌ల విషయంలో పాలసీ అవసరం

ఎమ్మెల్సీ వెంకట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏ ఆశలు, ఆకాంక్షల కోసం తెలంగాణ వచ్చిందో వాటినే బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదని ఎమ్మెల్సీ బలమూరి వెంకట్ అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిర్వీర్యం చేశారని, పార్టీ పేరులో అసలు తెలంగాణ పదమే లేకుండా చేసుకున్నారని దుయ్యబట్టారు. శనివారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకులు, కోర్టు కేసులతో కాలం గడిపారని, ఎప్పుడు పరీక్షలు జరుగుతాయో తెలియక నిరుద్యోగులు ఏండ్ల తరబడి హైదరాబాద్ కోచింగ్ సెంటర్లలో పడిగాపులు కాశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులకు చిత్త శుద్ధి లేకపోవడంతోనే నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని కానీ గత 14 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 57 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. నిరుద్యోగులకు అండగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వాలు బీసీలను రాజకీయంగా వాడుకున్నాయి తప్పా వారి కుల రిజర్వేషన్ల పెంపు, వారికి న్యాయం చేయలేక పోయాయని పేర్కొన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీ కుల గణన చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందని తెలిపారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మండల్ కమిషన్ వేసి 27 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. అప్పట్లో బిజెపీ నేత అద్వానీ తీవ్రంగా వ్యతిరేకించ్చారని, ఇప్పుడే బీఆర్ఎస్ నేతలు బీసీ రిజర్వేషన్లను బోగస్ అంటున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలో జరిగినవే అని ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో, కూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. మళ్లీ ఇప్పటి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయంలోనే రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ జరుగుతోందని చెప్పారు. మూసి పునర్ జీవనం విషయంలోనూ గత పాలకులు పదేళ్లు పట్టించుకోలేదని 2020 జిహెచ్ ఎంసీ ఎన్నికల సమయంలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో మూసి అభివృద్ధి గురించి ప్రస్థావించిన బిజేపీ, ఇప్పుడు ఎట్ల మాట మర్చిందో అందరికి తెలుసని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై కూడా రాజకీయాలు చేయడం సరికాదని, ఏ ప్రభుత్వం వున్నా వారు చేసే అభివృద్ధిని గవర్నర్ ప్రసంగంలో ఉంటుంది. దానిని కూడా రాజకీయం చేయడం సరి కాదని అన్నారు. ప్రజలకు ఉచితంగా అత్యంత ఉపయోగపడేవి విద్యం, వైద్యం అని అందులో భాగంగా ఎల్వోసీ, సిఎం ఆర్ఎఫ్‌లతో ఇప్పటికే ప్రభుత్వం ఎంతో సాయం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ అన్నీ ఆస్పత్రుల్లో అమలు చేస్తే మరింతగా మేలు జరుగుతోందని, ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. యూట్యూబ్‌ల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఓ పాలసీ తీసుకువస్తే బాగుంటుందని, కొంతమంది వ్యక్తిగత విషయాల్లోనూ జోక్యం చేసుకుని, అవాస్తవ కథనాలు రాస్తున్నారన్నారు. అన్ని పార్టీల నాయకులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

రేషన్ డీలర్ల కమిషన్ల నిధులను విడుదల చేయండి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత మూడు నెలలుగా కమిషన్ల నిధులు రాక రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి శనివారం శాసనమండలిలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రూ.70 కోట్లకు పైగా నిధులు బకాయిలు ఉన్నాయని, ఇటీవలనే చేగుంటలో రేషన్ డీలర్ ప్రభాకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, నిధులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ రేషన్ డీలర్లకు 5000 వేతనం, 300 కమిషన్ ఇస్తామని ఎన్నికల సమయం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయని, విద్యార్థులు అనారోగ్యాల బారినపడి చెందుతున్నారని, ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలల పురోగతిపై దృష్టి సారించాలని సూచించారు. గురుకుల పాఠశాలలో ముఖ్యంగా పేద విద్యార్థులు చదువుతారనే విషయాన్ని గ్రహించి, వాళ్లకు పౌష్టికాహారాన్ని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మల్కాజిగిరిలో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మల్కాజిగిరి చౌరస్తాలో జేఏసీ వెంకన్న, రామచర్ల నర్సింగ్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను శనివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దిగజారుడు రాజకీయాలతో తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతూ కేసీఆర్ మరణాన్ని కోరుకునే విధంగా చేస్తున్న మాట్లాడుతున్న తీరు దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని గానీ పార్టీ నాయకులు గానీ తెలంగాణ సమాజాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడితే తగిన విధంగా బుద్ధి చెప్తామని, మీ అహంకారాన్ని దించే విధంగా బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం హార్నిశలు తపించి రాష్ట్రాన్ని సాధించిన నాయకున్ని తలనాడే విధంగా మాట్లాడడం అవమానకరమని ముఖ్యమంత్రి మాటలను తెలంగాణ సమాజం సహించదని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పాలన ఉండాలే తప్ప ఈ విధంగా వ్యక్తిగత దూషణలతో రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే హెచ్చరించారు. దిష్టి బొమ్మ దగ్ధం చేయనీయకుండా అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా పోలీసులకు, బిఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఆ తర్వాత టిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచి కత్తిపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత రామ యాదవ్, రావుల అంజయ్య, బద్దం పరశురాం రెడ్డి, జగదీష్ గౌడ్, మురుగేష్, రాము యాదవ్, ఉస్మాన్, భాగ్యానందరావు, చిన్న యాదవ్, నర్సింగ్ రావు, బైరు అనిల్, శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిరాములు, శోభ, రాధిక, ఉపేందర్, బాబురావు, శివ గౌడ్, సాయి గౌడ్, మల్లేష్ యాదవ్, శంకర్, సుమన్, నవాబ్, మారుతి, సంతోష్ గుప్తా, మురళి నాయుడు, సంతోష్ నాయుడు, గడ్డమీది రాజు, శ్రీనివాస్ రెడ్డి, రమా, శ్రీలత, హంస వేణి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఘనంగా ఆర్.కె.ఎస్.సి 4వ వార్షిక జనరల్ బాడీ మీటింగ్

రాచకొండ పోలీస్ కమిషనరేట్, సెక్యూరిటీ కౌన్సిల్ భాగస్వామ్యం బలోపేతం చేస్తాం: సీపీ సుధీర్ బాబు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ 4వ వార్షిక జనరల్ బాడీ మీటింగ్ నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్.కె.ఎస్.సి సభ్య కంపెనీల ప్రతినిధులు, పలువురు డీసీపీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్, కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, నేర నియంత్రణ కోసం, మహిళల భద్రత కోసం రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ భాగస్వామ్యంతో ఎన్నో విభిన్న అంశాల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం రోడ్డు భద్రత పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు, పలు కళాశాలల్లో నిర్వహించిన ప్రత్యేక సెషన్లకు విద్యార్థుల నుండి విశేష స్పందన వచ్చినట్లు పేర్కొన్నారు. ఉమెన్ ఫోరమ్, రోడ్ సేఫ్టీ ఫోరమ్, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్ వంటి విభిన్న ఫోరమ్‌ల ద్వారా రాచకొండ పోలీసులకు పలు విధాలుగా సహాయకారిగా ఉంటూ సమాజంలో నేర నియంత్రణలో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నందుకు ఆర్.కె.ఎస్.సిని కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. యువతను విద్యార్థులను ఆర్.కె.ఎస్.సి. లో భాగస్వామ్యం చేయాలని, వారికి క్రీడలు మరియు ప్రతిభ ప్రదర్శన వంటి పోటీల నిర్వహణ ద్వారా వారిలో మరింతగా నూతన ఉత్తేజాన్ని నింపవచ్చని, సమాజం పట్ల వారి బాధ్యతను మరింతగా గుర్తు చేయవచ్చని తెలిపారు. మహిళా భద్రతతో పాటు వారి సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నామని, మహిళల కోసం ఉమెన్ ఫోరం ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1500 ఉద్యోగ ఖాళీలకు గాను దాదాపు 1800 మంది ఆశావహులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా, ఉద్యోగమేళాకు విశేష స్పందన వస్తున్నట్లుగా కమిషనర్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఆర్.కె.ఎస్.సి సభ్య కంపెనీలకు సమాజం పట్ల ఫ్యాషన్ ఉండాలని, సంస్థలో మరిన్ని కంపెనీలు భాగస్వామ్యం తీసుకోవాలని, సభ్యులందరూ మరింత ఉత్సాహంగా రాచకొండ కమిషనరేట్‌తో కలిసి పని చేయాలని, నేర నియంత్రణకు అవసరమైన తమ వంతు సూచనలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్.కె.ఎస్.సి జనరల్ సెక్రటరీ రఘువీర్ సంస్థ యొక్క వార్షిక బ్యాలెన్స్ షీట్ సభ్యులకు చదివి వినిపించారు. రాజంబాల్ 2023-24 సంవత్సరానికి సంబంధించిన బ్యాలెన్స్ షీట్ను చదివి వినిపించారు. జాయింట్ సెక్రటరీలు ఈ సంవత్సరం ఆర్.కె.ఎస్.సి సంస్థ తరఫున చేపట్టవలసిన కార్యక్రమాలను చర్చించారు. మల్కాజిగిరి డీసీపీ పి.వి.పద్మజ, డీసీపీ యాదాద్రి అక్షాంశ్ యాదవ్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాసులు, డిసిపి ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఆర్.కె.ఎస్.సి. వైస్ చైర్మన్ పి.సుధాకర్ దివిస్ ల్యాబ్, ఫోరమ్ వైజ్ జాయింట్ సెక్రటరీలు, సేఫ్టీ, సెక్యూరిటీ ఫోరమ్, వాసుదేవ్ రావు-గ్రూప్ డైరెక్టర్ సిడిసి స్విస్ట్ ఉమెన్స్ ఫోరం డాక్టర్ రాధికానాథ్, సాయి సెక్యూరిటీ డైరెక్టర్, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్ శివ కరాడి ఎస్ఏపి సీనియర్ కన్సల్టెంట్ ఇన్ఫోసిస్, ట్రాఫిక్ ఫోరమ్ శ్రీనివాస్, శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్ వ్యవస్థాపక డైరెక్టర్, సోషల్ ఔట్రీచ్ ఫోరమ్ వంశీ ప్రోగ్రామ్ మేనేజర్ ఇన్ఫోసిస్, ఆర్.కె.ఎస్.సి చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఏఐ విద్య

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ మండలంలోని మండల్ మల్లాపూర్‌లోని ప్రజా పరిషత్ పాఠశాల (ఎంపీపీఎస్)లో ఏఐ విద్యను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కూడా ఆధునిక విద్య, క్రిటికల్ థింకింగ్, ఎస్టిఈఎం ఎడ్యుకేషన్, డిజిటల్ లిటరసీ, దిగువ తరగతి నుంచి అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి తమ పాఠశాలను ఎంచుకోవడం సంతోషకరం అన్నారు. ఇది భవిష్యత్తులో విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. రానున్న సమాజంలో ఏఐ అనేది తారా స్థాయికి చేరుతుందని, పూర్తి భవిష్యత్తు దీనిపై ఆధారపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆకృతి ప్రాజెక్టు వాళ్ళు సహకారం అందించి తమ పాఠశాలకు 10 లాప్టాప్స్, ఒక స్మార్ట్ టీవీ అందించారని, వారికి కృతజ్ఞతలు చెప్పారు. వారి సహకారం వల్ల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ప్రధానోపాధ్యాయులు పద్మారావు, ఉపాధ్యాయుల బృందం, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆకృతి ప్రాజెక్ట్ సీనియర్ ప్రాజెక్ట్ లీడ్ సవిత, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ నూకల స్వాతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటునకు అనుమతులు జారీ

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు కేటాయించిన జవహర్ నవోదయ పాఠశాలలను బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసే విధంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించవలసిందిగా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని 25, జనవరి 2025 రోజున లేఖ ద్వారా కోరినట్లు తెలిపారు. న్యాయవాది దేవరకొండ వెంకటాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు స్పందించిన ప్రధానమంత్రి కార్యాలయం జవహర్ నవోదయ పాఠశాల మేడ్చల్ జిల్లాలో ఏర్పాటు చేయడానికి తాత్కాలిక, శాశ్వత వసతి కోసం తగిన స్థలం సూచించవలసిందిగా జిల్లా పాలనాధికారి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశామని, రాష్ట్రప్రభుత్వం స్థల కేటాయింపు జరిపిన వెంటనే పాఠశాల విధులు ప్రారంభమవుతాయని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొందని ఆయన వెల్లడించారు. అయితే జవహర్ నవోదయ పాఠశాలను బోడుప్పల్ పరిధిలో ఏర్పాటు చేసే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఇప్పటికే రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మేడ్చల్ జిల్లా పాలనాధికారిని ఇంతకు పూర్వమే తాను లేఖ ద్వారా విన్నవించినట్లు వెంకటాచారి పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుండి తనకు వచ్చిన స్పందనను జతపరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా పాలనాధికారికి మరొకసారి లేఖలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయ ఆదేశానుసారం త్వరలోనే జవహర్ నవోదయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి బోడుప్పల్ పరిధిలో పాఠశాల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆదివాసులు జీవించే హక్కును కాపాడాలి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారతదేశంలో ఆదివాసులపై కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు జరుపుతున్న మారణహోమాన్ని వెంటనే ఆపి, జీవించే హక్కును కాపాడాలని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి డిమాండ్ చేశారు. 115 వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా మార్చి 1 నుండి 30 వరకు రెండు తెలుగు రాష్ట్రాలల్లో ఎత్తిపట్టండని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ-విముక్తి) ఇచ్చిన పిలుపులో బాగంగా 2025, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మార్చి-8,అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. పీఓడబ్ల్యూ (విముక్తి) పి.సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో షేక్ షావలి ప్రసంగిస్తూ మార్చి-8 ప్రపంచ శ్రామిక మహిళా ఉద్యమ చరిత్రలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన రోజు అని గుర్తుచేశారు. ఆకశంలో సగం, మానవ జాతి పోరులో సగ బాగమైన మహిళలు అన్నిరకాల అసమానతలు, దోపిడీ, పీడన, అణిచివేత, వివక్షతలను నేటికీ ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 1910 కోపెన్ హెగెన్‌లో రెండవ అంతర్జాతీయ శ్రామిక మహిళా సదస్సు ఇచ్చిన పిలుపునందుకొని ప్రపంచ వ్యాప్తంగా తమ హక్కుల సంఘటిత సందేశ దినంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. ఇటీవల మధ్య భారతదేశంలో కేంద్రంలోని బీజేపీ నరేంద్రమోదీ, అమిత్ షాల ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో గత కొంత కాలంగా సామాన్య ఆదివాసి మహిళలను, పిల్లలను, యువకులను మావోయిస్టులనే ముద్రవేసి కేంద్ర మిలటరీ బలగాలు, పోలీసులచే ఎన్కౌంటర్ పేరుతో హతమార్చాడాన్ని ఖండించారు. అడవిని, పర్యావరణాన్ని, మూగజీవాలను కాపాడుతున్న గిరిజనులను అడవి నుండి బలవంతంగా గెంటివేయడానికి చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొట్టాయని అన్నారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేసి, శాంతియుత, ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన తగిన చొరవ చూపాలని షేక్ షావలి డిమాండ్ చేశారు. దేశంలోని మహిళల కట్టు, బొట్టు ఆచారాలతో పాటు ఆట, పాట, పని, చదువు, ఉద్యోగాల విషయాల్లో చులకన చేయబడుతున్నారని పి.సునీత గుర్తు చేశారు. స్త్రీ వ్యక్తిగత గోపత్యలను దెబ్బతీసి, ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నారని పేర్కొన్నారు. మణిపూర్, హర్యాన, గుజరాత్, ఢిల్లీ, ఉత్తర, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న హత్యలు, సామూహిక అత్యాచారాలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళలు వర్గపోరాటాలలో బాగస్వామ్యం కావాలని సభాధ్యక్షురాలు పి.సునీత ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులతో పాటు బలమైన విప్లవ శ్రామిక మహిళా పోరాట నిర్మాణానికై కృషి చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ, యమున, ఉమా తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పించాలని అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ (ఆస్రా) ఫౌండర్, సుప్రీంకోర్ట్ సీనియర్ అడ్వకేట్ హబీబ్ సుల్తాన్ అలీ అన్నారు. వినియోగదారుల చట్టం వచ్చి 35 ఏళ్లు గడుస్తున్నా చట్టంపై ప్రజలకు అవగాహన లేదని అన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం వర్క్‌షాప్‌లు ప్రచారాలు నిర్వహించాలన్నారు. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆస్రా ప్రతినిధులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్రా ప్రారంభమైన నుంచి ఇప్పటివరకు ఎన్నో వినియోగదారుల కేసులు పరిష్కరించామని తెలిపారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిరక్షణ చట్టాల అమలును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వ్యాపార సంస్థలు, పాలకులు, వినియోగదారులు కలిసికట్టుగా న్యాయమైన మార్కెట్ వాతావరణాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత ఉందన్నారు. డిజిటల్ వినియోగదారుల రక్షణ, ఆన్‌లైన్ మోసాలను నివారించడం, డేటా భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ ఎన్.వెంకటేష్ గుప్త, నేషనల్ లీగల్ కో-ఆర్డినేటర్స్ అడ్వకేట్ హరికుమార్, అడ్వకేట్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరేష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీధన్య, పీఆర్ఓ ప్రశాంత్, హైదరాబాద్ మాజీ మెంబెర్ కైలాష్, బీఎస్ఎస్ రాజు, రంజిత్ కుమార్, స్టేట్ మెంబెర్ ప్రవీణ, మహబూబ్ భాషా పాల్గొన్నారు.

5కె రన్‌కు గాంధీకి ఆహ్వానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళల విలువలు కోసం, వారి గౌరవం కోసం అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ నిర్వహిస్తున్న 5కే రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి నియోజక వర్గం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికేపూడి గాంధీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రతి రంగంలో మహిళలు ముందుండాలని వారి పురోగతికి అందరం కృషి చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి, కిషోర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సీఎం : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డి లేరు కాబట్టి ప్రజల మనోభావాలను అనుగుణంగా ఆయన నిర్ణయాలు ఉండడం లేదని, ముఖ్యమంత్రికి తెలంగాణ ఆత్మ లేదని మండిపడ్డారు. శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొని ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ రికార్డు స్థాయిలో వరి పండిందని గవర్నర్ తన ప్రసంగంలో అన్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే 2.6 కోట్ల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు కేవలం 64 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పండేదని గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి ఇదే నిదర్శనమని స్పష్టం చేశారు. కాళేశ్వరంలోని మేడిగడ్డను బూచిగా చూపించి మొత్తం తెలంగాణ పంటలను ఎండబెట్టడం సబబు కాదని సూచించారు. రైతులు పంటలను కాలపెట్టుకునే బాధాకర పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జలాలపై పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అదే నిజమైతే నాగార్జున సాగర్ ఇంకా తెలంగాణ ఆధీనంలోకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సాగర్ ఎడమ కాలువ నుంచి ఏపీ జలాలను తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నది అని నిలదీశారు. మహాలక్ష్మీ పథకాన్ని గేమ్ చేంజర్‌గా అభివర్ణించడం హాస్యాస్పదమన్నారు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇవ్వకుండానే మహాలక్ష్మి పథకం ఎలా పూర్తిగా అమలవుతున్నట్లు ? అని అడిగారు. మహిళలకు గ్యాస్ సబ్సిడీ సరిగ్గా అందడం లేదని, దీనిపై ప్రభుత్వం సమీక్షించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో కూడా ఆరోగ్య శ్రీ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచడం జరిగిందని, ప్రభుత్వ ఆస్పత్రులను కూడా కేసీఆర్ బలోపేతం చేశారని గుర్తు చేశారు. ప్రతీ జిల్లాలో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేయించారని, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతోందని ప్రశ్నించారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టేలోపు చట్టసభల్లో ఆ వివరాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. షమీమ్ అఖ్తర్ కమిషన్ నివేదికను కూడా అసెంబ్లీలో, మండలిలో పెట్టాలని సూచించారు. గంగా జమునా తెహజీబ్ వంటి తెలంగాణలో మైనారిటీలను కాంగ్రెస్ పార్టీ విస్మరిస్తోందని, మైనారిటీ మంత్రి లేకుండా ఎప్పుడూ మంత్రివర్గం లేదని అన్నారు.

సినీ నటుడు సుమన్‌ను కలిసిన బేరి రామచంద్ర

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : బీసీలకు మద్దతుగా అండగా ఉంటానని, బీసీలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని బీసీల బలోపేతానికి నేను అహర్నిశలు కృషి చేస్తానని సినీ హీరో సుమన్ తెలపడం పట్ల బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం సినీ యాక్టర్ సుమన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీఐకి వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర సలహాదారి బేరి రామచంద్ర యాదవ్, సంధన వేణి మహేందరనాథ్ యాదవ్ సౌధాని భూమన్న యాదవ్‌లు కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్లో బీసీలకు దామాషా పద్ధతిన రిజర్వేషన్లు కల్పనకై మీ మద్దతు కావాలని కోరగా వారు సానుకూలంగా స్పందిస్తూ మేము సైతం బీసీలకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని, బీసీల హక్కులకై పోరాటంలో భాగస్వాముల మవుతామని అన్నారు. నాయకులు టీఎస్ జీఎం టీవీఎస్ రాష్ట్ర సలహాదారి జాతీయ బీసీ కౌన్సిల్ మెంబర్ మహేంద్రనాథ్ యాదవ్ సర్పంచుల ఫోరం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలకు శ్రావ్యంగా కూచిపూడి నృత్యార్చన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి ఈ శనివారం సాయంత్రం అన్నమ స్వరార్చనలో భాగంగా "శ్రీ రాఘవ కూచిపూడి నృత్య సంగీత కళా నిలయం" సంస్థ నుండి "కరువది సాయి శ్రావ్య" వారి శిష్య బృందం, "ఏ. శ్రీగౌరీ, వి.తన్విక సిరి, చి.లాస్య, బి.పర్ణిక, ఓ.కీర్తి, బి.మనస్వి, జి.తాన్యశ్రీ, ఓ.లాస్య, యమ్.మేధ శ్రీ, బి.స్వర్ణ, బి.మిషిక, డి.నేహా, కే.లిక్షిత, పి.సహస్ర సాయి" సంయుక్తంగా "ఝుమ్ ఝుమ్ తానన, బ్రహ్మమొక్కటే, శ్రీమన్నారాయణ, భావంలోన బాహ్యమునందును, కులుకక నడవరో కోమలాల, నారాయణతే నమో నమో, ఇట్టి ముద్దులాడె బాలుడు, మధురాష్టకం, అష్టపది, వాసుదేవ కృష్ణ, జగడపు చనవుల, అష్టలక్ష్మి స్తోత్రం, అదివో అల్లదిగో శ్రీ హరి వాసం" మొదలైన బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమాచార్య సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలతో మురిపించి అందరి మన్ననలు పొందారు. అనంతరం కళాకారులకు, అన్నమాచార్య భావనా వాహిని పక్షాన సంస్థ నిర్వాహకులు జ్ఞాపికలను అందించారు.

నాగార్జుననగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - కాప్రా : వ్యక్తిగత కారణాలవల్ల అధ్యక్షుడు నామాల కృష్ణ పదవికి రాజీనామా చేసిన కారణంగా శనివారం కోశాధికారి యాపపురం రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షునిగా యాపపురం రవి, ప్రధాన కార్యదర్శిగా మొగిలి కరుణాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ సాదిక్, బైరంకొండ గోపాల్ యాదవ్, మచ్చ మహేందర్ గౌడ్, ఉప కోశాధికారిగా యేరుపుల సాయి వివేక్, సహాయ కార్యదర్శులుగా మేడిపల్లి శ్రీశైలం, బైరగోని వెంకటేష్ గౌడ్, సిద్ధ గౌని నాగరాజ్ గౌడ్ కార్యనిర్వాహక కార్యదర్శులుగా మహమ్మద్ జహంగీర్ పాషా, చింతల కొండల్ రెడ్డి లను ఎన్నుకున్నారు.

17న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఈనెల 17న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలను కోరారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు రేషన్ కార్డు తీసుకుని రావాలని క్లబ్ పిఆర్ఓ పాషా కోరారు.

మోటార్ సైకిల్ దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-ఆమనగల్లు: గత డిసెంబర్‌లో విటాయిపల్లి గ్రామానికి చెందిన సభావత్ వాల్య అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌ను తన ఇంటి ముందు పార్క్ చేయగా రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతని మోటార్ సైకిల్ దొంగలించడం జరగడంతో అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బైకు దొంగతనం చేసిన సరూర్నగర్ హైదరాబాద్‌కి చెందిన హాజీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతను వద్ద గల మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కి తరలించడం జరిగిందన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితులకు రిమాండ్

విశాలాంధ్ర - మేడిపల్లి : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉప్పు ఆదిత్య (24) వృత్తి బ్యాంక్ రికవరీ ఏజెంట్ తన స్నేహితుతలు సన్నీ, సుహాష్, సాయి, శ్రవణ్‌లతో కలిసి వెంకటాద్రి టౌన్ షిప్‌లో గల హెూలీ ఖేల్ ఈవెంట్‌కి వెళ్ళడం జరిగింది. అక్కడ సౌండ్ సిస్టమ్ దగ్గర ఉప్పు ఆదిత్య, జై కృష్ణ, శివశంకర్‌ల మధ్య తోపులాట జరగగా ఆదిత్య అతని స్నేహితులు అక్కడి నుండి వెళ్ళి నారపల్లి చౌరస్తాలో తన స్నేహితులు కోసం వేచి చూస్తుండగా వుండగా జై కృష్ణ, శివశంకర్ యాదవ్ ఇద్దరు వ్యక్తులు జరిగిన సంగటన మనసులో వుంచుకొని కావాలని ఆదిత్యను కత్తితో కడుపులో, చేతిపై పొడవగా బలమైన రక్త గాయాలయ్యాయి. ఆదిత్య తండ్రి ఫిర్యాదుపై మేడిపల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి అట్టి నింధితులైన జై కృష్ణ, శివశంకర్ యాదవ్‌లను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నీరుగొండ సతీష్‌బాబును పరామర్శించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర - కాప్రా : తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుగొండ సతీష్‌బాబు ఇటీవల కాళ్లకు సర్జరీ చేసుకున్న విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు కనకమేడల రాంబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్, టిఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు శివానంద్, టిడిపి నాయకులు వీరభద్ర రావు, రమేష్‌లు ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు.

ఉత్తమ ఉద్యోగిగా దాసరి రోహిత్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: కర్ణాటక రాష్ట్రంలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి రోహిత్ కుమార్ యాదవ్‌కు శనివారం దావనగిరిలో ఎస్బీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు దాసరి రోహిత్ కుమార్ యాదవ్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా దాసరి రోహిత్ కుమార్ యాదవ్ ను బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అభినందించారు. రోహిత్ కుమార్ యాదవ్‌కు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు రావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దాసరి రోహిత్ యాదవ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఉత్తమ ఉద్యోగి అవార్డును ఇచ్చిన ఎస్బీఐ బ్యాంక్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీసు జారీ

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరము ఆస్తి పన్ను బకాయిలు సుమారు 15.46 కోట్ల రూపాయలు చెల్లింపు చేయవలసి ఉన్నది. ఇట్టి చెల్లింపు సత్వరమే చెల్లింపునకు యజమానుదారులుకు రెడ్ నోటీసు జారీ చేయడం జరిగినది. ఇట్టి నోటీసు అందిన మూడు (3) రోజులలో చెల్లింపు చేయవలనని లేని యెడల వారి యొక్క చరాస్తి మున్సిపల్ చట్టం -2019 అనుసరించి జప్తు చేయుట జరుగుతుంది అని నోటీసు ద్వారా తెలిపారు. ఇట్టి రెడ్ నోటీసు అందిన ఆస్తి పన్ను చెల్లింపు చేయని సందర్భంగా చెంగిచర్ల యందు ఒక యజమాని షెడ్డును సీజ్ చేయడం జరిగినది. కావున పన్ను బకాయి దారులు ఆస్తి పన్ను సకాలములో చెల్లించాలని, నగర అభివృద్ధికి సహకరించగలరని కమీషనర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు.

సుచిత్రలో కొత్త స్టోర్ ప్రారంభించిన షాపర్స్ స్టాప్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : భారతదేశ ప్రముఖ ప్రీమియం ఫ్యాషన్, బ్యూటీ, గిఫ్టింగ్ గమ్యస్థలమైన షాపర్స్ స్టాప్, హైదరాబాద్‌లోని సుచిత్రలో తన తాజా స్టోర్‌ను ప్రారంభించి, తన విస్తరణ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఈ కొత్త స్టోర్ ముత్యాల నగరానికి ఒక అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని అందించనుంది, ఇందులో ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల ఎంపికను జాగ్రత్తగా కూర్చి ఉంచారన్నారు. షాపర్స్ స్టాప్ లిమిటెడ్ కస్టమర్ కేర్ అసోసియేట్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కవింద్ర మిశ్రా హైదరాబాద్‌లో కొత్త స్టోర్ ప్రారంభంపై స్పందిస్తూ, హైదరాబాద్ ఎప్పటికీ కీలక మార్కెట్‌గా ఉంది. వినియోగదారులతో మా సంబంధాన్ని మరింత బలోపేతం చేయడం మాకు ఎంతో ఉత్సాహాన్నిస్తుందన్నారు. సుచిత్రలోని ఈ కొత్త స్టోర్‌లో ఎంపిక చేసిన ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి మేము రూపకల్పన చేసాము. ప్రీమియం ఉత్పత్తులు, అత్యుత్తమ సేవ, వ్యక్తిగత అనుభవాలపై మా నిబద్ధత ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. ఈ ప్రారంభంతో, భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రిటైల్ రంగానికి అనుగుణంగా షాపర్స్ స్టాప్ తన కట్టుబాటును కొనసాగిస్తోంది. సుచిత్ర స్టోర్‌లో ప్రడా, వెర్సాచీ, ఆర్మానీ ఎక్స్చేంజ్, సెలియో, రారా రాబిట్, టామీ హిల్ఫిగర్, వేరో మోడా, కాల్విన్ క్లైన్, రే-బాన్, బాస్, చోపార్డ్, ఓన్లీ వంటి అంతర్జాతీయ భారతీయ టాప్ బ్రాండ్ల విస్తృత శ్రేణిని ప్రదర్శిస్తారు. వీటిలో కొన్ని బ్రాండ్లు ఈ ప్రాంతంలో కేవలం షాపర్స్ స్టాప్ ద్వారానే అందుబాటులో ఉంటాయి.

ఆ అబద్ధాలు నిజం కావు

పాకిస్థాన్ వైఖరిపై భారత్ ఆగ్రహం

ఐరాస: అంతర్జాతీయ వేదికగా భారత్‌పై నిందలేసేందుకు ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు ఎదురైంది. సంబంధం లేని అంశాల్లోకి జమ్మూకశ్మీర్ ప్రస్తావన తీసుకొచ్చిన పాక్‌కు న్యూదిల్లీ గట్టిగా బదులిచ్చింది. ఆ దేశానిది మతోన్మాద మనస్తత్వమని దుయ్యబట్టింది. ఇలాంటి వ్యాఖ్యలతో అబద్ధాలను నిజం చేయలేరని, సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరని మండిపడింది. అంతర్జాతీయ ఇస్లామోఫోబియా నిర్మూలన దినం సందర్భంగా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాకిస్థాన్ ప్రతినిధి, ఆ దేశ విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి తెహ్‌మినా జంజువా మాట్లాడుతూ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఐరాసకు భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ పాక్ తీరును ఎండగట్టారు. 'అలవాటు మాదిరిగానే భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌పై పాక్ ప్రతినిధి అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. పదే పదే అవాస్తవాలు చెప్పినంత మాత్రాన... వారి వాదన నిజం కాదు. ఈ వ్యాఖ్యలతో వారు చేస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరు. ఆ దేశ మతోన్మాద మనస్తత్వం ఏంటో అందరికీ తెలుసు. ఇలాంటి కుటిల ప్రయత్నాలు జమ్మూకశ్మీర్ వాస్తవ అంశాలను ఎన్నటికీ మార్చలేవు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే' అని హరీశ్ స్పష్టంచేశారు. భారత్ వైవిధ్యత, బహుళత్వాన్ని గౌరవిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో మత వివక్ష ఎక్కడున్నా న్యూదిల్లీ తన వాదనను వినిపిస్తుందని వ్యాఖ్యానించారు. ఇటీవల కూడా భారత్‌పై పాక్ నోరుపారేసుకున్న సంగతి తెలిసిందే. బలూచిస్థాన్‌లో జరిగిన రైలు హైజాక్ ఘటనపై ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి షఫ్‌ఖత్ అలీఖాన్ మాట్లాడుతూ న్యూదిల్లీపై నిందలు వేశారు. దీనిపై భారత విదేశాంగ శాఖ ఘాటుగా స్పందించింది. ఉగ్రవాదానికి మూలం ఎక్కడుందో యావత్ ప్రపంచానికి తెలుసని పాక్‌ను దుయ్యబట్టింది. అంతర్గత సమస్యలు, వైఫల్యాలకు ఇతరులను నిందించేబదులు పాకిస్థాన్ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికింది.

రెట్టింపు పనిచేస్తా

- మీ సహకారం అవసరం
- స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి
- తణుకు సభలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-తణుకు/భీమవరం: స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, ఇళ్లతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, రూ.10 లక్షల కోట్ల అప్పులభారం ప్రజలపై మోపారని, తాము రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్నారు. ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 1978 మార్చి 15వ తేదీన 45 ఏళ్ల క్రితం ఇదే రోజు తాను మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టానని గుర్తుచేసుకున్నారు. ఈ రాష్ట్రంలో అసాధారణ గౌరవం తనకు దక్కిందన్నారు. తెలుగు ప్రజలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని, పాలనలో సంస్కరణలు తెస్తున్నామని చంద్రబాబు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికను ప్రజలు ఆశీర్వదించారని, కేంద్ర సహకారంతో రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందన్నారు. స్వర్ణాంధ్ర 2047 పేరుతో స్పష్టమైన విధానం తీసుకొచ్చామన్నారు. గత పాలకులు ఏనాడైనా ప్రజల్లో తిరిగారా? పరదాలు కట్టుకుని వచ్చారు. గాల్లో వస్తుంటే నేలపై చెట్లు నరికించారు. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితులు లేకుండా చేశారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేసి రూ.10 లక్షల కోట్ల అప్పులు ప్రజలపై మోపారు. తాము అసలు, వడ్డీ కడుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు. రాజముద్రతో పట్టాదారు పుస్తకాలు ఇవ్వాలని తాము సంకల్పించామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో లక్షల ఎకరాల భూములు కబ్జా చేసేందుకు కుట్ర చేశారని గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. స్థిరమైన ప్రభుత్వంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. 2004లో టీడీపీని గెలిపిస్తే ఆంధ్రప్రదేశ్ ఎక్కడికో వెళ్లేదని, 2019లో గెలిపించినా విభజన రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకునేవారమన్నారు. ఇందులో ప్రజలతో పాటు తన తప్పు ఉందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో పింఛన్లు పెంచిన చరిత్ర టీడీపీదేనన్నారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామన్నారు. మే నెల నుంచి ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం అందిస్తామని సీఎం పునరుద్ఘాటించారు. గత ఐదేళ్లు అభివృద్ధి అన్న మాట లేకపోవడంతో దక్షిణ భారతదేశంలో తక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా ఏపీ నిలిచిందన్నారు. గత పాలకుడు ఐదేళ్లలో కనీసం మట్టి కూడా తీయలేదని, 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మనకు వారసత్వంగా ఇచ్చారన్నారు. మున్సిపల్ కార్మికులను ఆదుకునే బాధ్యతను తీము తీసుకుంటామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు ముందుకొచ్చిన వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. మళ్లీ 95 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని, అక్టోబర్ 2 తర్వాత రాష్ట్రమంతటా ఆకస్మిక తనిఖీలు చేస్తానని తెలిపారు. తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ డైనమిక్ లీడర్ అని, తణుకులో అభివృద్ధి పనులకు నిధులు కావాలని అడిగారన్నారు. నిధులు తప్పకుండా మంజూరు చేస్తానన్నారు. అంతకుముందు తణుకు కూరగాయల హోల్ సేల్ మార్కెట్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. వ్యాపారం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఎన్టీఆర్ పార్కులో చెత్తను ఊడ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.

18న ఓటరు కార్డు, ఆధార్ అనుసంధానంపై సీఈసీ చర్చలు



న్యూదిల్లీ: ఓటర్ల జాబితాలలో భారీగా అక్రమాలు జరుగుతుండటంపై విపక్షాలు మండిపడుతున్న వేళ ఆధార్‌తో ఓటర్ కార్డు అనుసంధానంపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం ఈనెల 18న జరగబోతోంది. వివిధ రాష్ట్రాల్లో ఓటర్లకు నకిలీ ఓటరు కార్డు నంబర్లు కేటాయిస్తున్నట్లు కేసులు కూడా నమోదయ్యాయి. బీజేపీకి మద్దతుగా ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు మార్చేస్తున్నారని టీఎంసీ ఆరోపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలప్పుడు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం ఇదే తరహా ఆరోపణలు చేశారు. నకిలీ కార్డు నంబర్లను 'వారసత్వ అంశం'గా అభివర్ణించారు. అయితే ఈ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని ఎన్నిక సంఘం భరోసా ఇచ్చింది. అలాగే డూప్లికేట్ నంబర్లు ఉండటం అంటే అవన్నీ నకిలీ ఓటర్లు కాదని పేర్కొంది. ఇదే క్రమంలో సంబంధిత అన్ని అంశాలపై మంగళవారం ఉదాయ్ సీఈఓ, హోంశాఖ, శాసనసభ కార్యదర్శితో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చర్చించనున్నారు. ఓటర్ల డేటాలో అక్రమాల కట్టడి దిశగా ఓటరు-ఆధార్ కార్డుల సీడింగ్ కోసం చేపట్టే చర్యలపై సంప్రదింపులు జరపనున్నారు. కాగా, ఓటరు కార్డుతో ఆధార్ అనుంధానమన్నది సమయంతో కూడుకున్న ప్రక్రియ కాబట్టి ఇందుకోసం ఎలాంటి గడువును నిర్దేశించలేదని పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే ఓటరు కార్డులను ఆధార్‌తో అనుంధానం చేసుకోని వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించమని కూడా వెల్లడించింది. ఇదిలావుంటే, ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో బీజేపీ అక్రమాలకు పాల్పడుతోందని, ఓటర్ల జాబితాలను మార్చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల ఎన్నికలప్పుడు అనేక మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించిందని దుయ్యబట్టాయి. ఈ అక్రమాల కట్టడి కోసం చర్యలను కోరాయి.

అరసం జెండా పెనుగొండ

ఎస్వీ సత్యనారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: అభ్యుదయ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ అరసం జెండా అని ప్రముఖ అభ్యుదయ రచయిత, తెలుగు యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో పెనుగొండ లక్ష్మీనారాయ ణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం శనివారం ఏర్పాటు చేసిన పెనుగొండ సన్మానసభకు ఎస్వీ అధ్యక్షత వహించారు. సభలో పెనుగొండ లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ దశాబ్దాలుగా అభ్యుదయ సాహిత్యోద్యమ విస్తృతికి ఇతోధిక కృషి చేస్తున్నరని అన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా పనిచేస్తూనే... అనేక విమర్శ నాత్మక గ్రంథాలు రాశారని, ఆయన రాసిన దీపిక గ్రంథానికి అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. అవార్డుకు ఆయన అన్నివిధాలుగా అర్హుడని కొనియా దారు. నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాద కులు, ప్రముఖ రచయిత డా.ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం అరసం జెండాను భుజాన వేసుకొని అభ్యుదయ సాహిత్యోద్యమంలో కొనసాగడం చిన్నవిషయం కాదని, ఆయన... ఆయన సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీతో విడదీయరాని అనుబంధం పెనుగొండది అని అన్నారు. ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, అరసం అధ్యక్షుడు పల్లేరు వీరాస్వామి, ప్రముఖ రచయిత కోయి కోటేశ్వరరావు, అరసం కార్యనిర్వాహక కార్యదర్శి కేవీఎల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, అరసం నగర కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్, తిరుపాల్ తదితరులు మాట్లాడారు. పల్లేరు వీరాస్వామి రాసిన వీక్షణం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

214 మంది బందీలను చంపేశాం

బలూచ్ తిరుగుబాటుదారుల ప్రకటన

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలూచ్ మిలిటెంట్లు మంగళవారం ప్రయాణికుల రైలును హైజాక్ చేశారు. దీనికి సంబంధించి బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) శనివారం కీలక ప్రకటన చేసింది. తమ రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగియడంతో తమ చెరలో ఉన్న 214 మంది పాక్ బందీలు, సైనికులను చంపేశామని పేర్కొంది. ఆపరేషన్ ముగిసిందంటూ పాక్ ప్రభుత్వం చేసిన ప్రకటనను ఖండించింది. 'మా రాజకీయ ఖైదీల విడుదలకు పాకిస్థాన్ సైన్యానికి 48 గంటల సమయం ఇచ్చాం. మా చెరలో బందీలుగా ఉన్న వారిని రక్షించుకునేందుకు సైన్యానికి మేము ఇచ్చిన చివరి అవకాశం. కానీ, పాక్ తన మొండితనాన్ని, సైనిక దురహంకారాన్ని ప్రదర్శించింది. ఫలితంగా శత్రు సైన్యానికి చెందిన 214 మందిని మేం హతమార్చాం. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే బీఎల్ఏ వ్యవహరిస్తుంది. అయితే ఇస్లామాబాద్ సైన్యం తమ సిబ్బందిని కాపాడుకునేందుకు బదులుగా తమతో పోరాడాలని ప్రయత్నించింది. ఫలితంగా బందీలను కోల్పోయింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లోని బందీలను రక్షించేందుకు పాకిస్థాన్‌లోని ఎస్ఎస్‌జీ కమాండోలు రాగానే తమ యోధులు వారిని చుట్టిముట్టి భీకర దాడి చేశారు. గంటల పాటు సాగిన ఈ దాడుల్లో కొంతమంది బందీలను ఉరితీయగా... ఎస్ఎస్‌జీ కమాండోలు భారీ ప్రాణనష్టాన్ని చవిచూశారు. తమ వాళ్లు చివరి బుల్లెట్ వరకు పోరాడారు. చనిపోయిన తిరుగుబాటుదారుల మృత దేహాలను చూపించి విజయం సాధించామని ఇస్లామాబాద్ ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చుతోంది. సైన్యం, ఇంటెలిజెన్స్ బృందం ఉన్నప్పటికీ బందీలను రక్షించుకోవడంలో శత్రు సైన్యం విఫలమైంది. యుద్ధ సూత్రాలకు కట్టుబడి తాము విడుదల చేసిన వారిని కాపాడినట్లు ప్రకటించుకుంటుంది. ఈ యుద్ధం ఇంకా ముగియలేదు. బలూచ్ యోధులు వివిధ ప్రాంతాల్లో మెరుపుదాడులతో ఆక్రమిత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో బలూచ్ విజయం సాధించిందని మిలిటెంట్ సంస్థ పేర్కొంది. హైజాక్ సమయంలో మరణించిన బీఎల్ఏలకు మిలిటెంట్ సంస్థ నివాళు లర్పించింది. పాక్‌లోని క్వెట్టా నుంచి పెషావర్‌కు 440 మంది ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలూచ్ వేర్పాటువాదులు హైజాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది బందీలు మరణించగా... దాదాపు 33 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టి మిగతా ప్రయాణికులు అందరినీ సురక్షితంగా విడిపించామని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. బలూచ్ మిలిటెంట్లు చంపిన 26 మంది బందీల్లో 18 మంది సైనికులని పాక్ ఆర్మీ కూడా పేర్కొంది. ఈ ఆపరేషన్ ముగిసినట్లు ప్రకటన విడుదల చేసింది. అయితే, బలూచ్ మిలిటెంట్లు ఇందుకు విరుద్ధంగా పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి లోకేశ్

విశాలాంధ్ర-మంగళగిరి: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, ప్రజలు తనపై బాధ్యత పెట్టారని.. అందరం కలిసికట్టుగా మంగళగిరిని అభివృద్ధి చేసుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఆల్ఫా టీ స్టాల్ వద్ద పారిశుద్ధ్య కార్మికులతో మంత్రి లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం నిర్వహణలో గడచిన 10 నెలల్లో మంగళగిరిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ప్రజల్లో కూడా చైతన్యం తీసుకువచ్చి రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని, పారిశుద్ధ్యం, స్వచ్ఛతలో దేశంలోని అన్ని కార్పొరేషనల్లో మంగళగిరిని నంబర్ వన్‌గా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణకు అవసరమైన సామాగ్రిని కూడా రూ.90 లక్షలు వెచ్చించి అందు బాటులో ఉంచామని చెప్పారు. ముఖా ముఖిలో పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. రాజధాని ప్రాంతం కావడంతో జనాభా పెరిగారని, కార్మికుల సంఖ్యను, వాహనాల సంఖ్యను పెంచాలని పారిశుద్ధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు. కార్మికులు, వాహనాల సంఖ్య పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదని అనేక మంది కార్మికులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ... గతంలో ఆప్కాస్ ద్వారా గందరగోళం సృష్టించారని, ఇప్పుడు కార్పొరేషన్‌లో విలీనంతో సమస్య ఉండదని, ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. మహిళా పారిశు ద్ధ్య కార్మికులకు మరుగుదొడ్ల సౌకర్యం, కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని, ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. మంగళగిరిలో మొదటి విడతలో 6 మరుగుదొడ్లు ఏర్పాటుచేస్తామని, భూగర్భ డ్రైనేజీ, అండర్ వాటర్ పైప్ లైన్ నిర్మిస్తామని, జూన్ నాటికి పనులు ప్రారంభించి ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భూగర్భ గ్యాస్, పవర్ కూడా అందిస్తామన్నారు. మంగళగిరిలో త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని, 11 వేల మందిని అర్హులుగా గుర్తించామని, ఇళ్లు లేనివారికి ఇళ్లు నిర్మిస్తామని ఆయన తెలిపారు. టిడ్కో ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను మంత్రి లోకేశ్ సత్కరించారు. అందరితో కలిసి ఫోటోలు దిగారు. సామాన్యుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఏడు రోజులు జైలు తిండి తిన్నా

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

గువహతి: అసోంలోని డెర్గావ్‌లో 'లచిత్ బర్ఫుకాన్ పోలీస్ అకాడమీ'ని శనివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మిజోరంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఒకప్పుడు అసోంలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తనను కొట్టడం, జైలులో పెట్టడం జరిగిందని, ఏడు రోజుల పాటు జైలు తిండి తిన్నానని అమిత్‌షా చెప్పారు. అప్పుడు ముఖ్యమంత్రిగా హితేశ్వర్ సైకియా ఉన్నారు. మేము ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా 'అస్సాం కీ గాలియాన్ సునీ హై, ఇందిరా గాంధీ ఖూనీ హై' అనే నినానాలు ఇచ్చేవాళ్లం. నేను కూడా అసోంలో జైలు తిండి తిన్నాను. అసోంని కాపాడేందుకు యావద్దేశం నుంచి ప్రజలు వచ్చారు. ఈరోజు అసోం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోంది' అని అమిత్‌షా తెలిపారు. అసోం సీఎంగా హితేశ్వర్ సైకియా 1983-85, 1991-1996 వరకూ ఉన్నారు. మొఘలులకు వ్యతిరేకంగా విజయం సాధించడంలో అసోంకు సహకరించిన పోరాట యోధుడు లచిత్ బర్ఫూకాన్ అని, ఆయన పేరును పోలీసు అకాడమీకి పెట్టిన సీఎం హిమంత్ శర్మ అభినంద నీయుడని అమిత్‌షా అన్నారు. లచిత్ బర్ఫూకాన్ అసోంకే పరిమితమైనప్పటికీ ఆయన బయోగ్రఫీ 23 భాషల్లో వెలువడి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. రాబోయే ఐదేళ్లలో లచిత్ బర్ఫుకాన్ పోలీసు అకాడమీ దేశంలోనే నెంబర్ వన్ అవుతుందన్నారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలు తిప్పికొట్టాలి

- విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయాలి
- రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం విజయవాడలోని దాసరి భవన్‌లో శనివారం జరిగింది. గత కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. రామకృష్ణ మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలను బీజేపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలోకి చొప్పిస్తోందని విమర్శించారు. యూజీసీని అడ్డుపెట్టుకొని రాష్ట్రాల విద్యా హక్కులు హరించడానికి కుట్ర చేస్తోందన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ కేంద్రాల్లో దాదాపుగా నాలుగు వేల ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని అన్నారు. బోధన సిబ్బంది లేకపోతే శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులకు ఎలా అందిస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ కేంద్రాల్లో విధ్వంసం జరుగుతున్నా విద్యాశాఖ మంత్రి ఆలోచన చేయకుండా త్రిభాషా సూత్రంపై తమిళనాడు సీఎం స్టాలిన్ వైఖరి సరైకాదని మాట్లాడటం దారుణమ న్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితులు ఉన్నా ప్రభుత్వం కుంటిసాకులు చెబుతోంద న్నారు. జీవో 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీల పెంపుదల కోసం, మౌలిక సదుపాయాల కోసం దశలవారీ ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.సాయికుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది మాసాలు గడుస్తున్నా మెడికల్ కౌన్సిల్‌కి చైర్మన్‌ను నియమించలేకపోవడం దారుణమన్నారు. చైర్మన్‌ను నియమించ కపోవడం వల్ల వైద్యవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం నెలలు తరబడి వేచి చూస్తున్నారని అన్నారు. కుట్రలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తోందని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీశ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

హోంగార్డుల వేతనాలు పెంచండి

మంత్రి అనితకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: హోంగార్డుల వేతనాల పెంపుదల, పోలీస్ సెలక్షన్స్‌లో రాయితీలు అమలు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం హోంశాఖమంత్రి వంగలపూడి అనితకు లేఖ రాశారు. గర్భిణీగా ఉన్న మహిళా కానిస్టేబుల్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆమెకు శ్రీమంతం చేసిన మీ సహృదయానికి అభినందనలు. రాష్ట్రంలోని పాత 13 జిల్లాల్లో 15 వేల మందికిపైగా హోంగార్డులు పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారు చాలాకాలంగా చాలీచాలని వేతనంతో కుటుంబ భారం మోస్తున్నారు. ఎక్కువ మంది హోంగార్డులు పట్టణాల్లో, నగరాల్లో నివాసముండటంతో వారిపై ఇంటి అద్దెల భారం తీవ్రమై... జీవన స్థితిగతులపై మరింత ప్రభావం కలిగిస్తున్నది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకుతోడు పిల్లల చదువులు, వైద్యం తదితర ఖర్చుల భారం అధికమవ్వడం వలన నలుగురు సభ్యులున్న హోంగార్డు కుటుంబానికి ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదు. తెలంగాణ ప్రభుత్వం హోం గార్డులకు నెలకు రు.25 వేలు వేతనంగా ఇస్తున్నది. పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికలో వయో పరిమితి 40 ఏళ్లుగా చేయడంతో పాటు హోంగార్డుల కోటా విషయంలో కొన్ని సడలింపులు చేశారు. హోంగార్డు లకు రెండు పడకల గదుల ఇళ్లు, కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య భీమా కల్పిస్తామని, పోలీసు, ఇతర విభాగాల్లో నియామకాలకు కోటాల పెంపు, పోలీసు ఆసుపత్రుల్లోనూ చికిత్సకు అవకాశం తదితర సంక్షేమ పథకాలు కల్పించింది. మన రాష్ట్రంలో కూడా హోంగార్డుల సమస్యలపై దృష్టిసారించి, తెలంగాణ తరహాలో వేతనం పెంపుదలతోపాటు పోలీస్ సెలక్షన్స్‌లో నిబంధనలు సడలింపు వంటి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.

పాప్‌కార్న్ తర్వాత డోనట్స్ వంతా!

జీఎస్టీ రేట్లపై కాంగ్రెస్ ధ్వజం

న్యూదిల్లీ: దేశంలో వేర్వేరు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలుపై కాంగ్రెస్ శనివారం కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమ ర్శలు గుప్పించింది. పాప్‌కార్న్ తర్వాత ఇప్పుడు డోనట్స్ వంతు వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్) జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో ఈ విమర్శలు చేశారు. సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న మ్యాడ్ ఓవర్ డోనట్స్ తన వ్యాపారాన్ని తప్పుగా వర్గీకరించి, బేకరీ వస్తువులపై 18 శాతం పన్ను చెల్లించడానికి బదులుగా, రెస్టారెంట్ సేవ అని చెప్పుకుంటూ 5 శాతం జీఎస్టీ చెల్లించడం ద్వారా రూ.100 కోట్ల పన్ను నోటీసును ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. 'పాప్ కార్న్ తర్వాత ఇప్పుడు జీఎస్టీటీస్ బారిన పడే వంతు డోనట్స్ వచ్చింది' అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయం ఇప్పుడు బాంబే హైకోర్టులో ఉందని పేర్కొంటూ, 'వ్యాపారం చేయడం సౌలభ్యం' కోసం చాలా అవసరం. అందుకే జీఎస్టీ 2.0 చాలా అత్యవసరం' అని జైరాం రమేశ్ నొక్కి చెప్పారు. గత ఏడాది డిసెంబరులో జీఎస్టీ కింద పాప్ కార్న్‌కు మూడు వేర్వేరు పన్ను స్లాబ్‌ల 'అసంబద్ధత' వ్యవస్థకు సంబంధించి పెరుగుతున్న సంక్లిష్టతను వెలుగులోకి తెస్తుందని కాంగ్రెస్ పేర్కొంది. జీఎస్టీ 2.0ని ఏర్పాటు చేయడానికి పూర్తి సవరణను ప్రారంభించడానికి మోదీ ప్రభుత్వం ధైర్యం చేస్తుందా అని ప్రశ్నించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీ రేట్లు మరింత తగ్గుతాయని నొక్కి చెప్పడంతో గత ఆదివారం కాంగ్రెస్ పన్నులో ఏవైనా మార్పులు కేవలం రేటు తగ్గింపు కంటే మరింత సమగ్రంగా ఉండాలని, తీవ్రంగా సరళీకృతం చేయబడిన, తక్కువ శిక్షాత్మకమైన జీఎస్టీ 2.0 అవసరాన్ని నొక్కి చెప్పింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.